thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 210 కరీంనగర్ మంగళవారం, 7 అక్టోబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## డార్జిలింగ్‌లో వరుణుడి బీభత్సం

డార్జిలింగ్ : పశ్చిమ బెంగాల్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం డార్జిలింగ్‌లో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాల వల్ల డార్జిలింగ్, ఆ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో వరద పోటెత్తగా, చాలా చోట్ల పెద్ద ఎత్తున కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో డార్జిలింగ్, ఆ జిల్లాలోని మిరీక్ సహా ఇతర ప్రాంతాల్లో ఆదివారం జరిగిన ఘటనల్లో పలువురు చిన్నారులు సహా 20 మంది ప్రాణాలు కోల్పోయారు.ఒక్క మిరీక్ ప్రాంతంలోనే 11 మంది ప్రాణాలు కోల్పోగా ఏడుగురు గాయపడ్డారని ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ప్రకటించాయి. మిరీక్, సిలిగురి ప్రాంతాలను కలిపే బాలాసోన్ నదిపై దుదియాలో ఉన్న ఓ వంతెన కూలిపోయింది. దీంతో పరిసర ప్రాంతాలకు రాకపోకలు పూర్తిగా తెగిపోయాయి. కొండచరియలు విరిగి పడడంతో పెద్ద సంఖ్యలో ఇళ్లు ధ్వంసమై చాలా మంది నిరాశ్రయులవ్వగా.. పలువురి ఆచూకీ గల్లంతయింది.



# ఢిల్లీ చేరిన 'జూబ్లీహిల్స్'

## కొల్లిక్కిరాని కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక!

## మళ్లీ రంగంలోకి దిగిన అజాహరుద్దీన్!

హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కొత్త ట్విస్టులు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతను తమ అభ్యర్థిగా బీఆర్ఎస్ ప్రకటించింది. అటు బీజేపీ అభ్యర్థి ఖరారు కోసం కమిటీ ఏర్పాటు చేసింది. ప్రముఖ సినీ నటి బీజేపీ నుంచి బరిలోకి దిగే అవకాశం కనిపిస్తోంది. ఈ సమయంలోనే కాంగ్రెస్ లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అభ్యర్థి ఖరారు పైన మంత్రుల కమిటీ ముగ్గురు పేర్లు సూచించింది. అయితే, ఢిల్లీలో మారుతున్న లెక్కల మేరకు అభ్యర్థి ఖరారు వేళ ఊహించని ట్విస్ట్ తెర మీదకు వచ్చింది. జూబ్లీహిల్స్ లో గెలుపు ఇప్పుడు కాంగ్రెస్ కు ప్రతిష్టాత్మకంగా మారింది. ఇతర పార్టీల కంటే ముందుగానే ఇక్కడ గెలుపు కోసం ముగ్గురు మంత్రులతో కమిటీ... పలువురు నేతలతో ప్రచారం కోసం ఏర్పాట్లు చేసారు. ఎంఐఎం సహకారం పైన అంతర్గతంగా సమీక్షలు చేస్తున్నారు. అందులో భాగంగా ఈ సీటు నుంచి గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అజాహరుద్దీన్ తిరిగి పోటీ చేయాలని భావించారు. కాగా.. అజాహరుద్దీన్ ను ఎమ్మెల్సీగా పంపి.. ఇక్కడ నుంచి బీసీ అభ్యర్థికి అవకాశం ఇవ్వాలని సీఎం రేవంత్ ఆలోచనగా తెలుస్తోంది. తాజాగా ముగ్గురు మంత్రులు సైతం నవీన్ యాదవ్, బొంతు రామ్మోహన్, కార్పోరేటర్ సీఎన్ రెడ్డి పేర్లు సిఫారసు చేసినట్లు తెలుస్తోంది. కాగా.. మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ ఇప్పటికే ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి.. సీటు కోసం ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ ముమ్మరం చేసారు. ఇక..అజారుద్దీన్ ఎమ్మెల్సీగా ఎంపిక చేయటంతో.. నవీన్ యాదవ్ కు టికెట్ ఖాయమన్న ప్రచారం జరిగింది. తన కొడుకు రాజ్యసభ సభ్యుడైతే ఏంటి.. తాను ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని అంజన్ కుమార్ యాదవ్ చెబుతున్నారు. ఈ మేరకు ఢిల్లీ స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. మరో వైపు సికింద్రాబాదు ఎంపీ అభ్యర్థిగా ప్రయత్నాలు చేసిన మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పూర్తిగా సీఎం రేవంత్ పైనే ఆశలు పెట్టుకున్నారు. మంత్రుల కమిటీ సైతం రామ్మోహన్ పేరును తమ జాబితాలో సిఫారసు చేసారు. కాగా.. ఇప్పుడు మైనంపల్లి హనుమంతరావు రేసులోకి వచ్చారు. దీంతో.. కాంగ్రెస్ నాయకత్వం అభ్యర్థి ఖరారు విషయంలో తర్జన భర్జన పడుతోంది. పార్టీ రాష్ట్ర నేతలు స్థానిక సంస్థలతో పాటుగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పైన వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలోనే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అభ్యర్థి పైన ఢిల్లీ కేంద్రంగా కొత్త లెక్కలు తెర మీదకు వస్తున్నాయి. ఎంఐఎం అధినేత అసద్ తాజాగా చేసిన వ్యాఖ్యలు సైతం కాంగ్రెస్ కు అనుకూలం గా ఉన్నాయి. బీఆర్ఎస్ మాగంటి కుటుంబానికే సీటు ఇవ్వటం.. బీజేపీ నుంచి సినీ నటి జయసుధ పేరు రేసులోకి రావటంతో ఢిల్లీ కాంగ్రెస్ నాయకత్వం పునరాలోచనలో పడినట్లు పార్టీ నేతల సమాచారం. ఇదే సమయంలో ఎమ్మెల్సీ పదవి పైన ఉన్న న్యాయపరమైన చిక్కులతో తాను మండలికి వెళ్లటం సాధ్యమేనా అనే సందేహంతో అజాహరుద్దీన్ ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన మద్దతుదారులు సైతం జూబ్లీహిల్స్ నుంచే పోటీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో.. ఢిల్లీలో నేరుగా పార్టీ అధినాయకత్వం వద్ద అజాహరుద్దీన్ తిరిగి ప్రయత్నాలు మొదలు పెట్టారు. దీంతో.. ఇప్పుడు కాంగ్రెస్ హైకమాండ్ అభ్యర్థి పైన తుది నిర్ణయం పార్టీలో ఉత్కంఠగా మారింది.

# మరో దంగల్..

## బిహార్ ఎన్నికల షెడ్యూల్ ఇదే.. కౌంటింగ్ ఎప్పుడంటే..?




బీహార్‌లో ఎన్నికల బెల్ మోగింది. నవంబర్ 22లోపు ముందే అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేస్తామని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.. ఈ మేరకు ఎన్నికల సంఘం పోలింగ్ తేదీల వివరాలను సోమవారం వెల్లడించింది.

243 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.. బిహార్ అసెంబ్లీ 2025 నవంబర్ 22తో ముగుస్తుంది. బిహార్ లో 7.42 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. రెండు విడతల్లో ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. నవంబర్ 6, 11 తేదీల్లో ఎన్నికలు జరగనున్నాయి.. 14న కౌంటింగ్ జరుగుతుందని సీఈసీ జ్ఞానేష్ కుమార్ తెలిపారు.

**బిహార్ అసెంబ్లీ ఎన్నికలు షెడ్యూల్..** రెండు దశల్లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు, నవంబర్ 6, 11న బిహార్ ఎన్నికలు, నవంబర్ 14న కౌంటింగ్.ఎస్సీలకు 38, ఎస్టీలకు 2 సీట్లు కేటాయించారు. మొత్తం 90,712 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 100 శాతం వెబ్‌కాస్టింగ్ నిర్వహించనున్నట్లు జ్ఞానేష్ కుమార్ వెల్లడించారు. శాంతి భద్రతలను కాపాడాలని కలెక్టర్లు, ఎస్పీలకు ఆదేశాలిచ్చామని పేర్కొన్నారు. 14 లక్షల మంది కొత్త ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 1200 ల మందికి మించకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అలాగే.. పోలింగ్ బూత్ బయట మొబైల్ ఫోన్ భద్రపరుచుకునేలా ఏర్పాట్లు కూడా చేస్తున్నామన్నారు. కమిషన్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఎలక్టోరల్ రోల్స్ తర్వాత జరిగే మొదటి రాష్ట్ర ఎన్నికలు ఇవి.

ఈ సవరణ 68.5 లక్షల మంది ఓటర్లను తొలగించి, 21.5 లక్షల మంది కొత్తవారిని చేర్చినట్లు సీఈసీ జ్ఞానేష్ కుమార్ తెలిపారు. పకడ్బంధీ ఏర్పాటు చేశామని.. సోషల్ మీడియా పోస్టులపై గట్టి నిఘా పెట్టినట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియను మరింత సులభం చేస్తున్నట్లు తెలిపారు. ఓటర్లు ఎలాంటి ఫిర్యాదులైనా 1950 కు ఫోన్ చేసి చెప్పవచ్చని.. వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. 243 అబ్జర్వర్లు నియమించామని.. ఏమైనా ఫిర్యాదులుంటే వారికి కూడా ఇవ్వవచ్చని తెలిపారు.

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక షెడ్యూల్ ఇదే..** కాగా.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక షెడ్యూల్ ను కూడా ఎన్నికల సంఘం విడుదల చేసింది. నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరగనుంది. నవంబర్ 14న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కౌంటింగ్ జరగనుంది. ఇప్పటినుంచి హైదరాబాద్‌లో ఎన్నికల కోడ్ అమలులోకి రానుంది.

**తొలిసారిగా బ్యాలెట్‌పై అభ్యర్థుల కలర్ ఫోటోలు..** కాగా.. దేశంలోనే తొలిసారిగా బ్యాలెట్‌పై అభ్యర్థుల కలర్ ఫోటోలను ముద్రించబోతున్నామని తెలిపారు. అభ్యర్థులను సులభంగా గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బీహార్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందు 17 కొత్త కార్యక్రమాలను ప్రవేశపెడుతున్నట్లు ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ప్రకటించారు. ఈ చర్యలు రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియను మెరుగుపరచడమే కాకుండా భవిష్యత్తులో దేశవ్యాప్తంగా అమలు చేస్తామని తెలిపారు.






## ఆయుధ విరమణపై మల్లోజుల కీలక ప్రకటన

హైదరాబాద్ : సాయుధ పోరాట విరమణపై మావోయిస్టు పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లోజుల స్పష్టమైన ప్రకటన చేశారు. ఈ మేరకు పార్టీ క్యాడర్‌కు లేఖ రాశారు. ఇందులో పార్టీ అధికార ప్రతినిధి జగన్‌కు కౌంటర్ ఇచ్చారు మల్లోజుల. పార్టీలో అంతర్గతంగా చర్చించిన తర్వాతే ఆయుధాలు వీడాలని పేర్కొన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి బతికున్నప్పుడే తీసుకున్న నిర్ణయం అంటూ లేఖలో వెల్లడించారు. పార్టీ చేసిన కొన్ని తప్పుల వల్ల తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సి వచ్చిందన్నారు. ఉద్యమం ఓటమి పాలు కాకుండా కాపాడలేకపోయామంటూ క్షమాపణలు చెప్పారు. పార్టీ క్యాడర్‌ను కాపాడుకొని అనవసర త్యాగాలకు ఫుల్ స్టాప్ పెట్టాలని మల్లోజుల పిలుపునిచ్చారు. మావోయిస్టు పార్టీ ఇప్పటి వరకు కొనసాగించిన పంథా పూర్తిగా తప్పిదమే అని అంగీకరించారు. తప్పుల నుంచి గుణ పాఠాలు నేర్చుకోవడం అంటే టీకా లాంటిదని సూచించారు. వర్తమాన ఫాసిస్టు పరిస్థితులలో మావోల లక్ష్యాన్ని నెరవేర్చలేమన్నారు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటారని క్యాడర్‌కు పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లోజుల పిలుపునిచ్చారు.




# జంత ఈజీ కాదు!

## ఎస్!... కాంగ్రెస్-బీఆర్ఎస్‌లకు అగ్నిపరీక్షే!

హైదరాబాద్ : ఔను.. తెలంగాణ స్థానిక ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం తాంబూలాలు ఇచ్చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేసింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేసింది. ఈ ఎన్నికలు .. ఐదు దశల్లో వచ్చే నవంబరు వరకు జరగనున్నాయి.

ఇదిలావుంటే.. ఈ ఎన్నికలు అటు అధికార, ఇటు ప్రధాన ప్రతిపక్షా లకు కూడా అగ్ని పరీక్షగా మారాయని అంటున్నారు పరిశీలకులు. కాంగ్రెస్ పార్టీ వచ్చే 30 ఏళ్ల పాటు తామే అధికారంలో ఉంటామని చెబుతోంది. ఇక, బీఆర్ ఎస్ పార్టీ ఎప్పుడు ఎన్నికలు జరిగినా కేసీఆర్‌ను సీఎం చేసేందుకు ప్రజలు తహతహ లాడుతున్నారని అంటోంది. ఈ నేపథ్యంలో ఇరు పక్షాలకు ఈ ఎన్నికలు ప్రాణ ప్రదంగా మారాయి. అయితే.. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎలా ఉన్నా యి? ఏ పక్షానికి అనుకూలంగా ఉన్నాయి? అనే విషయాలు ఆసక్తిగా మారాయి. గెలుపు గుర్రం ఎక్కేందుకు.. ఎవరికి అవకాశం ఉంది? మెజారిటీ పంచాయతీలు.. మెజారిటీ ఎంపీటీసీ, జడ్పీటీసీలను కైవసం చేసుకునేందుకు ఏ పార్టీకి సానుకూల పరిణామాలు ఉన్నాయన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేపుతోంది. దీంతో ప్రస్తుతం కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ ఎస్ అన్నట్టుగా ఉన్న పరిణామాలను చూద్దాం..

**కాంగ్రెస్ అనుకూలం ఇవీ..** 1) గతంతో పోల్చుకుంటే.. ఇప్పుడు ప్రజలకు చేరువ అవుతున్న మంత్రులు.. ఎమ్మెల్యేలు. 2) రాజసం వదిలి.. ప్రజలకు దగ్గరగా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. 3) 60 వేల పైచిలుకు ఉద్యోగాల కల్పన. 4) పెట్టుబడుల సాధన కోసం ప్రయత్నాలు. 6) ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం. 7) ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు. 8) మూసీ నది సుందరీకరణ.

**కాంగ్రెస్ ప్రతికూలం..** 1) రైతుల సమస్యలపై ఆశించిన విధంగా స్పందన లేకపోవడం. 2) ఇందిరమ్మ ఇళ్లవిషయంలో సామాన్యులకు ఒనగూరని లబ్ధి. 3) ప్రతి విషయానికీ ఢిల్లీ పెద్దలను కలుసుని నిర్ణయాలు తీసుకోవడం. 4) హైడ్రా ద్వారా సామాన్యులను కూడా ఇబ్బందులకు గురి చేయడం. 5) సఖ్యత కరువైన పార్టీ నాయకుల వివాదాలు. 6) ప్రజల మధ్యకు వస్తున్నా.. ప్రగతి విషయంలో కనిపించని అభివృద్ధి 7) హైదరాబాద్ మునక.

**బీఆర్ ఎస్ అనుకూలం ..** 1) ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీగా తన పట్టునిలుపుకొనే ప్రయత్నం. 2) సమస్యలను క్షేత్రస్థాయిలో వినిపించే యంత్రాంగం. 3) బలమైన ప్రతిపక్షంగా వాయిస్ వినిపించడం. 4) సీఎం రేవంత్ రెడ్డిని ఎప్పటికప్పుడు నిలదీయడం.

**బీఆర్ ఎస్ ప్రతికూలతలు..** 1) సొంత పార్టీలో కవిత కుంపటి. 2) కాళేశ్వరం అవినీతిపై ప్రజల్లో ఉన్న చర్చ. 3) ప్రజలకు చేరువ కాని కేసీఆర్ రాజకీయం. 4) పదేళ్ల అవినీతిపై తొలిగిపోని చర్చ. 5) ప్ర జా ముఖ్యమంత్రిగా కేసీఆర్‌కు పేరు లేకపోవడం. 6) ప్రజా ఉద్యమాల నిర్మాణంలో వెనుకంజ. 7) ఇప్పటికీ పార్టీ ప్రయోజనాలే ముఖ్యంగా వేస్తున్న అడుగులు.

చురకలు







## బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పిటిషన్.. కొట్టివేసిన సుప్రీంకోర్టు

దిల్లీ: తెలంగాణలో బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున విచారణకు స్వీకరించలేమని జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. హైకోర్టులో ఇదే అంశంపై రెండు పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ దవే, అభిషేక్ సింఘ్వీ, ఏడీఎన్ రావు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆర్టికల్ 32 కింద పిటిషన్ ఎందుకు ఫైల్ చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాదిని జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం ప్రశ్నించింది. హైకోర్టు స్టే ఇవ్వనందున సుప్రీంకోర్టుకు వచ్చామని పిటిషనర్ పేర్కొన్నారు. హైకోర్టు స్టే ఇవ్వకుంటే సుప్రీంకోర్టుకు వచ్చేస్తారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. అనంతరం పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం కొట్టివేసింది.




## సీజేఐ గవాయ్‌పై దాడికి యత్నం.. చీకటి రోజుగా అభివర్ణించిన రేవంత్..

హైదరాబాద్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సీజేఐ గవాయ్‌పై జరిగిన దాడి యత్నాన్ని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఖండించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా రేవంత్ ట్వీట్ చేశారు. దేశ న్యాయవ్యవస్థలోని అత్యున్నత అధికారిపై దాడి చేసి బెదిరించడానికి జరిగిన దుర్మార్గపు ప్రయత్నాన్ని తాను మాటల్లో ఖండించలేనని చెప్పారు. ఇది మన దేశ చరిత్రలో చీకటి రోజు అని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఇటువంటి పిరికి దాడులకు తాను భయపడబోనని ధైర్యంగా ప్రకటించిన ధైర్యవంతుడైన ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌కి దేశ పౌరులతో కలిసి తాను సంఘీభావం ప్రకటిస్తున్నట్లు రాసుకొచ్చారు.. సుప్రీంకోర్టులో ఓ కేసు విచారణ సమయంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడి చేసేందుకు ఓ లాయర్ యత్నించాడు. కేసు విచారణలో భాగంగా వాదనలు జరుగుతుండగా ఓ న్యాయవాది సీజేఐపైకి బూటు విసిరేందుకు యత్నించాడు. గమనించిన భద్రతా సిబ్బంది వెంటనే అతడిని అడ్డుకున్నారు. దీనిపై స్పందించిన జస్టిస్ గవాయ్.. ఇలాంటి ఘటనలు తనను ప్రభావితం చేయలేవని, తాను చలించడం లేదని, ఎవరూ ఆందోళనకు గురికావొద్దని వ్యాఖ్యానించారు. అనంతరం కోర్టులో ఉన్న లాయర్లను తమ వాదనలు కొనసాగించమని జస్టిస్ గవాయ్ కోరారు.




దిల్లీ: తెలంగాణలో జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక షెడ్యూల్ విడుదలైంది. నవంబర్ 11న ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు ఈసీ వెల్లడించింది.
నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. జూబ్లీహిల్స్ పరిధిలో మొత్తం 3,92,669 మంది ఓటర్లు ఉన్నారు. మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో ఇక్కడ ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. నోటిఫికేషన్ విడుదల: అక్టోబర్ 13, నామినేషన్లకు తుది గడువు: అక్టోబర్ 21, నామినేషన్ల పరిశీలన: అక్టోబర్ 22, నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు: అక్టోబర్ 24, పోలింగ్ తేదీ: నవంబర్ 11, ఓట్ల లెక్కింపు : నవంబర్ 14.




## హైవేపై వరుసగా రెండో రోజూ భారీగా ట్రాఫిక్‌జామ్

చిట్యాల: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై వరుసగా రెండో రోజూ భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. నల్గొండ జిల్లా చిట్యాల నుంచి పెద్దకాపర్తి వరకు సుమారు 4 కిలోమీటర్ల మేర రాకపోకలు స్తంభించిపోయాయి. దీంతో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. పెద్దకాపర్తి, చిట్యాల వద్ద వంతెన నిర్మాణ పనుల వల్ల ఈ సమస్య ఏర్పడింది. దసరా సెలవుల తర్వాత ప్రయాణికులు నగర బాట పట్టడంతో వాహనాల రద్దీ నెలకొంది. మరోవైపు పంతంగి టోల్ ప్లాజాతో పాటు చౌటుప్పల్, దండు మల్కాపురం వద్ద వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. పోలీసులు వాహనాల రద్దీని క్రమబద్ధీకరించే ప్రయత్నం చేస్తున్నారు.

హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ చింతలకుంట నుంచి కొత్తపేట వరకు భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. చింతలకుంట పైవంతెనపై ట్రావెల్స్ బస్సులు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌జామ్ కారణంగా కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు.



## రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టేవారికి అన్ని రకాల మద్దతు: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: తెలంగాణలో పరిశ్రమలు పెట్టేవారికి ప్రభుత్వం అన్ని రకాలుగా మద్దతిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అమెరికాకు చెందిన ప్రముఖ ఫార్మా సంస్థ ఎలి లిల్లీ ప్రతినిధులు సీఎంతో భేటీ అయ్యారు. ఈ భేటీకి ఆ సంస్థ అధ్యక్షుడు ప్యాట్రిన్ జాన్సన్, లిల్లీ ఇండియా అధ్యక్షుడు విన్సెలో టుకర్, మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి సంజయ్ తదితరులు హాజరయ్యారు. హైదరాబాద్‌లో పరిశ్రమ ఏర్పాటుకు ఎలి లిల్లీ ముందుకొచ్చింది. రూ.9 వేల కోట్లతో ప్లాంటు, క్వాలిటీ సెంటర్ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఆ సంస్థను సీఎం అభినందించారు. ఫార్మా పాలసీని ప్రభుత్వం మరింత ముందుకు తీసుకెళ్తుందని చెప్పారు. జీనోమ్ వ్యాలీలో ఏటీసీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని.. అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తామని వెల్లడించారు. ఆనంద్ మహీంద్రా నేతృత్వంలో స్కిల్ యూనివర్శిటీ ఏర్పాటు చేస్తున్నామని.. ఫార్మాకు సంబంధించిన ప్రముఖులు ఆ యూనివర్శిటీ బోర్డు మెంబర్స్‌గా ఉన్నారని సీఎం వివరించారు.




## భూముల కేటాయింపులపై లెక్కలు తేల్చాలి..



హైదరాబాద్: సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ భూసేకరణపై అధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ మేరకు రెవెన్యూ భూముల కేటాయింపులపై లెక్కలు తేల్చాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ భూసేకరణ వేగవంతం చేయాలని సూచించారు. గత 30-40 సంవత్సరాలుగా రెవెన్యూ శాఖ తరఫున వివిధ ప్రభుత్వ శాఖలకు కేటాయించిన భూముల వివరాలు, వినియోగం, ప్రస్తుత పరిస్థితిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కోరారు. రాష్ట్ర విభజన తర్వాత పలు ప్రాజెక్టుల్లో మార్పులు, రద్దులు జరిగిన నేపథ్యంలో వాటి లెక్కలు చూపాలని ఆయన పేర్కొన్నారు. అటవీ శాఖకు రెవెన్యూ శాఖ ఇచ్చిన భూమి, అలాగే అటవీ శాఖ రెవెన్యూ శాఖకు ఇచ్చిన భూములపై వివరాలను రెండు శాఖలు కలిసి నివేదిక ఇవ్వాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ కోసం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1138 ఎకరాల అటవీ భూమి కేటాయింపును వేగవంతం చేయాలని తెలిపారు. కేశవపురం త్రాగునీటి పథకం కోసం గతంలో కేటాయించిన 1030 ఎకరాల భూమి ప్రాజెక్ట్ రద్దు చేశారని గుర్తు చేశారు. ఆ భూమిని సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు బదిలీ చేసే సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి, అటవీ పర్యావరణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, పీసీసీఎఫ్, మెట్రో వాటర్ వర్క్స్ ఎండీ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్, అక్టోబర్ 6: తెలంగాణ బీజేపీ ఎంపీలకు మాజీ మంత్రి హరీష్ రావు సవాల్ విసిరారు. బీజేపీ అంటే తెలంగాణను మోసం చేసిన పార్టీ అని విమర్శించారు. బీజేపీది సబ్ కా సాత్ సబ్ కా వికాస్ కాదు పూరా బక్వాస్ అంటూ వ్యాఖ్యలు చేశారు. వడ్లకో నీతి.. గోధుమలకో నీతా అని తెలంగాణ బీజేపీ ఎంపీలకు అడిగే దమ్ముందా అని ప్రశ్నించారు. ప్రాంతీయ పార్టీ బలంగా ఉంటే కేంద్రం మెడలు వంచి పనులు చేసుకోవచ్చని.. ఏపీలో టీడీపీ ఇప్పుడు అదే చేస్తుందన్నారు. సీఎం రేవంత్ కేరళ, కర్ణాటక, ఢిల్లీ తిరగడానికి సరిపోతుందని మాజీ మంత్రి ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఆర్ఆర్ టాక్స్ నడుస్తోందని వ్యాఖ్యలు చేశారు. పోలీసులు బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే పింక్ బుక్‌లో రాసుకుంటామని.. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ఆ పోలీసుల పని పడతామని హెచ్చరించారు. కేసీఆర్ వచ్చాకే మార్కెట్ కమిటీల్లో బీసీలకు అవకాశం ఇచ్చామని గుర్తుచేశారు. రేవంత్ చీఫ్ మినిస్టర్ కాదు కటింగ్ మాస్టర్ అంటూ వ్యాఖ్యలు చేశారు. జేబులో కత్తెర పెట్టుకొని కేసీఆర్ చేసిన పనులకు రిబ్బన్ కట్ చేస్తున్నారంటూ ఫైర్ అయ్యారు. రిబ్బన్ కత్తిరించడం లేదంటే కేసీఆర్ ఇచ్చిన పథకాలు కట్ చేయడం ఇదే రేవంత్ పని అని అన్నారు. కాళేశ్వరం కూలిందని చెబుతున్న సీఎం రేవంత్ మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు నీళ్లు ఎలా తీసుకువెళ్తున్నారని నిలదీశారు. కేసీఆర్ చెమట ఓడ్చి కట్టిన ప్రాజెక్టు కాళేశ్వరం అని చెప్పుకొచ్చారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు సీఎం రేవంత్ నాన్న కట్టారని నీళ్లు తీసుకువెళ్తున్నారా అంటూ మండిపడ్డారు. తలకిందులుగా తపస్సు చేసినా ఇక సీఎం రేవంత్ మాటలను ప్రజలు నమ్మరన్నారు. సంగారెడ్డి జిల్లాలో లక్షా 20 ఎకరాల సాగు కోసం సంగమేశ్వర బసవేశ్వర ప్రాజెక్టు తెచ్చారు కేసీఆర్ అని తెలిపారు. త్వరలో సంగమేశ్వర బసవేశ్వర ప్రాజెక్టు కోసం పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు. కాంగ్రెస్ పోవాలి కేసీఆర్ రావాలని జనాలు కోరుకుంటున్నారని మాజీ మంత్రి వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ ప్రామిసరి నోట్, బాండ్ పేపర్‌లకు విలువ లేకుండా చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చారని.. రేవంత్ రెడ్డి వచ్చాక కొత్త పింఛన్లు ఇవ్వలేదు కానీ 2 లక్షల పింఛన్లు తీసేశారని ఆరోపించారు. రెండు నెలల పింఛన్ ఎగ్గొట్టారన్నారు. కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రతీ గ్రామంలో పంచాలని నేతలు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు ఓటు అడగటానికి వస్తే హామీలపై నిలదీయాలన్నారు. కల్యాణ లక్ష్మి పథకంలో 8 లక్షల తులాల బంగారం కాంగ్రెస్ పార్టీ బాకీ పడిందని తెలిపారు. నిరుద్యోగ యువతకు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి 20 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. రేవంత్ ఎన్నికల ముందు రజినీకాంత్.. తర్వాత గజిని కాంత్‌లా అయ్యారంటూ సెటైర్ విసిరారు. ఫ్యూచర్ సిటీలో రోడ్లు, మూసీ సుందరీకరణ కోసం నిధులు ఉంటాయని.. ప్రజలకు ఇచ్చే పథకాల కోసం మాత్రం నిధులు ఉండవని ఆయన అన్నారు. కేసీఆర్ 33 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేస్తే రేవంత్ 19 వేల కోట్ల రూపాయలే రుణమాఫీ చేశారన్నారు. రైతులకు యూరియా సరఫరా చేయలేని దద్దమ్మ, చేతగాని ప్రభుత్వం ఈ కాంగ్రెస్ ప్రభుత్వమని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని జిల్లాల్లో బీఆర్ఎస్ గెలవడం పక్కా అంటూ మాజీ మంత్రి హరీష్ రావు ధీమా వ్యక్తం చేశారు.

## సుప్రీం తీర్పు శుభ పరిణామం: మహేష్ గౌడ్

హైదరాబాద్, అక్టోబర్ 6: బీసీ రిజర్వేషన్ల పిటిషన్‌కు కొట్టివేస్తూ సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం పట్ల కాంగ్రెస్ నేతలు స్పందించారు. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ స్పందిస్తూ.. సుప్రీం తీర్పు శుభ పరిణామమన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఆపాలని సుప్రీం కోర్టులో వేసిన కేసును కొట్టివేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చే విషయంలో అన్ని రకాలుగా పోరాటాలు చేసి సాధిస్తామని చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వం 3 చట్టాలు, ఒక ఆర్డినెన్స్ ఒక జీవో ఇచ్చి బీసీ రిజర్వేషన్లు అమలు చేసేందుకు కృషి చేసిందని తెలిపారు. 8వ తేదీన హైకోర్టులో కూడా ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వస్తుందని ఆశిస్తున్నామన్నారు. బీసీలకు రాజకీయంగా 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం అన్ని వర్గాలు సహకరించాలని మహేష్ గౌడ్ కోరారు.

**వారి కుట్రలు అర్థం చేసుకోండి: మహేష్..** సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని కాంగ్రెస్ అధికార ప్రతినిధి డాక్టర్ కొనగాల మహేష్ అన్నారు. బీసీ బిడ్డలకు కాంగ్రెస్ రిజర్వేషన్లు ఇస్తే కొందరు తట్టుకోలేకపోతున్నారని మండిపడ్డారు. బీసీలకు రిజర్వేషన్ల పెంపు కోసం కాంగ్రెస్ చిత్తశుద్ధిగా ఉందన్నారు. బీజేపీ బీఆర్ఎస్‌లు చేస్తున్న కుట్రలను బీసీలు అర్థం చేసుకోవాలని అన్నారు. బీసీ బిడ్డల నోటి దగ్గర ముద్దను లాక్కోవద్దని హితవు పలికారు. బీఆర్ఎస్ నేతలు కుల సంఘ నాయకుని ముద్ర వేసుకుని కోర్టుకు వెళ్తున్నారని తెలిపారు. బీసీల రిజర్వేషన్ల పెంపును అడ్డుకునే ఉత్సాహాన్ని బీసీలు గమనిస్తున్నారని మహేష్ పేర్కొన్నారు.



## 'ట్రాప్ హౌస్ పార్టీ'.. ఆరుగురిపై కేసు నమోదు

హైదరాబాద్: మొయినాబాద్ చెర్రీవోక్స్ ఫాంహౌస్ కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ట్రాప్ హౌస్ పార్టీలో ఆర్గనైజర్లు, డీజే ప్లేయర్లు సహా 65 మంది పాల్గొన్నట్లు గుర్తించారు . ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సమాచారంతో 59 మంది యువతి, యువకులు పార్టీకి వచ్చారు. 22 మంది మైనర్లు ఈ పార్టీలో పాల్గొన్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఆరుగురిపై కేసులు నమోదు చేశారు. ఇషాన్ అనే యువకుడు పార్టీ నిర్వహించినట్లుగా గుర్తించారు. ఇషాన్ ఇటీవలే కెనడా నుంచి హైదరాబాద్‌కు వచ్చాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో ట్రాప్‌హౌస్ పేరిట పేజీ క్రియేట్ చేశాడు. అక్టోబర్ 4న చెర్రీవోక్స్ ఫాంహౌస్‌లో పార్టీ నిర్వహించాడు. ఒక్కరికైతే రూ.1,600, జంటగా వస్తే రూ.2,800గా ధర నిర్ణయించాడు. ఇన్‌స్టాలో ఇది చూసిన మైనర్లు పార్టీకి సిద్ధమయ్యారు. మత్తులో జోగుతున్న సమయంలో రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులు దాడులు నిర్వహించారు. పార్టీలో పాల్గొన్న వారికి నిర్వహించిన డ్రగ్ పరీక్షల్లో ఇద్దరు మైనర్లు గంజాయి తీసుకున్నట్టు నిర్ధరణ అయింది. ఆరుగురు నిర్వాహకులను, 6 విదేశీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని మొయినాబాద్ ఠాణాలో అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# వన్యప్రాణుల సంరక్షణ సామాజిక బాధ్యత - వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా




వాస్తవానికి మనిషి కంటే ముందే జంతువులు భూమి మీద జీవించాయని సైన్స్ చెబుతోంది. అయితే భూమి ఆవిర్భవించిన తరవాత పుట్టిన చాలా జంతు జాతులు ఇప్పుడు లేవు. ఈ ఆధునిక యుగంలోనూ మనకు తెలిసిన ఎన్నో జంతు జాతులు కనుమరుగై పోతున్నాయి. ఇలా జంతువుల జాతులు అంతరించి పోకుండా, వాటిని పరిరక్షించడమే వన్య ప్రాణుల వారోత్సవాల ముఖ్యోద్దేశం. ఏటా అక్టోబర్ మొదటి వారంలో దినోత్సవాన్ని అంతర్జా తీయంగా నిర్వహిస్తున్నారు. మానవ మనుగడకు అనివార్యమైన జంతు సంపదను పరిరక్షించడం, వృద్ధి చేయడం, జంతువుల హక్కులను కాపాడటం ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం. ప్రపంచ వ్యాప్తంగా వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థక మవుతున్న నేపథ్యంలో.. వాటి సంరక్షణ ప్రాధాన్యతను గుర్తుచేస్తూ ప్రతీ ఏటా అన్ని దేశాలు దీన్ని వన్య ప్రాణుల దినోత్సవాన్ని జరుపు తున్నాయి. వన్య ప్రాణుల సంరక్షణ కోసం మన ప్రభుత్వాలు ఏటా కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నాయి. అయితే స్మగ్లర్లు, వేటగాళ్లు.. వన్యప్రాణులు, అరణ్యాల పాలిట శాపంలా తయారయ్యారు. వీళ్ల దెబ్బకు కీకరారణ్యాలు సైతం మైదానాలుగా మారుతున్న పరిస్థితి. పరిశ్రమల స్థాపన పేరిట పెద్ద ఎత్తున అటవీ భూముల్లో పారిశ్రామిక కార్యకలాపాలు నిర్వహిస్తుండటం కూడా వన్యప్రాణుల మనుగడుకు ముప్పుగా మారింది. దీంతో గూడు చెదిరిన వన్యప్రాణుల జనారణ్యం లోకి వస్తున్న పరిస్థితి. దేశంలోని జంతు సంపదను పరిరక్షించడానికి మొట్టమొదటి సారిగా 1898లో ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వం మొదటి పక్షుల అభయారణ్యాన్ని తమిళనాడు లోని వేదాంతంగల్‌లో ఏర్పాటు చేసింది. ఆ తర్వాత 1935లో మొదటి వన్య ప్రాణి జాతీయ పార్కు 'హేలీ'ని ఉత్తరప్రదేశ్‌లో ఏర్పాటు చేశారు. ఇదే పార్కును ఇప్పుడు జిమ్ కార్బెట్ పార్కు అని పిలుస్తున్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న మొత్తం జాతీయ పార్కుల సంఖ్య 102. 1976లో జరిగిన రాజ్యాంగ సవరణలోని ఆర్టికల్ 51(ఎ) ప్రకారం వన్యప్రాణి సంరక్షణ పౌరుల ప్రాథమిక విధి. ఆదేశిక సూత్రాల్లో కూడా కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు విధిగా వన్యప్రాణులను సంరక్షించాలని పేర్కొన్నారు. జాతీయ వన్యప్రాణి చట్టం 1972, వన్యప్రాణులను వేటాడటాన్ని పూర్తిగా నిషేధించింది. ఆనాటి ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ 1972లో వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఈ చట్టం ప్రకారం వన్య ప్రాణుల వేట నిషేధం. ఈ చట్టం అమలులోకి వచ్చాక.. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో 23 టైగర్ ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. ప్రస్తుతం దేశంలో 441వన్య ప్రాణి సంరక్షణ కేంద్రాలు ఉండగా.. వీటిల్లో 28 టైగర్ జోన్స్ ఉన్నాయి. అంతర్జాతీయంగా పులి చర్మానికి, గోళ్లకు, ఎముకలకు విపరీతమైన డిమాండ్ ఉండటంతో.. వేటగాళ్ల చేతిలో చిరుతల బలైపోతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చేనాటికి దేశవ్యాప్తంగా ఉన్న అడవుల్లో దాదాపు నలభై వేలకు పైగా ఉన్న పులులు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. కానీ 1972 నాటికే ఆ సంఖ్య మూడు వేలకు పడిపోయిందంటే.. అప్పటి ప్రభుత్వాలు ఎంతటి నిర్లక్ష్య వైఖరి అవలంభించాయో స్పష్టంగా అర్థమవుతోంది. సాధారణంగా పులుల జనాభాను లెక్కించేందుకు ఇంతకు ముందు పాదముద్రలను గుర్తించడం ఒక్కటే మార్గం. అవి సంచరించే ప్రాంతాల్లో రహస్య కెమెరాలను ఏర్పాటు చేసి.. వాటి పాదముద్రలను సేకరించేవారు. అయితే ఇది చాలా కష్టంతో కూడుకున్న పని. కచ్చితమైన లెక్కకు ఆస్కారం కూడా తక్కువే. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యూలార్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) పులుల మలం ద్వారా వాటిని లెక్కించే పద్ధతిని ఆవిష్కరించింది. 20వ శతాబ్దంలో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు లక్ష పైచిలుకు పులులు ఉండేవి అని అంచనా. 2014 లెక్కల ప్రకారం ప్రపంచంలో 3891 పులులు ఉండగా వాటిలో 2226 మన దేశంలోనే ఉన్నాయి. భారత్‌లో 2011 లెక్కల ప్రకారం 1706, 2014 ప్రకారం 2226 ఉండగా 2018 పులుల గణన ప్రకారం మన దేశంలో 2967 పులులున్నాయి. ప్రపంచంలో ఉన్న మొత్తం పులుల్లో 70శాతం పైగా మనదేశం లోనే ఉన్నాయి. గడిచిన కొన్నేళ్లలో ఒక్క మధ్య ప్రదేశ్‌లోనే 19 పులులు మృత్యువాత పడ్డాయి. మహారాష్ట్రలో 9, ఉత్తరాఖండ్‌లో 9 మృత్యువాత పడ్డాయి. 2016లో దేశవ్యాప్తంగా74 పులులు మరణించినట్టు లెక్కలు చెబుతున్నాయి. 2006లో పులులను స్మగ్లర్ల బారి నుండి కాపాడటానికి టైగర్ టాస్క్ ఫోర్స్‌లను ఏర్పాటు చేశారు. భారత దేశంలో పశ్చిమ కనుమలు, నల్లమల కొండలు, శేషాచలం కొండలు, హిమాలయాలు, దేశ ఈశాన్యప్రాంతం విభిన్న జంతు జీవ జాలానికి నిలయంగా ఉన్నాయి. మానవుడికి, జంతువులకు మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని ఈ దినోత్సవం తెలియ జేస్తుంది. ఈ రోజున జంతు సంక్షేమ ప్రచారాలతో పాటు జంతు పరిరక్షక శిబిరాలను ప్రారంభించడం, జంతు సంరక్షణకు నిధులు సేకరించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. దేశంలో అడవులు అన్యాక్రాంత మవుతున్నాయి. ఒకప్పుడు విశాలంగా ఎక్కడ చూసినా పచ్చదనంతో బాసిల్లే అటవీ ప్రాంతాలు రాను రాను కనుమరుగై పోతున్నాయి. వన్యప్రాణి సంరక్షణ చట్టానికి తూట్లు పొడుస్తూ అటవీ ప్రాణుల వేట యధేచ్ఛగా జరుగుతుంది. వాస్తవానికి మనం జంతువుల ఆవాసాలను నాశనం చేస్తున్నాం. విచక్షణా రహితంగా అడవులు నరుకుతూ వాటి తావులను, మంచినీటి వనరులను ధ్వంసం చేస్తున్నాం. అందుకే అడవి జంతువులు గ్రామాల్లోకీ, పట్టణాల్లోకి వస్తున్నాయి. ఆహారం కోసం మనుషులపై దాడులు చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిని మార్చడం కూడా ఈ వన్య ప్రాణుల దినోత్సవం లక్ష్యాల్లో ఒకటి. జంతువులకు సహజ సిద్ధమైన ఆవాసాలను కల్పించడం, జంతు జాతులను రక్షించడం, వాటి సంక్షేమాన్ని కాపాడటం ఇవే ప్రధానం.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# భారత స్వాతంత్ర్య సమరంలో సమిధలైన త్రిమూర్తులు

## అక్టోబర్ 7...భగత్ సింగ్, సుఖదేవ్, రాజగురులకు ఉరి శిక్ష ఖరారైన దినం



భారత దేశానికి వచ్చిన సైమన్ కమిషన్లో ఒక్క భారతీయుడైనా లేనందుకు నిరసనగా, ఉద్యమంలో లాల్‌జీ (లాలా లజపత్ రాయ్) కీలక పాత్ర వహించి, సైమన్ కమిషన్‌ను బహిష్కరించాలి అంటూ పంజాబ్ అసెంబ్లీలో ఆయన తీర్మానం పెట్టి గెలిపించారు. ఇది ప్రభుత్వానికి కంటగింపుగా మారింది. అక్టోబర్ 30, 1928న ఆ కమిషన్ లాహోర్ రాగా, లాల్‌జీ కూడా అహింసతో, మౌనంగా సైమన్ వ్యతిరేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మౌనంగా ఉద్యమిస్తున్న వారిపైన కూడా లాఠీ చార్జికి ఆదేశించాడు పోలీసు సూపరింటెండెంట్ జేమ్స్ ఏ స్కాట్. తను స్వయంగా లాల్‌జీ మీద దాడి చేసి, లాల్‌జీ ఛాతీ మీద లాఠీతో స్కాట్ తీవ్రంగా కొట్టాడు. ఆ దెబ్బలతోనే లాల్‌జీ నవంబర్ 17న చనిపోయారు. ఈ సంఘటనను కళ్లారా చూసిన భగత్ సింగ్ ప్రతీకారం తీర్చు కోవాలని నిర్ణయించు కున్నాడు. పోలీసు అధికారి స్కాట్‌ను హత మార్చడానికి విప్లవ కారులు శివరామ్ రాజ్‌గురు, జై గోపాల్, సుఖ్‌దేవ్ థాపర్‌లతో ఆయన చేతులు కలిపాడు. డీఎస్పీ జే. పీ. సాండర్స్ కనిపించినప్పుడు పొరపాటుగా స్కాట్ అనుకుని, జైగోపాల్ ఆయన్ను కాల్చమంటూ సింగ్‌కు సంకేతాలిచ్చాడు. ఫలితంగా స్కాట్‌కు బదులు సాండర్స్ హతమయ్యాడు. లాలా లజపత్ రాయ్ మరణం, సాండర్స్ హత్యల తరువాత 1928లో భారత్ లోని వర్ధమాన రాజకీయ పరిస్థితిపై నివేదికను కోరుతూ సర్ జాన్ సైమన్ నేతృత్వంలో బ్రిటీష్ ప్రభుత్వం ఒక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఫిరోజ్ పూర్లో బ్రిటిష్ పోలీసు అధికారి జె.పి.సాండర్స్ ను హత మార్చినందుకు గాను వారికి 1930లో అక్టోబర్ 7వ తేదీని ఈ మరణ శిక్షను ఖరారు చేశారు.

భగత్ సింగ్ సహా ముగ్గురికి ఉరిశిక్ష ఖరారు చేసిన తీర్పు వివరాలను 2015లో ప్రచురించారు. '%ఝొతీతీఖత్ శీట జుఞ-వఏఙ్అశీఅ రాఅ రావత్వఅఎవ రాట ఐమఫ్త్ర%' అనే విడుదల చేసిన పత్రంలో 1930 అక్టోబర్ 7వ తేదీన ఉరిశిక్ష విధిస్తూ తీర్పిచ్చినట్లు స్పష్టంగా ఉంది. 1931, మార్చి 23న ఉరిశిక్ష అమలు చేసినట్లు మరో పత్రంలో వివరాలు ఉన్నాయి. జైలు సూపరింటెండెంట్ సంతకం చేసిన పేపర్‌ను టైమ్స్ ఫ్యాక్ట్ చెక్ గుర్తించి బహిర్గతం చేసి, లాహోర్ లోని పంజాబ్ శాఖలో ఈ పత్రాలను ఇటీవల ప్రదర్శనకు ఉంచారు. 1930 అక్టోబర్ 7 న న్యాయ స్థానము తీర్పును వెలువరించింది. తీర్పు 281 పేజీల్లో ఇవ్వబడింది. విచారణ ఎదుర్కొన్న వారందరికీ ఇలా శిక్షలు ఇవ్వబడ్డాయి. ఉరిశిక్ష: 1.భగత్ సింహ్ 2. సుఖఃదేవ్ 3. రాజగురులకుబీ అలాగే ఆజన్మాంతర జీవిత ఖైదు: 1.కిశోరీలాల్ 2. మహవీర్ సింహ్ (అండమాన్లో 9 రోజులు నిరాహార దీక్ష చేసి అమరుడయ్యాడు. 3. విజయ్ కుమార్ సింహ్ 4. శివవర్మ 5. గయా ప్రసాద్ 6. జయ దేవ్ కపూర్ 7. కమల్నాథ్ తివారిలకుబీ అలాగే జీవిత ఖైదు: 1.కుందాన్లాల్ ( 7 సంవత్సరాలు) 2. ప్రేమదత్ ( 5 సంవత్సరాలు)లకుబీ అలాగే అజయ్ ఘోష్, సురేంద్రనాథ్ పాండియ ఇంకా జితేంద్రనాథ్ సన్యాల్ లను విడిచి పెట్టారు. విచారణ లో ఉన్నవారందరూ కోర్టులను బహిష్కరించడం వలన తీర్పును లాహోర్ లోని సెంట్రల్ జైలు లో వినిపించారు. తమను యుద్ధ ఖైదీలుగా గుర్తించడం ద్వారా ఉరి తీయకుండా కాల్పుల బృందం చేత హతమార్చాలని జైలులో ఉన్నప్పుడు భగత్ సింగ్ , మరో ఇద్దరు వైస్రాయికి లేఖ రాశారు. క్షమాభిక్ష ముసాయిదా లేఖపై సంతంకం కోసం భగత్ సింగ్ మిత్రుడు ప్రన్నత్ మెహతా ఆయన్ను ఉరితీయడానికి నాలుగు రోజుల ముందు మార్చి 20న జైలులో కలిశాడు. అయితే సంతకం చేయడానికి సింగ్ నిరాకరించాడు. మార్చి 23న ఉరితీసినట్లు జైలు అధికారులు మరణ ధ్రువీకరణ పత్రాన్ని విడుదల చేశారు. అప్పటి సూపరింటిండెంట్ ఆఫ్ పోలీస్ వి.ఎన్. స్మిత్ ప్రకారం, భగత్ సింగ్‌ను ముందుగానే ఉరితీశారు.సాధారణంగా ఉదయం 8 గంటలకు ఉరితీసేవారు. అయితే ఏమి జరిగిందో ప్రజలు తెలుసుకునే లోగానే ఆయన్ను ఉరితీయాలని నిర్ణయించుకుని..సుమారు రాత్రి 7 గంటల ప్రాంతంలో ఉరి తీశారు. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ జిల్లాలోని హుస్సేనివాలా వద్ద నేషనల్ మెమోరియల్ ఉంది. లాహోర్ జైలులో ఉరిశిక్ష తరువాత, శివరామ్ రాజ్‌గురు, భగత్ సింగ్, సుఖ్‌దేవ్ థాపర్ మృతదేహాలను రహస్యంగా అక్కడికి తీసుకు వచ్చారు. వాటిని అధికారులు అక్కడే దహనం చేశారు. ప్రతి సంవత్సరం మార్చి 23 న, అమరవీరుల దినోత్సవం (షాహీద్ దివాస్)నాడు ముగ్గురు విప్లవకారులను జ్ఞాపకం చేసుకుంటారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# సామాజిక జీవితాన్ని అక్షరబద్ధం చేసిన యశోదారెడ్డి - అక్టోబర్ 7...పాకాల యశోదారెడ్డి వర్ధంతి



ఆమె తెలంగాణ గర్వించ దగిన సాహితీ మూర్తి. తెలంగాణ సజీవ భాషను తన రచనల్లో వాడి పలువురి మన్ననలు పొందిన సాహితీవేత్త. ఆకాశవాణిలో తెలంగాణ మాండలికంలో ప్రసంగం చేసిన తొలి రచయితగా పేరు గడించారు. తెలుగు ప్రాచీన సాహిత్యంపై ఆమె చేసిన ప్రసంగాలు బహు పండిత ప్రశంసా పాత్రాలు అయినాయి. ఆమె పలు రచనలు మన్ననలకు నోచు కున్నాయి. ఆమే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షు రాలుగా పని చేసి గుర్తింపు పొందిన పాకాల యశోదారెడ్డి. యశోదా రెడ్డి (ఆగష్టు 8, 1929 - అక్టోబర్ 7, 2007) ప్రముఖ రచయిత్రి. ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగు శాఖలో ఆచార్యులుగా పనిచేసి, పదవీ విరమణ గావించారు. పలు సాహిత్య విమర్శనా గ్రంథాలు రాశారు. కథా సంపుటాలను వెలువరించారు. పాకాల యశోదారెడ్డి 1929, ఆగష్టు 8 న మహబూబ్ నగర్ జిల్లా (ప్రస్తుతం నాగర్‌కర్నూల్ జిల్లా), బిజినేపల్లిలో సరస్వతమ్మ, కాశిరెడ్డి దంపతులకు ఆమె జన్మించారు. యశోదారెడ్డి మూడవ తరగతి వరకు మహబూబ్ నగర్ లో, ఉన్నత పాఠశాల విద్యను హైదరాబాద్, నారాయణగూడ లోని బాలికల ఉన్నత పాఠశాలలోను పూర్తి చేశారు. రాజబహద్దూర్ వెంకట్రామిరెడ్డి ప్రోత్సాహంతో కళాశాల విద్య కొనసాగించి, ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి తెలుగు, సంస్కృత భాషలలో స్నాతకోత్తర విద్య పూర్తి చేశారు. జర్మన్ భాషలో, భాష శాస్త్రంలో డిప్లొమా చేశారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం లోనే తెలుగులో హరివంశాలు" అను అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందారు. 1976లో అలీఘర్ విశ్వ విద్యాలయం నుండి డి.లిట్ అందుకున్నారు. యశోదారెడ్డికి హిందీ, ఉర్దూ, కన్నడ భాషల్లో ప్రావీణ్యంతో పాటు, జర్మన్ భాషతో కూడా పరిచయమున్నది. ఆమె భర్త ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు పి. టి. రెడ్డి గా సుపరిచితులైన పాకాల తిరుమల్ రెడ్డి. జె.జె.ఆర్ట్ కళాశాలలో చదువుకుని, కొన్నాళ్ళు లాహోర్లో పనిచేసి హైదరాబాదు తిరిగి వచ్చిన తిరుమలరెడ్డి, ఆమె వక్తృత్వ ప్రతిభను చూసి, పి.టి.రెడ్డి ఆకర్షితుడై 1947లో ప్రేమ వివాహం చేసుకున్నారు. తిరుమల్ రెడ్డి గీసిన అనేక చిత్రాలకు ఆమే స్ఫూర్తి. యశోదారెడ్డి కూడా స్వతహాగా కళాపిపాసి. ఆమె రకరకాల ఇత్తడి విగ్రహాలను హాబీగా సేకరించే వారు. పి.టి రెడ్డి సాంగత్యంతో వాటిలోని కళానైపుణ్యాన్ని, వైటభవాన్ని ఆమె గుర్తించ గలిగేవారు. భర్త చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేసినపుడు ఒక కార్యకర్తగా పని చేసి అది విజయ వంతం అయ్యేందుకు దోహద పడేది. 1955లో హైదరాబాద్, కోఠి మహిళా కళాశాలలో అధ్యాపకురాలిగా ఉద్యోగ జీవితం ప్రాంభించారు. తరువాత రీడర్‌గా, ప్రొఫెసర్‌గా ఉస్మానియా విశ్వ విద్యాలయంలో పనిచేసి, ఎందరో పరిశోధకులకు మార్గదర్శియై, 1989లో పదవీ విరమణ పొందారు. ఆమె ధర్మశాల, ఎచ్చమ్మ కథలు తదితర కథా సంపుటాలను వెలువరించారు. యశోదా రెడ్డి వందకు పైగా కథలు వ్రాసినా వాటిలో 63 మాత్రమే పుస్తక రూపంలో రావడం జరిగింది. ఆమె ప్రచురించిన మూడు కథా సంపుటాల్లో, మావూరి ముచ్చట్లు (1973) కథా సంపుటి 1920-40 నాటి తెలంగాణ గ్రామీణ జీవన విధానాన్ని చిత్రీకరిస్తే, ఎచ్చమ్మ కథలు (1999) 1950-70 నాటి తెలంగాణ సంస్కృతికి ప్రతీకలు, ధర్మశాల (2000) కథా సంపుటి 1980-1990 నాటికి తెలంగాణ సమాజంలో వచ్చిన మార్పులకు దర్పణం పట్టింది. ఈ మూడు కథా సంపుటాల్లో ఈమె తెలంగాణ భాషను, యాసను, సంస్కృతిని, సామాజిక జీవితాన్నిఅక్షర బద్ధం చేశారు. మావూరి ముచ్చట్లు, ఎచ్చమ్మ కథలు, పాలమూరు జిల్లా మాండలికంలో వ్రాస్తే, ధర్మశాల కథా సంపుటిని మాత్రం వ్యవహారిక తెలుగు భాషలో లిఖించారు. యశోదారెడ్డి కథలు తెలంగాణ జనజీవన సంస్కృతిను, తెలంగాణ మాండలిక నుడి కారానికి అద్దం పడతాయి. ఎచ్చమ కథలకు ముందుమాటలో "ఒక జాతి సంస్కృతిలో ఆ జాతి జీవన విధానం ప్రతిఫలిస్తుంది. ఈ సంస్కృతీ సర్వస్వం ఆ జాతి భాషలో నిక్షిప్తమై జీవిస్తుంది. ఆ భాష ఆ జాతికి ప్రత్యేకమైన ఆచార వ్యవహార, ఆర్థిక, రాజకీయ, సామాజిక మూల ధాతువులను జీర్ణించుకొని రససిద్ధిని పొంది జాతీయాల్లో, పలుకుబళ్లలో, సామెతల్లో పొందుపడి ప్రభుత్వాన్ని నెరుపుతుంది. ఒక భాషలో ఒక నానుడి కానీ, సామెత కానీ, జాతీయం కానీ అలవోకగా పుట్టదు. ఆయా జాతీయులు, తలలు పండినవారి అనుభవాన్ని వీడబోసి నిగ్గుదేల్చిన సారమే ఈ నుడికారపు ఇంపుసొంపులు. అందుకే అవి భాషకు జీవనాడి. ప్రాణ ధాతువుల వంటివి అని అభిప్రాయడిన యశోదారెడ్డి...తన కథల నిండా తెలంగాణ నుడికారపు సొంపులకు పెద్దపీట వేశారు. యశోదారెడ్డి కథారచయిత్రి గానే కాకుండా కవయిత్రిగా కూడా ప్రసిద్ధులే. ఆమె రాసిన కవితలు అనేక పత్రికలలో ముద్రించ బడ్డాయి. స్వయంగా తానే తన కవితలను ' ఉగాదికి ఉయ్యాల , భావిక అనే రెండు సంపుటాలగా వెలువ రించారు. మలేషియాలో జరిగిన తెలుగు సమ్మేళనంలో కవయిత్రిగా పాల్గొని, ప్రశంసలందు కున్నారు. పారిజాతా పహరణం, ఉత్తర హరివంశం, తెలుగు సామెతలు, ఆంధ్ర క్రియా స్వరూప మణి దీపిక మొదలగు పుస్తకాలకు సంపాదకత్వం వహించి, విలువైన పీఠికలను రాసి, వెలువరించారు. ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ, లలిత కళా అకాడమీ, సంగీత అకాడమీలలో సభ్యురాలిగా పని చేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్, జానపద కళా సాహిత్య సంస్థలతో ఆమెకు అనుబంధం ఉండేది. యశోదారెడ్డి 2007, అక్టోబర్ 7 న హైదరాబాదులో మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# తెలుగు భాషా శాస్త్ర మార్గదర్శక దీప్తి... గంటి జోగి సోమయాజి

## అక్టోబర్ 7...గంటి జోగి సోమయాజి జయంతి




తెలుగు సాహిత్య చరిత్రలో భాషా శాస్త్ర పరిశోధనలకు, విద్యా రంగాభివృద్ధికి, సాహిత్య సృజనకు జీవితాన్నంతా అంకితం చేసిన మహనీయ పండితుడు గంటి జోగి సోమయాజి. ఆయన ఒక సమగ్ర పండితుడు ం భాషావేత్త, కవి, గురువు, కులపతి, తాత్త్వికుడు. తెలుగు భాషను శాస్త్రీయంగా విశ్లేషించి దాని మూలాలు, వ్యాకరణం, రూప నిర్మాణం, ధ్వన్యాత్మక స్వరూపం వంటి అంశాలను సునిశితంగా పరిశీలించి తెలుగు భాషా శాస్త్రానికి స్థిరమైన పునాదిని ఏర్పరచిన మహామేధావి. గంటి జోగి సోమయాజి 1900 అక్టోబరు 7న అప్పటి విశాఖపట్నం జిల్లాలోని అనకాపల్లిలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు సూరమ్మ, అప్పల నరసింహం. బాల్యంలోనే సంస్కృతం, తెలుగు భాషలపై ఆసక్తి కలిగిన ఆయన విద్యాభ్యాసం విజయనగరం మహారాజా కళాశాలలో సాగింది. 1917%-%19 మధ్య రసాయన శాస్త్రంలో బీఎస్సీ పూర్తి చేసి, తరువాత 1921లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 1926లో తెలుగు, సంస్కృత భాషలలో విద్వాన్ డిగ్రీతో పాటు ఎల్.టి. (లైసెన్షియేట్ ఇన్ టీచింగ్) పూర్తి చేశారు. అదోని ఉన్నత పాఠశాలలో రసాయన శాస్త్ర ఉపాధ్యాయునిగా తన వృత్తిని ప్రారంభించిన ఆయన, అక్కడే తన పినతండ్రి గంటి సూర్యనారాయణ శాస్త్రి వద్ద సంస్కృతం అభ్యసించారు. సేవలో ఉన్నప్పుడే సంస్కృతంలో ఎం.ఎ. పట్టా పొందడం ఆయనలోని విద్యా తపనకు నిదర్శనం. తరువాత మద్రాసులోని పచ్చయప్ప కళాశాలలో సంస్కృత ఉపన్యాసకునిగా మూడు సంవత్సరాలు పనిచేశారు. 1933లో ఆంధ్ర విశ్వ విద్యాలయంలో తెలుగు ఉపన్యాసకునిగా నియమితులై, 1963 వరకు విశ్వ విద్యాలయానికి, విద్యార్థి సమాజానికి విశిష్ట సేవలందించారు. సోమయాజి భాషా శాస్త్ర పరిశోధన భాషా అధ్యయన చరిత్రలో మైలురాయి. తెలుగు మాతృభాష అయినా, ఆయన ద్రావిడ భాషలపై విశేష ఆసక్తి కనబరిచి కన్నడంలో విద్వాన్ పట్టా పొంది, తమిళం, మలయాళ భాషలలో కూడా నిష్ణాతులయ్యారు. ఈ భాషల పరస్పర సంబంధం, మూల శబ్ద పరిణామం, ధ్వన్యనుసరణలు వంటి అంశాలను పరిశీలించి ద్రావిడ భాషల మధ్య వారధిగా నిలిచారు. 1947లో రచించిన "ఆంధ్ర భాషా వికాసము" గ్రంథం ఆయన సాహిత్య జీవితపు శిఖరాగ్ర సృష్టి. ఈ గ్రంథంలో తెలుగు భాషా చరిత్రను శాస్త్రీయంగా విశ్లేషించి, ద్రావిడ భాషల మూలాలు, తెలుగు పదాల వ్యుత్పత్తి, భాషా పరిణామ దశలను స్పష్టంగా నిర్ధారించారు. ఇది తెలుగు భాషా పరిశోధకులకు మార్గదర్శక గ్రంథంగా నిలిచింది. భాషా పరిణామాన్ని వేద సంస్కృతం నుండి ఆంధ్ర ప్రాకృతం, ఆంధ్ర అపభ్రంశం, చివరకు ఆధునిక తెలుగు దశకు ఎలా మారిందో ఆయన సవివరంగా వివరించారు. భాషాశాస్త్రంలో ఆయన కృషితో పాటు సాహిత్య రచనల లోనూ ఆయన ప్రతిభ అద్భుతంగా ప్రతిఫలించింది. కవిగా, నవలా రచయితగా, జీవిత చిత్రకర్తగా ఆయన బహుముఖ ప్రతిభ కలిగినవారు. "బసవ చరిత్ర" (1925), "వంశోద్ధారకుడు" (1927), "ధర్మ సామ్రాజ్యము" (1929), "రామచంద్రుని హంపీ యాత్ర" (1930) వంటి గ్రంథాలు ఆయన సాహిత్య బహుముఖతకు నిదర్శనం. ముఖ్యంగా "రామచంద్రుని హంపీ యాత్ర"లో విజయనగర సామ్రాజ్య వైభవం, ఆధ్యాత్మికత, కళా సంపదను చిత్రీకరించారు. 1948లో వచ్చిన "కొత్త లాంతర్లు" ద్వారా సమాజంలోని మార్పులను సాహిత్య రూపంలో ప్రతిబింబించారు. ఆయన రచించిన "శ్రీ రాధాకృష్ణ ప్రభ" (1970) సంస్కృత పద్యకావ్య రూపంలో భారతదేశం యొక్క మహానుభావుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జీవిత చరిత్రను ప్రస్థావిస్తూ, భారతీయ విద్యాభవనం ద్వారా ప్రచురించబడింది. ఆయన కవిత్వం క్లాసికల్ శైలీ గంభీరతను, ఆధునిక ఆలోచన స్పష్టతను కలిపినది. సంస్కృత కవిత్వంలోని లయ, తాత్త్వికత, తెలుగు పదసంపదలోని మాధుర్యం ఆయన పద్యాల్లో సమన్వితమయ్యాయి. కవిత్వం ద్వారా ఆయన జ్ఞానం, భక్తి, తాత్త్వికత, సౌందర్య భావాలను సమపాళ్లలో వ్యక్తం చేశారు. భాషను ఆయన కేవలం సంభాషణ సాధనంగా కాక, ఆత్మ జ్ఞానానికి వాహనంగా చూశారు. "భాష జీవమయమైన శక్తి ం దానిని సంరక్షించడం మన సాంస్కృతిక కర్తవ్యం" అని ఆయన ఉద్ఘాటించిన మాటలు నేటికీ ప్రాసంగికంగా నిలిచాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆయన భాషాశాస్త్ర విభాగాధిపతిగా, అనంతరం కులపతిగా (%ఎఱఛెవ-జష్ట్రుఅఛెవశ్రీశ్రీశీతీ%) బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన పాలనలో విశ్వవిద్యాలయం విద్యా, సాంస్కృతిక రంగాల్లో పునరుజ్జీవం పొందింది. తెలుగు నిఘంటు నిర్మాణానికి, పరిశోధనా ప్రవృత్తుల పెంపుకు ఆయన అందించిన మార్గదర్శకత్వం విశేషం. ఆయన బోధనలో శిష్యులు పాండిత్యం మాత్రమే కాదు, ఆచరణాత్మక విజ్ఞానాన్ని కూడ సాధించేవారు. ఆయనను శిష్యులు "జ్ఞానతపస్వి"గా గౌరవించారు. తెలుగు భాషా శాస్త్రానికి చేసిన అమూల్యమైన సేవలకు గుర్తింపుగా ఆంధ్ర విశ్వవిద్యాలయం 1975లో ఆయనకు "కళా ప్రపూర్ణ" బిరుదు ప్రదానం చేసింది. ఆయన స్మారకార్థం ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ప్రతి సంవత్సరం "గంటి జోగి సోమయాజి స్మారకోపన్యాసం" నిర్వహించడం ఆయనకు కలిగిన గౌరవస్థాయికి ప్రతీక. 1987 జనవరి 12న ఆయన పరమపదించారు. అయితే ఆయన సృష్టించిన గ్రంథాలు, ఆయన ఆలోచనాత్మక పాఠాలు, ఆయన భాషా విశ్లేషణలు తెలుగు సాహిత్య చరిత్రలో శాశ్వత స్ఫూర్తిదాయక జ్యోతులుగా నిలిచాయి. గంటి జోగి సోమయాజి శాస్త్రం, సాహిత్యం, సంస్కృతి అనే మూడు పరిమాణాలను సమపాళ్లలో మేళవించిన అరుదైన పండితుడు. ఆయన పేరు తెలుగు భాషాభిమానులకు శాశ్వత ప్రేరణ, ఆయన కృషి తెలుగు భాషా శాస్త్రానికి అమూల్య వారసత్వం. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

## చురకలు సంపాదకీయం

# హాట్ టాపిక్... పాక్ కు రష్యా సహకారంలో నిజం ఎంత?

పాకిస్థాన్ కు అగ్రరాజ్యం అమెరికా మద్దతుగా నిలుస్తుందనే చర్చ ప్రపంచవ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారిన సంగతి తెలిసిందే. పాక్ అధికారిక బ్యాచ్ మొత్తం నిత్యం అమెరికాతో సన్నిహిత సంబంధాలు నెరవేరుస్తూ.. ట్రంప్ తో రాసుకుపూసుకు తిరుగుతున్నారనే కామెంట్లు వినిపిస్తున్నాయి. అయితే... భారత్ తో అత్యంత సన్నిహితంగా ఉంటున్న రష్యా సైతం పాకిస్థాన్ కు సహకరిస్తుందనే కథనాలు ఇప్పుడు అత్యంత చర్చనీయాంశంగా మారాయి. అవును... భారత్ కు రష్యా అత్యంత సన్నిహిత వ్యాపార భాగస్వామిగా చెబుతారనే సంగతి తెలిసిందే. ఈ విషయాన్నే ప్రధాన కారణంగా చూపించి.. భారత్ పై అమెరికా పెద్ద ఎత్తున సుంకాలు విధించింది. రష్యాతో భారత్ వ్యాపారం ఉక్రెయిన్ తో యుద్ధానికి పరోక్ష మద్దతు అనే కామెంట్లూ చేసింది. ఈ సమయంలో పాకిస్థాన్ యుద్ధ విమానాలకు రష్యా ఇంజిన్లు సరఫరా చేస్తుందనే వార్తలు ఇప్పుడు అత్యంత హాట్ టాపిక్ గా మారాయి. వివరాల్లోకి వెళ్తే... పాకిస్థాన్ యుద్ధ విమానాల కోసం ఇంజిన్లను రష్యా సరఫరా చేస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ వార్తలను మాస్కో కొట్టిపారేసింది. ఈ సందర్భంగా పాకిస్థాన్ తో తమకు అటువంటి ఒప్పందం ఏమీ జరగలేదని రష్యా ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఇదే సమయంలో... భారత్ తో పెద్ద ఎత్తున వాణిజ్య సంబంధాలను కొనసాగిస్తున్న నేపథ్యంలో.. ఈ తరహా ప్రచారాలు చేయడం సరికాదన్నాయి. అదేవిధంగా... భారతదేశానికి ఇబ్బందికరంగా మారే ఎలాంటి చర్యలు తాము చేపట్టబోమని రష్యా ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. అయినప్పటికీ ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తూనే ఉన్నాయని అంటున్నారు. మరో వైపు ఈ విషయం భారత్ లో మోడీ సర్కార్ పై విపక్షాల విమర్శలకు కారణమైంది. ఈ విషయంపై తాజాగా ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ స్పందించింది.. బీజేపీపై తీవ్ర విమర్శలు చేసింది. ఇందులో భాగంగా... రష్యాను అత్యంత సన్నిహితమైన వ్యాపర భాగస్వామిగా ఓ వైపు ప్రధాని మోడీ చెబుతారని.. కానీ, ఆ దేశం మాత్రం మన శత్రు దేశమైన పాకిస్థాన్ కు మద్దతునిస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరాం రమేష్ ఆరోపించారు. ఇది ప్రధాని మోడీ వైఫల్యాన్ని సూచిస్తుందని అన్నారు. ఇదే సమయంలో... ప్రధాని మోడీ జాతీయ ప్రయోజనాలకంటే తనకు పేరు వచ్చే విషయాలకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తారని జైరాం రమేష్ దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో... అసలు పాకిస్థాన్ కు రష్యా ఎందుకు సహకారం అందిస్తుందో మోడి ప్రభుత్వం వివరించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రపంచ దేశాలతో సంబంధాలను మెరుగుపరుచుకుంటున్నట్లు చెప్పే మోడీ.. దౌత్యం విషయంలో పాకిస్థాన్ ను ఇప్పటికీ ఒంటరిని చేయలేకపోతున్నారని విమర్శించారు. కాగా... పాకిస్థాన్ లో ఉన్న చైనా తయారీ జేఎఫ్-17 ఫైటర్ జెట్లలో వాడే ఆర్.డీ.-93ఎంఏ ఇంజిన్లను రష్యా సరఫరా చేస్తోందంటూ పలు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొంటున్న సంగతి తెలిసిందే. ఈ విషయం అటు అంతర్జాతీయగానూ, ఇటు భారత్ లోనూ హాట్ టాపిక్ గా మారింది. అయితే ఈ విషయంపై పాక్ ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన విడుదల కాలేదు!

# విశేష భాగ్య దాయిని కోజాగరి పౌర్ణమి




అశ్వనీ నక్షత్రానికి చంద్రుడు మిక్కిలి దగ్గరగా ఉండే రోజు ఆశ్వయుజ శుద్ధ పూర్ణిమ విశేష ప్రాధాన్యతను కలిగి ఉంది. లక్ష్మీ దేవికి, శ్రీరామునికి ప్రియమైనదై, ఆశ్వయుజ మాస వ్రతాలలో విశేష భాగ్యదాయిని అయిన కోజాగరీ వ్రతాన్ని దసరా తర్వాత వచ్చే పౌర్ణమినాడు జరుపుకోవడం అనాదిగా వస్తున్న సాంప్రదాయం. హిందువులు పూజించే స్త్రీ దేవతలలో లక్ష్మీదేవిని తొలుత పేర్కొంటారు. భారతీయులచే నిత్య పూజ లందుకునే లక్ష్మీదేవి పేరున ఒక వారము పిలుబడగా, ఏడాదికి ఒకసారి వచ్చే కోజాగరి పూర్ణిమ రోజున విష్ణుపత్నికి విశేష అర్చనలు చేయడం సనాతన ఆచారం. క్షీర సాగరంలో జన్మించిన లక్ష్మీదేవిని విష్ణుమూర్తి భార్యగా స్వీకరించగా, విష్ణువును పురుషునిగా, లక్ష్మిని ప్రకృతిగా భావించి పూజిస్తారు. ఆశ్వయుజ పూర్ణిమ నాడు లక్ష్మీదేవి భూమి అంతా కలయ తిరుగుతూ ప్రతి ఇంటి వద్ద నిలిచి, అర్ధరాత్రి ఎవరు మేలుకుని ఉన్నారని అడుగు తుందిట. ఎవరూ పలకక పోతే వెళ్ళి పోతుందని పురాణ కథనం. అందులకే రాత్రంతా జాగరణ చేస్తూ, క్షీరాభిజాత యైన లక్ష్మికి ప్రీతి పాత్రమైన పంచదార, ఏలక పొడి, కుంకుమ పువ్వు వేసి క్షీరాన్నం వండి, లక్ష్మీ దేవతకు వెన్నెలలో ఉంచి నివేదిస్తారు. ఇలా ఉంచడం వల్ల చంద్ర కిరణాల ద్వారా వచ్చిన అమృతం అందులో పడుతుందని విశ్వాసం. ఆహ్వానించిన అతిథులకు బంధు మిత్రులకు పాలు పంచుతారు. ఇలా లక్ష్మీదే విని అర్చించి, జాగరణ చేస్తే లక్ష్మీదేవి కటాక్షాన్ని పొందుతారని నమ్మకం. ఈ దినం నాడు చుట్టాలతో స్నేహితులతో రాత్రి యక్షక్రీడ ఆడుతూ, అర్ధరాత్రివరకు మేలుకొని ఉండడం పుణ్యప్రదమని శాస్త్ర వచనం. దీనిని భాగ్యవర్తకంగా భావిస్తారు. ఆశ్వయుజ మాసంలో విశేష పుణ్యాన్ని కలిగించే వ్రతం ఏదని వాలఖిల్య రుషిని, రుషులు ప్రశ్నించగా, "కోజాగరీ" వ్రతమని పేర్కొన్నట్లు కథనం. మగధ దేశ విప్రుడైన వలితుడు, భార్య చండిని సంపద కోసం పెట్టే బాధలు భరించ లేక, ఇల్లు వదిలి అడవి బాట పట్టాడు. అలా వెళుతుండగా, నదీతీరాన రాత్రి ముగ్గురు నాగకన్యలు వచ్చి, లక్ష్మీ పూజ చేసి, యక్షక్రీడ ఆడేందుకు గాను నాలుగవ మనిషి కోసం వెతకగా, వలితుడు కన్పిస్తాడు. వారు ఆయ నను యక్షక్రీడకు రమ్మని పిలుస్తారు. దానివల్ల భాగ్యం కలుగలదని చెపుతారు. జూదం వ్యవసమని వలితుడు చెప్పగా, ఆనాడు యక్షక్రీడకు శాస్త్రీయమైన అనుమతి ఉందని, ఒప్పించి, ఆట ప్రారంభిస్తారు వలితుడు మూడు సార్లు ఓడి, ఉన్నదంతా పోగొట్టుకోగా, పంచె, కౌపీనం, యజ్ఞోపవీతం మాత్రమే మిగు లుతాయి. అర్ధరాత్రి లక్ష్మీ నారాయణులు భూలోక సంచారం చేస్తూ, నిద్రపోకుండా ఉన్న పేద బ్రాహ్మ ణుని, నాగకన్యలను గాంచి, సదరు బ్రాహ్మణుని వివాహ మాడాలని వారికి చెపుతారు. తమతో జూదంలో గెలిస్తే, అట్లేయని వారు అంగీకరించగా, ఆ ద్విజుడు ద్విగుణీకృత ఉత్సాహ వంతుడై, విజయుడవుతాడు. వారిని గాంధర్వ వివాహమాడి, నాగకన్యలతో, భాగ్యవంతుడై ఇంటికి తరలగా, చండిని స్వాగతించగా, చీకుచింతా రహితులవుతారు. కోజాగిరి పూర్ణిమ నాడు ద్వార బంధాల ముంగిళ్ళలో గోడల మీద లక్ష్మీదేవి పాద చిహ్నాలు, వరి, శంఖాల, పైడికంటి పిట్టల, ఆకుల బొమ్మలను వేసే పద్ధతి మహారాష్ట్రలో ఉంది. అలంకృత గృహాలలో గవ్వలు లేదా పాచికలు ఆడుతూ మేలుకొని ఉండడం సర్వత్రా ఆచరణలో ఉంది. అలాగే తొలి చూలు బిడ్డకు తల్లి కొత్త బట్టలు వేసి, అక్షతలు చల్లి దీర్ఘాయురస్తు అని దీవించడం, దేవ వైద్యులైన అశ్వినీ దేవతల రక్షణలో తమ పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని చేసే పర్వం కొన్ని చోట్ల పాటిస్తారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# భారతీయ శిక్షాస్మృతి సృష్టికర్త మెకాలే - అక్టోబర్ 6... ఐ పిసి అమలు లోనికి వచ్చిన దినం - 165 ఏళ్లుగా చెక్కు చెదరని మూల రూపం



భారతీయ శిక్షాస్మృతి (ఇండియన్ పీనల్ కోడ్ ఐ పి సి) భారత ప్రభుత్వ ధర్మ శాస్త్రం. భారత దేశంలో నేరాలు చేసిన వారికి దీనిని అనుసరిం చే శిక్ష వేస్తారు. ఇండియన్ పీనల్ కోడ్ (భారతీయ శిక్షాస్మృతి) 1860 – 1860 అక్టోబరు 6 నాడు (1860 లో చేసిన 45 వ చట్టం) మొద లైంది. ఇండియన్ పీనల్ కోడ్ జమ్ము కాశ్మీర్లో కూడా అమలు లో ఉంది. కానీ, ఈ రాష్ట్రంలో ఇండియన్ పీనల్ కోడ్ అనరు. రన్‌బీర్ పీనల్ కోడ్ (ఆర్.పి.సి) అని పిలుస్తారు. ఇండియన్ పీనల్ కోడ్ మూలాలు 1860 నాటి ఆంగ్లేయుల వలస పాలనలో (బ్రిటిష్ ఇండియా) ఉన్నాయి. 1860 నాటి బ్రిటిష్ ఇండియా చేసిన చట్టం ద్వారా ఇండియన్ పీనల్ కోడ్ అమలు లోకి వచ్చింది. మొట్టమొదటి ఇండియన్ పీనల్ కోడ్ చిత్తుప్రతి 1860 లో, మొదటి లా కమిషన్ అజమాయిషిలో జరిగింది. మొదటి లా కమిషన్ ఛైర్మన్ లార్డ్ మెకాలే (థామస్ బాబింగ్టన్ మెకాలే, ఫస్ట్ బేరన్ మెకాలే పి.సి. (జ 1800 అక్టోబరు 25 మరణం 1859 డిసెంబరు 28) ). (ఈయనే భారత దేశంలో ఆంగ్ల విద్యా బోధనకు పునాది వేసిన వాడు). మొదటి ఇండియన్ పీనల్ కోడ్ 1862 సంవత్స రంలో, అమలు లోకి వచ్చింది. నాటి నుంచి ప్రపంచం లోను, భారతీయ సమాజాల లోను, విద్యాపరంగా, వైజ్ఞానికంగా, సముద్రాలలో, సముద్ర గర్భాలలో, రోదసీ లోను, ప్రయాణ వాహనాల లోను, న్యాయపరంగా, వైద్యరంగం లోను, ఉద్యోగ రంగం లోను, బాంక్ లావాదేవీలు (ఏ.టి.ఎమ్), సెల్ ఫోన్లు, సైబర్ నేరాలు, కంప్యూటర్ రంగాలలో జరిగిన సమస్తమైన మార్పులను, మన భారతీయ శిక్షా స్మృతి అనేకమైన మార్పులు, చేర్పులకు గురి అవుతూ, నేటి రూపాన్ని పొందింది. గృహ హింస సెక్షన్ 498-ఎ ఒక ఉదాహరణ. మన భారతీయ శిక్షాస్మృతిలో 511 సెక్షన్లు ఉన్నాయి. వరకట్నం ఛట్టాలు మరో ఉదాహరణ. వరకట్న సమస్య, ఐరోపా, అమెరికా దేశాలలో లేదు కాబట్టి, వరకట్న చట్టాలు, శిక్షలు వారి శిక్షా స్మృతిలో లేవు. లార్డ్ మెకాలే, నాటి ఫ్రెంచి పీనల్ కోడ్, లివింగ్‌స్టోన్స్ కోడ్ ఆఫ్ లూసియానా అనే రెండు ప్రామాణిక గ్రంథాలను ఆదర్శంగా తీసుకుని, మన ఇండియన్ పీనల్ కోడ్ 'చిత్తు ప్రతి' ని తయారు చేసాడు. భారతీయుల ప్రామాణిక గ్రంథాలైన మను స్మృతిని, యాజ్ఞవల్క్య స్మృతిని, నాటి వైదిక పండితుల సలహా, సహాయం కూడా తీసు కున్నాడు. శిక్షల విషయంలో, ఆ నాటి పెద్దలు, పండితులు, రాజులు అభిప్రాయాలను కూడా లెక్కలోకి తీసుకున్నాడు. లార్డ్ మెకాలే మహా మేధావి అయినా, తన అభిప్రాయాల కంటే, నాటి భారత దేశ మత, సాంఘిక, సామాజిక వ్యవస్థలకు, ఆఛార వ్యవహా రాలకు విలువ ఇచ్చి, వారి అభిప్రాయాలను గౌరవించి, తన మేధస్సుతో 'ఇండియన్ పీనల్ కోడ్' చిత్తుప్రతి తయారు చేశాడు. 1860 నాటి ఇండియన్ పీనల్ కోడ్ చిత్తు ప్రతి, మూల రూపం, నేటికీ చెక్కు చెదరలేదు. దీనిమీద కొన్ని విమర్శలు ఉన్నప్పటికీ, ఈ నాటికీ, న్యాయ శాస్త్రంలో, దీనికి తిరుగు లేదు. పాకిస్తాన్ స్వాతంత్ర్యం పొందిన తర్వాత, ఇండియన్ పీనల్ కోడ్ని యధా తధంగా పాకిస్తాన్ తన దేశంలో అమలు చేసింది. దాని పేరు పాకిస్తాన్ పీనల్ కోడ్ (పి.పి.సి). బంగ్లాదేశ్ కూడా బంగ్లాదేస్ పీనల్ కోడ్ పేరుతో అమలు చేసింది. బ్రిటిష్ వలస దేశాలైన, మియన్మార్ (నాటి బర్మా), శ్రీలంక (నాటి సిలోన్, మలేసియా, సింగపూర్, బ్రూనీ దేశాలు కూడా మన ఇండియన్ పీనల్ కోడ్ ను యధాతథంగా (మక్కికి, మక్కి) అమలు చేస్తున్నాయి. లార్డ్ మెకాలే తయారు చేసిన 'చిత్తుప్రతి' ని, నాటి ఛీఫ్ జస్టిస్ సర్ బార్నెస్ పీకాక్, కలకతా సుప్రీమ్ కోర్టు న్యాయాధిపతి (ఇతను నాటి లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడు కూడా) సునిశితంగా, సుదీర్ఘం గా, పరిశీలించి, పరీక్షించాడు. వారి పరిశీలన తర్వాత ఇండియన్ పీనల్ కోడ్ 1860 అక్టోబరు 6 నాడు చట్టసభ ఆమోదం పొందింది. దురదృష్ట వశాత్తు, ఇండియన్ పీనల్ కోడ్ సృష్టికర్త లార్డ్ మెకాలే తన కృషి, చట్టమై, అమలు జరగటం చూడలేదు. కారణం మెకాలే 1859 డిసెంబరు 28 న, తన 59వ ఏట, మరణిం చాడు. ఆయన అవివా హితుడు. ఇండియన్ పీనల్ కోడ్ 1837 లోనే నాటి గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా ఇన్ – కౌన్సిల్ కి నివేదించినా, 1860 సంవత్సరం వరకూ అది వెలుగు చూడలేదు. 1830కి ముందు, భారత దేశంలో, 'ది ఇంగ్లిష్ క్రిమినల్ లా', అనేక చట్ట సవరణలతో, నాటి ప్రెసిడెన్సీ టౌన్ లలో (బొంబాయి, కలకత్తా, మద్రాసు అమలు జరిగేది. ఈ ఇండియన్ పీనల్ కోడ్ ప్రపంచమే కుగ్రామంగా మారినా, జీవితం వేగవంత మైనా, సమాజాలు మారు తున్నా, ప్రపంచమే మారి పోతున్నా కూడా, 162 సంవత్సరాల నుంచి చెక్కు చెదరకుండా, ఉన్నది అంటే, మెకాలే దూరదృష్టి. ఆయన మేధస్సు అనితర సాధ్యం. మరో పది దేశాలకు కూడా తన గ్రంథం ఆయా దేశాలకు వేదం, బైబిల్, ఖురాను అయ్యింది. ఇండియన్ పీనల్ కోడ్ ( భారతీయ శిక్షాస్మృతి ), 1860, నేరాల పరంపరను సేకరించి , వాటికి పడే శిక్షలకు అనుగుణంగా నేరాల విభజన ( వర్గీకరణ )ను చేసింది. నేర పరిశోధనను, ప్రాసిక్యూషన్ ను విభజించ మని ( బ్రిటన్ లోని సి.పి.ఎస్.న్ వలె) దానివలన నేరాలు , శిక్షలు తొందరగా పరిష్కారం అవుతాయని పేర్కొంది. న్యాయ శాస్త్రం లోని పదాల అర్థాల వివరణ, శిక్షలు గురించిన వివరణ, సాధారణమైన మినహా యింపులు, స్వీయ రక్షణ హక్కు నుంచి, అబెట్మెంట్ , (నేరానికి సహకరించుట), నేరపూరితమైన కుట్ర , చట్టము అతిక్రమించు కుట్ర, దేశానికి వ్యతిరేకంగా (దేశ ద్రోహం) చేసే నేరాలు, పదాతి దళం (ఆర్మీ), నౌకాదళం (నేవీ), వాయుసేనా దళం (ఏర్ ఫోర్స్), ఈ మూడు దళాలకి సంబదించిన నేరాలు. (1917లో నేవీ (నౌకాదళం), ఏర్ ఫోర్స్ (వాయుసేనా దళం), సైన్య వ్యతిరేక నేరములు, ప్రజల శాంతి , భద్రతలకు భంగం కలిగించే, ప్రజా సేవకులైన ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన నేరాలు, ప్రభుత్వ ఉద్యోగులు చేసే నేరాలు, ఎన్నికలు వాటికి సంబంధించిన నేరములు, కోర్టు ధిక్కరణ నేరాలు (కంటెంప్ట్ ఆఫ్ లాఫుల్ అథారిటి ఆఫ్ పబ్లిక్ సర్వెంట్స్), తప్పుడు సాక్ష్యాలు, పబ్లిక్ జస్టిస్ కి వ్యతిరేకంగా చేసే నేరాలు, నాణెములు (ప్రభుత్వ ధనము), ప్రభుత్వము ముద్రించే స్టాంపులు, తూనికలు మరియు కొలతలు – సంబంధించిన నేరాలు, ప్రజల ఆరోగ్యము, భద్రత, సౌకర్యము, మర్యాద, నీతి కి సంబంధించిన నేరాలు, మతానికి సంబంధమైన నేరాలు, మానవ శరీరానికి హాని కలిగించే నేరాలు. 1.ప్రాణ హాని ( హత్య తో కలిసి), కల్పబుల్, హొామిసైడ్, 2.గర్భస్రావం కలిగించటం, పుట్టబోయే (ఇంకా పుట్టని) బిడ్డలకు హాని చేయటం ( గాయ పరచటం), ఎక్స్పోజర్ ఆఫ్ ఇన్ఫేంట్స్, కన్సీల్మెంట్ ఆఫ్ బర్త్ (పిల్లల పుట్టుకను వెల్లడించ కుండా దాచటం), 3.గాయపరచటం, 4.అనధి కారకంగా అడ్డుకోవటం, బందించటం (నిర్బంధించటం) 5. నేరపూరితంగా దాడి చేయటం, గాయ పరచటం, 6.కిడ్నాపింగ్ (మనిషిని బలవంతంగా గాని, మోసపూరితంగా గాని ఎత్తుకు పోవటం), అబ్డక్షన్, బానిసత్వం , వెట్టి చాకిరి (బలవంతంగా, బల ప్రయోగం తో పని చేయించు కోవటం), 7.లైంగిక వేధింపులు (అత్యా చారం లేదా మానభంగం ( రేప్ ) తో సహా) – సంబంధించిన నేరాలు, 8.అసహజమైన నేరాలు (సెక్షన్ 377), ఆస్తులకు సంబందించిన నేరాలు 1.దొంగతనం, 2.ఎక్స్టార్షన్, 3.రోబరీ , దోపిడీలు, 4.ఆస్తులకు సంబందించిన విషయాలను తారు మారు చేయటం (క్రిమినల్ మిస్ అప్రోప్రియేషన్ ఆఫ్ ప్రాపర్టీ), 5.నమ్మకం వమ్ము చేయటం (నమ్మించి మోసం చేయటం) (కిమినల్ బ్రీచ్ ఆఫ్ ట్రస్ట్), 6.దొంగతనం చేసిన సొమ్ముని, వస్తువులను (దొంగసొత్తు ), కొనటం, స్వీకరించటం, 7.మోసం చేయటం, 8.తప్పుడు పనుల (తప్పుడు పత్రాల) ద్వారా ఆస్తులను అమ్మటం (ఫ్రాడ్యు లెంట్స్ డీడ్ అండ్ డిస్పొజిషన్ ఆఫ్ ప్రాపర్టీ), 9.అల్లర్లు, అల్లరి పనులు చేయటం, 10.హక్కు ( అనుమతి ) లేకుండా, ఇతరుల ఇళ్ళలోకి, భూములలోకి ప్రవేశించటం, ఆస్తి పత్రాలకు సంబంధించిన నేరాలు, ఆస్తుల (భూములు, ఇళ్ళు) హద్దులకు సంబంధిం చిన నేరాలు: 1.ఆస్తులు (భూములు, ఇళ్ళు), ఇతర హద్దులకు సంబంధించిన నేరాలు, 2. కరెన్సీ నోట్లు, బాంక్ నోట్లు – సంబంధించిన నేరాలు, 1958 లో చేర్చారు. క్రిమినల్ బ్రీచ్ ఆఫ్ కంట్రాక్ట్స్ ఆఫ్ సర్వీస్, పెళ్ళి (వివాహం)కు సంబంధించిన నేరాలు. భర్త, భర్త తాలూకు బందువుల హింస (కరత్వం). గృహ హింస చట్టాన్ని 1983 లో చేర్చారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# ఆక్రమిత కాశ్మీర్: మానవ హక్కుల కోసం నిరంతర పోరాటం




పాక్ ఆక్రమిత కాశ్మీర్ పరిస్థితి గత కొన్ని వారాలుగా అంతర్జాతీయ వేదికలపై చర్చనీయాంశంగా మారింది. హక్కుల కోసం అక్కడి ప్రజలు పెద్ద ఎత్తున వీధుల్లోకి వచ్చి నిరసనలు చేపడుతున్నారు. వ్యాపారాలు, షాపులు, రవాణా అన్నీ బంద్ కావడంతో రోజువారీ జీవనం పూర్తిగా స్థంభించింది. పాకిస్తాన్ సైన్యం, భద్రతా బలగాలు నిరసనకారులపై కాల్పులకు పాల్పడటంతో ప్రాణనష్టాలు సంభవించాయి. 1947లో బ్రిటిష్ భారత విభజన సమయంలో కాశ్మీర్ సమస్య ఉద్భవించింది. పాకిస్తాన్ దాడులతో కొంత భూభాగం వారి చేతికి వెళ్లి అక్కడినుంచి ఆక్రమిత కాశ్మీర్ అనే భావన ఏర్పడింది. తర్వాత జరిగిన యుద్ధాల ఫలితంగా లైన్ ఆఫ్ కంట్రోల్ ఏర్పడి, ఈ ప్రాంతం పూర్తిగా పాకిస్తాన్ ఆధీనంలోకి వెళ్లింది. పేరుకు "ఆజాద్ కాశ్మీర్" అని పిలిచినా, స్వయం నిర్ణయాధికారాలు లేకుండా పాకిస్తాన్ కేంద్ర ప్రభుత్వ నియంత్రణలోనే పరిపాలన కొనసాగుతుంది. 1974లో రూపొందించిన తాత్కాలిక రాజ్యాంగం స్థానిక ప్రభుత్వాన్ని కేవలం అలంకార శాసనసభగా మార్చింది. సరిగా స్వతంత్ర నిర్ణయం తీసుకోలేని పరిస్థితి ఇప్పటికీ కొనసాగుతుంది. 70 సంవత్సరాల పైగా ప్రజల ఆకాంక్షలను అణగదొక్కుతూ, ఆ ప్రాంతాన్ని పాకిస్తాన్ తన సైనిక వ్యూహాల కోసం మాత్రమే ఉపయోగిస్తోంది. ప్రస్తుతం ప్రధాన సమస్య విద్యుత్ కొరత. మంగ్లా డ్యామ్, నీలం–జీలం హైడ్రో ప్రాజెక్టల నుంచి రోజుకు 1,500 మెగావాట్లకు పైగా విద్యుత్ ఉత్పత్తి జరగడం జరుగుతుంది. కానీ దానిలో కేవలం 15%–%20 శాతం మాత్రమే స్థానిక ప్రజలకు అందుతుంది. ఫలితంగా మిర్పూర్, ముజఫరాబాద్, కోట్‌లి పట్టణాల్లో రోజుకు 18%–%20 గంటలపాటు విద్యుత్ కోతలు తప్పడం సాధారణం. పరిశ్రమలు మూతపడుతున్నాయి, విద్యార్థులు చదువుకోలేకపోతున్నారు, సాధారణ కుటుంబాలు అంధకారంలో జీవిస్తున్నాయి. ఉపాధి పరిస్థితి మరింత క్లిష్టంగా ఉంది. 2024 గణాంకాల ప్రకారం నిరుద్యోగం 34 శాతం, పేదరిక రేఖ దిగువన జీవిస్తున్న కుటుంబాలు 40 శాతానికి పైగా ఉన్నాయి. 15%–%30 సంవత్సరాల మధ్య యువతలో దాదాపు 45 శాతం నిరుద్యోగులు. ఉపాధి అవకాశాల లేకపోవడంతో ప్రతి సంవత్సరం 25,000 మంది యువకులు విదేశాలకు వలస వెళ్తున్నారు. ప్రస్తుతం సుమారు 12 లక్షల మంది పాక్ ఆక్రమిత కాశ్మీర్ ప్రజలు మధ్యప్రాచ్యం, యూరప్ దేశాల్లో తక్కువ వేతనాల కూలి పనులు చేస్తున్నారు. విద్యా రంగం కూడా దయనీయంగా ఉంది. 2023 అధికారిక నివేదికల ప్రకారం 45 శాతం పాఠశాలలకు శాశ్వత భవనాలు లేవు. 30 శాతం పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు లేవు. ఉన్నత విద్యా సదుపాయాలు పరిమితంగా ఉండటంతో ప్రతి సంవత్సరం 10,000 మంది విద్యార్థులు పాకిస్తాన్ నగరాలకు వెళ్లి చదవాల్సి వస్తోంది. ఆరోగ్య రంగం మరింత వెనుకబాటులో ఉంది. 2024 గణాంకాల ప్రకారం ప్రతి 10,000 మందికి ఒకే ఒక్క వైద్యుడు మాత్రమే అందుబాటులో ఉన్నాడు. ఆసుపత్రుల్లో పడకలు 1,000 మందికి 0.8 మాత్రమే. అత్యవసర వైద్య సదుపాయాలు లభించకపోవడం వల్ల ప్రతి సంవత్సరం సుమారు 3,000 మంది మహిళలు ప్రసవ సమయంలో ప్రాణాలు కోల్పోతున్నారు. శిశు మరణాల శాతం 42 శాతంగా ఉంది. వనరుల దోపిడీ స్థానికుల ఆగ్రహానికి ప్రధాన కారణం. నీటి వనరులు, అరణ్య సంపద, విద్యుత్ ఉత్పత్తి మొత్తం పాకిస్తాన్ ప్రధాన భూభాగానికి తరలిపోతున్నాయి. స్థానికులు వాటిలో ప్రామాణిక ప్రయోజనం పొందలేరు. 2000%–%2023 మధ్య సుమారు 50,000 ఎకరాల భూమిని పాక్ ఆర్మీ భూసేకరణ ద్వారా స్వాధీనం చేసుకుంది. ఆందోళనలు అణచివేయడానికి పాక్ సైన్యం తరచూ బలవంతానికి దిగుతోంది. సెప్టెంబర్ 2024లో ముజఫరాబాద్‌లో కాల్పుల్లో 3 మంది మరణించగా, తాజా సంఘటనలో మరో 6 మంది ప్రాణాలు కోల్పోయారు. 2018–2023 మధ్య జరిగిన ఆందోళనల్లో కనీసం 250 మంది మరణించి, 1,200 మందికి పైగా గాయపడ్డారు. ఈ కాలంలో 600 మందికి పైగా నిరసనకారులను అరెస్టు చేసి ఇస్లామాబాద్ జైళ్లకు తరలించారు. అంతర్జాతీయ మానవహక్కుల సంస్థలు తరచూ నివేదికలు విడుదల చేస్తున్నాయి. యునైటెడ్ నేషన్స్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ 2018 నివేదికలో పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ప్రజల జీవన ప్రమాణాలు దయనీయంగా ఉండడం, సైన్యం నిర్బంధ పాలన నడపడం మానవహక్కుల ఉల్లంఘనకు నిదర్శనం అని పేర్కొంది. మొత్తానికి, పాక్ ఆక్రమిత కాశ్మీర్ ప్రజలు కోరేది స్వతంత్రంగా జీవించే హక్కు, తమ వనరులపై అధికారం, సాధారణ జీవనానికి అవసరమైన మౌలిక సదుపాయాలు మాత్రమే. కానీ పాక్ ప్రభుత్వం వారి గొంతుకను అణచివేస్తూ, సైనిక బలంతో ఆందోళనలను దమనిస్తున్నది. 1947లో ప్రారంభమైన ఆక్రమణ, అన్యాయం నేటికీ కొనసాగుతూనే ఉంది. అంతర్జాతీయ సమాజం విమర్శలు చేసినా పాక్ ధోరణిని మార్చలేదు. స్థానికుల పోరాటం ప్రపంచానికి మానవహక్కుల పరీక్షగా నిలిచింది. భవిష్యత్తులో సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలు కాకుండా మూల కారణాలపై దృష్టి పెట్టకపోతే పరిస్థితులు మరింత ప్రమాదకరమవుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతర్జాతీయ సమాజం దీన్ని కేవలం ప్రాంతీయ సమస్యగా కాకుండా మానవహక్కుల సమస్యగా పరిగణించి తగిన ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం పెరిగింది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# విశ్వమానవ ఉత్సవం...ప్రపంచ పత్తి దినోత్సవం

## తెల్ల బంగారం... రైతు శ్రమకు గ్లోబల్ గౌరవం - అక్టోబర్ 7...ప్రపంచ పత్తి దినోత్సవం





ప్రపంచ పత్తి దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం అక్టోబర్ 7న ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటారు. వ్యవసాయ రంగంలో అత్యంత ప్రాధాన్యం కలిగిన పత్తి పంట కేవలం వస్త్ర పరిశ్రమకే కాదు, కోట్లాది మంది రైతుల జీవనాధారంగా నిలుస్తుంది. తెల్ల బంగారం అని పిలువబడే ఈ పంటకు అంతర్జాతీయ స్థాయిలో గౌరవం కల్పించడం లక్ష్యంగా ఐక్యరాజ్య సమితి ఆహార మరియు వ్యవసాయ సంస్థ, ప్రపంచ వాణిజ్య సంస్థ, ఐక్యరాజ్య సమితి వాణిజ్యాభివృద్ధి సదస్సు వంటి అంతర్జాతీయ సంస్థలు కలిసి 2019లో మొదటిసారిగా ప్రపంచ పత్తి దినోత్సవాన్ని ప్రారంభించాయి. 2019 అక్టోబర్ 7న స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఐక్యరాజ్య సమితి ఆహార, వ్యవసాయ సంస్థ ఆధ్వర్యంలో జరిపారు. పత్తి ఉత్పత్తి దారులు, వ్యాపారులు, దుస్తుల తయారీ పరిశ్రమ, రైతులు, మరియు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఈ పంట ప్రాధాన్యాన్ని గుర్తు చేసుకునే రోజు ఇది. పత్తి కేవలం ఒక పంట మాత్రమే కాదుబీ అది లక్షలాది మంది రైతుల జీవనాధారం, దుస్తుల పరిశ్రమకు మూలాధారం, ప్రపంచ వ్యాపార చరిత్రలో ఒక ప్రధాన విభాగం. ఈ దినోత్సవం యొక్క ప్రధాన ఉద్దేశం పత్తి పంట యొక్క ప్రాధాన్యతను ప్రపంచ వ్యాప్తంగా గుర్తించటం, దాని ఉత్పత్తి, వ్యాపారం, పర్యావరణ అనుకూలత, ఆర్థిక ప్రాధాన్యతలపై అవగాహన కల్పించడం. పత్తి రైతులు ఎదుర్కొనే సమస్యలు, ధరల మార్పులు, వాతావరణ మార్పుల ప్రభావం వంటి అంశాలపై చర్చించటానికి, స్థిరమైన సాగు పద్ధతులను ప్రోత్సహించటానికి ఈ దినోత్సవం ఒక అంతర్జాతీయ వేదికగా నిలుస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ఎనభైకి పైగా దేశాలు పత్తిని సాగు చేస్తున్నాయి. చైనా, భారతదేశం, అమెరికా, బ్రెజిల్, పాకిస్థాన్, టర్కీ వంటి దేశాలు ప్రధాన ఉత్పత్తిదారులు. వీటిలో భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద పత్తి సాగు దేశంగా నిలుస్తుంది. దేశంలోని మహారాష్ట్ర, తెలంగాణ, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు పత్తి ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్నాయి. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలోని ఎండ ప్రాంతాలు, వర్షాధారిత భూభాగాలు పత్తి సాగుకు అత్యంత అనుకూలమైనవిగా గుర్తించబడ్డాయి. భారతదేశం ప్రపంచ పత్తి ఉత్పత్తిలో కీలక స్థానం కలిగి ఉంది. చైనా తరువాత భారత్ ప్రపంచంలో రెండవ అతిపెద్ద పత్తి ఉత్పత్తిదారు. దేశవ్యాప్తంగా సుమారు 130 లక్షల హెక్టార్ల భూమిలో పత్తి సాగు జరుగుతోంది. సంవత్సరానికి సగటున 360%-%400 లక్షల గింజల బేళ్ల ఉత్పత్తి అవుతుంది. ముఖ్యంగా మహారాష్ట్ర, గుజరాత్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, హర్యానా, మధ్యప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలు ప్రధాన పత్తి ఉత్పత్తి ప్రాంతాలు. భారతదేశం ప్రపంచ పత్తి ఎగుమతుల్లో కూడా మొదటి మూడు స్థానాల్లో ఉంటుంది. "మేడ్ ఇన్ ఇండియా కాటన్" అనే పేరుతో భారత పత్తి ప్రపంచ మార్కెట్లో నాణ్యతకు ప్రతీకగా నిలుస్తోంది. పత్తి పంట కేవలం వస్త్ర తయారీకి మాత్రమే కాకుండా అనేక అనుబంధ రంగాలకు ప్రాణాధారంగా నిలుస్తుంది. పత్తి విత్తనాల ద్వారా నూనె, పిండి, పశువుల మేత తయారీ జరుగుతుంది. అలాగే టెక్స్టైల్ మిల్లులు, హ్యాండ్లూమ్ పరిశ్రమలు, తాడు తయారీ, మెడికల్ కాటన్ ఉత్పత్తులు వంటి అనేక రంగాలకు పత్తి ప్రధాన ముడి సరుకుగా ఉంది. ఈ విధంగా పత్తి పంట దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక స్థంభంగా నిలుస్తుంది. ప్రపంచ పత్తి దినోత్సవం సందర్భంగా పత్తి రైతుల సంక్షేమం, వారికి సరైన ధర భరోసా, కొత్త రకాల విత్తనాల అభివృద్ధి, నీటి వనరుల సమర్థ వినియోగం, పర్యావరణ అనుకూల సాగు విధానాల ప్రోత్సాహం వంటి అంశాలపై ప్రభుత్వాలు, పరిశోధనా సంస్థలు, అంతర్జాతీయ సంస్థలు చర్చలు నిర్వహిస్తాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ పరిధిలో ప్రారంభమైన "కాటన్-4" ప్రాజెక్టు (బుర్కినా ఫాసో, చాద్, మాలి, నైజర్) పత్తి ఉత్పత్తి దేశాల అభివృద్ధి, రైతుల ఆదాయ వృద్ధి కోసం రూపొందించ బడింది. పత్తి పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడే పంట. ఇది సహజమైన, బయో డిగ్రేడబుల్ ఫైబర్ కావడంతో ప్లాస్టిక్, పాలిస్టర్ వంటి కాలుష్య కారక పదార్థాలకు ప్రత్యామ్నాయం అందిస్తుంది. పత్తి ద్వారా తయారయ్యే వస్త్రాలు పర్యావరణానికి మేలు చేసే స్థిరమైన వినియోగ పదార్థాలుగా నిలుస్తాయి. "కాటన్ ఈజ్ లైఫ్" అనే నినాదం పత్తి మనిషి జీవితంలో ఉన్న అంతర్భాగాన్ని ప్రతిబింబిస్తుంది. భారతదేశంలో ఈ రోజు సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యవసాయ విశ్వ విద్యాలయాలు, పరిశోధనా కేంద్రాలు పత్తి రైతుల కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాయి. ఆధునిక సాగు పద్ధతులపై శిక్షణలు, విత్తనాల ప్రదర్శనలు, ఎగుమతుల ప్రోత్సాహం, టెక్స్టైల్ రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాల పరిచయం వంటి అనేక కార్యక్రమాలు ఈ రోజున నిర్వహించ బడతాయి. పత్తి పంట కేవలం వ్యవసాయం కాదు, అది గ్రామీణ భారత ఆర్థిక జీవితానికి నాడిగా ఉంది. రైతుల కృషి, కూలీల శ్రమ, పరిశ్రమల అభివృద్ధి, అంతర్జాతీయ వాణిజ్య విస్తరణ "రైతుల కృషి, కూలీల శ్రమ, పరిశ్రమల అభివృద్ధి, అంతర్జాతీయ వాణిజ్య విస్తరణుఈ అన్ని కలిపి పత్తిని నాగరికతకు ప్రతీకగా నిలుస్తాయి." అందువల్ల అక్టోబర్ 7 ప్రపంచ పత్తి దినోత్సవం కేవలం ఒక పంటకు గౌరవ దినం కాదుబీ అది రైతుల శ్రమకు, ప్రకృతి ప్రసాదానికి, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలకు అంకితమైన విశ్వమానవ ఉత్సవం. తెల్ల బంగారం అయిన పత్తి సమృద్ధి మానవ సమాజ అభివృద్ధికి మూలాధారం. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# ప్రపంచవ్యాప్తంగా శ్రామికుల చైతన్యం...మంచి పని కోసం ప్రపంచ దినోత్సవ సందేశం

## అక్టోబర్ 7....మంచి పని కోసం ప్రపంచ దినోత్సవం

ప్రతి సంవత్సరం అక్టోబర్ 7న ప్రపంచ వ్యాప్తంగా మంచి పని కోసం ప్రపంచ దినోత్సవం (%ఔశీతీశ్రీస ఋuఎ టశీతీ ణవ-ఎవత్ ఔశీతీఎ - ఔణణఔ%) జరుపు కుంటారు. ఈ దినోత్సవం శ్రామికుల హక్కులు, సురక్షితమైన, గౌరవప్రదమైన పని వాతావరణం, సమాన అవకాశాలు, న్యాయపరమైన వేతనం, సామాజిక భద్రత వంటి అంశాలను అంతర్జాతీయ స్థాయిలో గుర్తించడానికి, ప్రోత్సహించడానికి, శ్రామికుల జీవన ప్రమాణాలను మెరుగు పరచడానికి ప్రత్యేక వేదికగా మారింది. ఇది కేవలం ఒక సాంప్రదాయ, గుర్తింపు రోజు మాత్రమే కాదు. ప్రతి దేశం, ప్రతి సంస్థ, ప్రతి వ్యక్తి శ్రామికుల హక్కులు, భద్రత, గౌరవం కోసం కృషి చేయాల్సిన బాధ్యతను గుర్తు చేసుకునే, చైతన్యం పెంచే, సమాజంలో సమానత్వం, న్యాయం, శాంతి మరియు ఆర్థిక స్థిరత్వాన్ని సాధించడానికి ముఖ్యమైన ఒక వేదిక. మంచి పని అంటే కేవలం జీతం పొందే అవకాశం మాత్రమే కాదు. అంతర్జాతీయ కార్మిక సంస్థ ప్రకారం, ఇది వ్యక్తికి సామాజిక గౌరవం, భద్రత, వృత్తిపరమైన అభివృద్ధి, జీవన ప్రమాణాలను మెరుగుపరచే అవకాశాలను కల్పించే పని పరిస్థితులను సూచిస్తుంది. మంచి పని లక్షణాల్లో సరసమైన వేతనం, పని స్థలంలో హక్కులు, సామాజిక భద్రత, భద్రత కలిగిన పని వాతావరణం, సమాన అవకాశాలు ముఖ్యంగా ఉంటాయి. సరసమైన వేతనం అంటే పనికి తగిన, గౌరవంగా జీవించడానికి సరిపడే వేతనంబీ పని హక్కులు అంటే యూనియన్లలో చేరే, సమిష్టి బేరసారాలు చేసుకునే హక్కుతో పాటు ప్రాథమిక హక్కులను గౌరవించడంబీ సామాజిక భద్రత అంటే ఆరోగ్య సంరక్షణ, పెన్షన్, సెలవులు, ప్రసూతి సెలవులు వంటి రక్షణలను కల్పించడంబీ పని భద్రత అంటే సురక్షితమైన, ప్రమాదము లేనిది, ఆరోగ్యకరమైన వాతావరణంబీ సమాన అవకాశాలు అంటే లింగం, జాతి, మతం ఆధారంగా వివక్ష లేకుండా అందరికీ సమాన అవకాశం కల్పించడం. ప్రపంచ వ్యాప్తంగా ఈ దినోత్సవం 2008లో అంతర్జాతీయ ట్రేడ్ యూనియన్ కాన్ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రారంభమై, శ్రామికుల హక్కుల పరిరక్షణ, సమాజంలో సమానత్వం, ఆర్థిక వృద్ధికి పునాదులు వేయడానికి కీలకంగా మారింది. ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో సెమినార్లు, వర్క్‌షాప్‌లు, ర్యాలీలు, చర్చా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాల్లో శ్రామికుల సమస్యలు, నూతన శ్రామిక విధానాలు, భద్రతా మార్గదర్శకాలు, యువ శ్రామికుల పరిస్థితులు, స్త్రీ శక్తి ఉద్యోగాల్లో సమన్వయం వంటి అంశాలను చర్చిస్తారు. ప్రధానంగా శ్రామికుల హక్కుల పరిరక్షణ, సమాన జీతాలు, పని వేళల నియంత్రణ, స్త్రీ-పురుషుల సమాన అవకాశాలు, సురక్షిత పని వాతావరణం, ప్రమాదాల నివారణ, వృత్తిపరమైన గుర్తింపు, ఉద్యోగ సంఘాల మద్దతు, ఆర్థిక స్థిరత్వం, సమాజంలో సమానత్వం వంటి అంశాలను ప్రాధాన్యం ఇస్తారు. ఈ విధంగా ప్రతి పని స్థలం వ్యక్తులకు గౌరవప్రదమైన, భద్రత కలిగిన, సమానత్వంతో కూడిన పని పరిస్థితులను కల్పించ గలుగుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఒక ప్రత్యేక థీమ్‌తో ఈ రోజును జరుపుకుంటారు. దీని ద్వారా శ్రామికులు మరియు కార్మిక సంఘాలు శాంతి, ప్రజాస్వామ్యం,




సమానత్వం, భద్రత కలిగిన పని స్థలాలను సృష్టించడంలో తమ కృషిని కొనసాగించాల్సిన అవసరాన్ని గుర్తు చేసుకుంటారు. భారత దేశంలో, అనధికారిక రంగంలో పనిచేసే శ్రామికులు, మహిళా శ్రామికులు, యువ శ్రామికులు ఇంకా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో, మంచి పని కోసం ప్రపంచ దినోత్సవం భారతదేశంలో కూడా శ్రామికుల హక్కుల పరిరక్షణకు, సురక్షితమైన, గౌరవప్రదమైన పని వాతావరణం సృష్టించడానికి ఒక ముఖ్యమైన వేదికగా మారింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం సుమారు 2.78 మిలియన్ల మంది శ్రామికులు పని సంబంధిత గాయాలు, వ్యాధుల కారణంగా మరణిస్తారు. 374 మిలియన్ల మంది గాయపడ్డారు. ఈ గణాంకాలు శ్రమ భద్రతా మార్గదర్శకాలు, శ్రామిక హక్కుల పరిరక్షణ, సురక్షిత పని వాతావరణం అవసరాన్ని స్పష్టంగా చూపుతాయి. మంచి పని కోసం ప్రపంచ దినోత్సవం శ్రామికులు జీవన ప్రమాణాలను పెంచే, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించడంలో, సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావడంలో కీలకంగా మారింది. ఇది ప్రతి వ్యక్తి, ప్రతి సమాజం, అంతర్జాతీయ స్థాయిలో సమానమైన, భద్రత కలిగిన, గౌరవ ప్రదమైన పని పరిస్థితులను సాధించే పునాదిని సృష్టిస్తుంది. ఈ సందర్భం ప్రతి దేశం, ప్రతి సంస్థ, ప్రతి వ్యక్తి శ్రామికుల హక్కులు, భద్రత, గౌరవం కోసం కృషి చేయాల్సిన బాధ్యతను గుర్తు చేసుకోవడానికి గొప్ప అవకాశం. మన సమాజం, వృత్తిపరంగా ఎదుగుతున్న ప్రతి వ్యక్తి ఈ దినోత్సవం ద్వారా మంచి పని, సమానత్వం, భద్రత మరియు గౌరవం కోసం చురుకుగా కృషి చేయాలి. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# విజయనగర రాజుల ఆధ్యాత్మిక వైభవం... పైడితల్లి సిరిమానోత్సవం

## నేడు విజయనగరంలో పైడితల్లి ఉత్సవాలు



విజయనగరం సిరిమానోత్సవం అతిపెద్ద వేడుక. సిరిమానోత్సవం రాష్ట్ర పండుగ. విజయనగర రాజుల ఆధ్యాత్మిక వైభవం... పైడితల్లి ఉత్సవాలకు తలమానికం. రెండున్నర శతాబ్దాలకు పైబడి నిరంతరాయంగా సిరిమానోత్సవం జరుగుతోంది. ఏటికేడాది పైడితల్లిని దర్శించువచ్చే భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఉత్తరాంధ్రుల కల్పవల్లి, విజయనగరం ప్రజల ఇలవేలుపు శ్రీ పైడితల్లి అమ్మవారి ఉత్సవాలకు తలమానికం సిరిమానోత్సవం. ప్రధానంగా ఈ ఏడు అక్టోబర్ 7న మంగళ వారం సిరిమానోత్సవం జరుపుకుంటారు. 268 ఏళ్ల క్రితం విజయనగరం సంస్థానానికి నాటి రాజు పెద విజయరామరాజు చెల్లెల్నే పైడిమాంబగా చెబుతారు. తాను దేవతగా అవతరించానని, తన ప్రతిమ పెద్ద చెరువులో వెలసి ఉందని, ఆ విగ్రహాన్ని బయటకు తీసి ప్రతిష్ఠించి పూజలు చేయాలని చెప్పి అదృశ్యమయినట్టు, ఆ విగ్రహాన్ని బయటకు తీసి ఆ పెద్ద చెరువు ఒడ్డునే వనం గుడిగా ఆలయం నిర్మించి ప్రతిష్టించి పూజలు చేసినట్లు చరిత్ర చెపుతోంది. ప్రస్తుతం ఉన్న మూడు లాంతర్ల సెంటర్ దగ్గర మరో ఆలయం కట్టారు. దీనినే చదురుగుడి అంటారు. ఇలా పైడిమాంబ నిత్య పూజలు అందుకునే పైడితల్లిగా అవతరించారు. రెండు ఆలయాలైన వనం గుడి, చదురు గుడిలో ధ్వజ స్థంభాలుండవు. పైడితల్లి అమ్మవారు ధ్వజ స్థంభాన్నే సిరిమాను రూపంలో ప్రజల దగ్గరికి తీసుకుని వెళ్తారు. పైడి తల్లి పూజరిని అవహించి ప్రజలకు, రాజ కుటుంబీకులకు ఆశీర్వాదం అందిస్తారు. పైడితల్లి ఉత్తరాంధ్రుల కల్పవల్లిగా పూసపాటి రాజుల ఇలవేల్పుగా భాసిల్లుతోంది. పైడితల్లి అమ్మవారి దేవాలయం విజయనగరం మూడు లాంతర్లు కూడలి వద్ద 1757లో నిర్మించారు. 1758లో ప్రారంభమైన అమ్మవారి ఉత్సవాలు నేటివరకూ సుమారు శతాబ్దాలుగా నిరాటంకంగా కొనసాగుతున్నాయి. క్రీ.శ. 1757 ధాత నామ సంవత్సరం విజయదశమి వెళ్ళిన మంగళవారం నాడు విజయనగరం పెద్ద చెరువులోంచి అమ్మవారి విగ్రహాన్ని పతివాడ అప్పలస్వామి నాయుడు అనే వ్యక్తి పైకి తీశారు. ఆయనే అమ్మవారికి తొలి పూజారి అయ్యాడు. అప్పటినుండి ఇప్పటివరకు ఆ కుటుంబానికి చెందినవారే వంశపారం పర్యంగా పూజారులుగా ఉంటున్నారు. ప్రస్తుత పూజారి ఏడో తరంవాడు. ఈ పూజారే సిరిమానోత్సవంలో సిరిమాను అధిరోహించి భక్తుల్ని ఆశీర్వదిస్తారు. అమ్మవారుగా కొలవబడుతున్న పైడితల్లి విజయనగరం పూసపాటి రాజవంశీయులు పెద విజయరామరాజు చెల్లెలు. పసి ప్రాయం నుండి అధ్యాత్మిక భావాలతో దేవీ ఉపాసన చేసేది. అన్న పొరుగు రాజ్యమైన బొబ్బిలిపై యుద్ధ సన్నాహాలు చేయడం ఆమెను కలతపెట్టింది. బుస్సీ కుట్రకు లొంగిపోయిన విజయరామరాజు చెల్లెలి యుద్ధ నివారణ ప్రయత్నాల్ని లెక్క చేయలేదు. 1757 వరకు బొబ్బిలి, విజయనగరం రాజుల మధ్య స్నేహం కొనసాగింది. ఆ సమయంలో బొబ్బిలి రాజుగా రాజా గోపాలకృష్ణ రంగారావు, విజయనగరం రాజుగా పూసపాటి పెద విజయరామరాజు ఉండేవారు. ఈ రెండు రాజ్యాల సరిహద్దు వాగుల్లోని నీటి వాడకం విషయంలో వివాదం తలెత్తింది. అది యుద్ధానికి దారి తీసింది. అదే బొబ్బిలి యుద్ధం. ఆ యుద్ధంలో వెలమ వీరులు తమ పౌరుష ప్రతాపాల్ని పణంగా పెట్టి విజయమో వీర స్వర్గమో అన్నట్లు పోరాడారు. విజయం విజయ రామరాజునే వరించింది. పెద విజయరామరాజు చెల్లెలు పైడిమాంబ మరణమే సిరిమానోత్సవానికి నాంది పలికినట్లుగా చెపుతారు. పైడిమాంబ చిన్నతనం నుంచి అమ్మవారి భక్తురాలు. యుద్ధం ఇరు వంశాలకు మంచిది కాదని అపాలని ఆమె చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. తన అన్న పెద విజయ రామరాజును హతమార్చేందుకు జరుగుతున్న కుట్రను తెలియ చేసేందుకు బయలుదేరిన పైడిమాంబకు తాంద్ర పాపారాయుని చేతిలో పెద విజయరామరాజు మరణించారనే వార్త తెలుస్తుంది. యుద్ధం ఆపేందుకు తాను చేసిన ప్రయత్నాలు వృధా కావడం, ఆ యుద్ధంలోనే తన సోదరుడు మరణించడం ఆమె తట్టుకోలేక పోతుంది. తన మరణంతో నైనా యుద్దానికి ముగింపు పలికి సామరస్యంగా ఉండాలని కోరుకుంటూ%ఔ%తాను విగ్రహంగా మారి%ఔ%దేవిలో ఐక్యమై పోతున్నానని చెప్పి ఆమె పెద్ద చెరువులో దూకి మరణిస్తుంది. ఇదే సిరిమానోత్సవం జరగడానికి కారణమైన తొలి సంఘటనగా భావిస్తారు. అప్పటినుండి ఆమెను అమ్మవారిగా కొలుస్తూ ప్రతి ఏటా ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాన్ని తిలకిస్తే కోరిన కోర్కెలు ఈడేరు తాయని భక్తుల నమ్మకం. అందువల్లనే దూర ప్రాంతాల భక్తులు సైతం ఆ రోజున పట్టణానికి చేరుకుంటారు. సిరిమానోత్సవం రోజున ఆలయ పూజారిలోకి అమ్మవారు ప్రవేశించి ఊరేగుతారని భక్తుల నమ్మకం. సిరిమాను ఉత్సవంలో అమ్మవారిని దర్శించిన వారికి కోరిన కోర్కెలు తప్పక నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. సిరిమానోత్సవం ప్రధానంగా రైతుల పండుగ. రైతులు పాడిపంటలు బాగా ఉండాలని కోరుకుంటూ భూమి పూజ చేస్తుంటారు. ఉత్సవం ముగిసిన తర్వాత సిరిమానును చిన్నచిన్న ముక్కలుగా చేస్తారు. దానిని రైతులు తీసుకుని వాటిని ఇంట్లో ఉంచుకుని పూజలు చేస్తారు. కొందరు తమ పొలంలో పూజించే చోట ఉంచుతారు. అలాగే విత్తనాలతో పాటు పొలంలో వీటిని విసురుతారు. అలా చేస్తే మంచి పంటలు పండుతాయని నమ్మకం. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఉత్సవాన్ని చూసేందుకు, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలతో పాటు చత్తీస్ ఘడ్, ఒడిషా, పశ్చిమ బెంగాల్ నుంచి కూడా భక్తులు తరలి వస్తారు. ప్రధానంగా, మంగళ, బుధవారం నాడు ప్రధాన ఘట్టాలైన తొలేళ్లు, సిరిమాను ఉత్సవాలు జరగనున్నాయి. లక్షల మంది భక్తులు వచ్చే ఈ ఉత్సవాల కోసం అధికారులు సర్వం సిద్ధం చేశారు. పైడితల్లి అమ్మవారి జాతర ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యంగా పోలీసు శాఖ సమాయత్తమైంది. సిరిమానోత్సవ నిర్వహణకు వేలాది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహించ నున్నారు. విజయనగరంలో కొలువైన ఉన్న శ్రీపైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. సెప్టెంబరు 12 , చదురు, వనంగుడి వద్ద పందిరిరాటతో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అక్టోబరు 22 వరకు మండల దీక్షలు ఉంటాయి. అక్టోబర్ 6 తొలేళ్ల ఉత్సవం, అక్టోబర్ 7 మంగళవారం అమ్మవారి సిరిమానోత్సవం జరుగుతుంది. అక్టోబరు 14 మంగళవారం తెప్పోత్సవం, ఉయ్యాల కంబోత్సవం నిర్వహిస్తారు. చివరి రోజు వనంగుడిలో చండీహోమం, పూర్ణాహుతితో దీక్షలు ముగుస్తాయి. 6న అమ్మవారి తొలేళ్ల ఉత్సవం జరగగా, మంగళవారం (7న) నాడు ప్రధాన ఘట్టమైన సిరిమాను సంబరం జరగనుంది. సిరిమాను ఉత్సవం కోసం అవసరమైన చింతచెట్టును గుర్తించారు. ఈ చెట్టుకు శాస్త్రోత్తంగా పూజలు చేసి, విజయనగరం తీసుకొచ్చారు. ఇప్పటికే గుర్తించిన చెట్టును విజయనగరం హుకుం పేటలో సంప్రదాయబద్ధ రీతిలో సిరిమానుగా మలిచారు. అమ్మవారి ఉత్సవాలలో ప్రధాన ఘట్టాలైన తొలెళ్లోత్సవం, సిరిమాను ఉత్సవం తర్వాత తెప్పోత్సవం జరగనుంది. చివరిగా అమ్మవారి ఉయ్యాల కంబాల ఉత్సవంలో ఈ ఏడాది అమ్మవారి ఉత్సవాలు ముగియనున్నాయి. పూసపాటి రాజుల ఆడపడచు అయిన పైడితల్లి అమ్మవారి జాతరను ప్రతీ ఏడాది అంగరంగవైభవంగా నిర్వహిస్తుంటారు. ఆలయానికి వంశపారంపర్య ధర్మకర్తలైన పూసపాటి రాజవంశీయులు అమ్మవారికి సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలు సమర్పిస్తారు. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**




# తిరుపతిలో మరోసారి బాంబు బెదిరింపుల కలకలం..

తిరుపతి: నగరంలో మరోసారి బాంబు బెదిరింపు వ్యవహారం కలకలం రేపింది. తిరుపతి ఎస్వీ వ్యవసాయ వర్సిటీకి బాంబు బెదిరింపు ఈ-మెయిల్ వచ్చింది.

వర్సిటీ దగ్గర సీఎం చంద్రబాబు పర్యటన కోసం హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. హెలిప్యాడ్ దగ్గర ఐఈడీ బాంబులు పెట్టినట్టు ఈ-మెయిల్ వచ్చింది. దీంతో వెంటనే అప్రమత్తమైన అధికారులు హెలిప్యాడ్ పరిసరాల్లో బాంబు స్క్వాడ్, పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. మరోవైపు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు వెల్లడించారు.

అయితే గతంలోనూ తిరుపతి నగరానికి బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చిన విషయం తెలిసిందే. నాలుగు చోట్ల ఆర్డీఎక్స్ పేలుడు పదార్థాలు పేలనున్నాయి.. అంటూ టీటీడీ డోనార్ సెల్‌కు మెయిల్స్ వచ్చాయి. మెయిల్‌తో బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్లతో తిరుపతి తోపాటు తిరుమలనూ అధికారులు జల్లెడ పట్టారు.

తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు, అనుమానాస్పద వస్తువులు దొరకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా, అప్పుడు కూడా.. సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఈ బాంబు బెదిరింపులు రావడం గమనార్హం. అసలు బెదిరింపులకు ఎవరు పాల్పడుతున్నారు..? ఎందుకు పాల్పడుతున్నారు..? ఈ బెదిరింపుల వెనక రాజకీయ లేదా వ్యక్తిగత కుట్రలు ఉన్నాయా..? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. తాజా బెదిరింపుల నేపథ్యంలో తిరుపతిలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

# శివారు వార్డులపై శీతకన్ను

బెల్లంపల్లి : ఇది బెల్లంపల్లి మున్సిపాల్టీలోని 3, 17వ వార్డులు కలిసి ఉన్న రోడ్డు. ఇక్కడ వీధి దీపాలు మూడేళ్లుగా వెలగడం లేదు. విద్యుత్తు స్తంభాలు ఉన్నా వాటికి బిగించిన తీగలను దొంగలు ఎత్తుకెళ్లారు. తీగలు లేక చీకట్లోనే ప్రజలంతా రాకపోకలు సాగిస్తుంటారు. రవీంద్రనగర్, చిన్నబూద గ్రామాల ప్రజలు ఈ రోడ్డు వెంట వెళ్లాలంటే భయపడుతున్నారు. మున్సిపల్ అధికారులు పండగ సందర్భంగానైనా వీధి దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. జిల్లాలోని శివారు వార్డులపై మున్సిపాల్టీలు చిన్నచూపు ప్రదర్శిస్తున్నాయి. పురపాలికలు కనీస మౌలిక సదుపాయాల కల్పనలో విఫలమవుతున్నాయి. సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఇక్కడి ప్రజలంతా సమస్యలతో సహవాసం చేస్తున్నారు. అభివృద్ధి అంతంతమాత్రంగానే కనిపిస్తోంది. జిల్లాలోని బెల్లంపల్లి, చెన్నూరు, లక్షెట్టిపేట, క్యాతనపల్లి, మందమర్రిలతో పాటు మంచిర్యాల కార్పొరేషన్‌లోని శివారు వార్డుల్లో ప్రజలు సమస్యలతో అవస్థలు పడుతున్నారు.

**అధికారులకు విన్నవిచ్చినా..**

అక్కడి వార్డుల్లో మౌలిక సదుపాయాలను కల్పించడంలో అధికారులు చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదు. సేవలు ఆలస్యంగానే అందుతున్నాయి. అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చెత్తంతా రోడ్లపైనే కనిపిస్తోంది. అధికారులకు సమాచారమిచ్చినా సమస్యలు పరిష్కారం కావడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

**జిల్లాలో ఇదీ పరిస్థితి**



మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని ఒడ్డెరకాలనీ, రాజీవ్‌నగర్, గాంధీనగర్, తిలక్‌నగర్, ఎన్‌టీఆర్ కాలనీ, అండాలమ్మకాలనీలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీల నిర్వహణ సరిగా లేదు. తాగునీటి కోసం ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. మిషన్ భగీరథ నీరు పూర్తిస్థాయిలో ఇళ్లకు చేరడం లేదు. బెల్లంపల్లి పురపాలికలోని సుబ్బరావుపల్లి, అంబేడ్కర్‌నగర్, షంషీర్‌నగర్, గంగారాంనగర్‌లో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. చెత్త వాహనాలు ప్రతిరోజు రావడం లేదు. చెత్తంతా పోగై కంపుకొడుతోంది. చెన్నూరు మున్సిపాల్టీలోని శివారు వార్డుల్లో మురుగు కాలువలు, అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. ఆరో వార్డులోని ఆదర్శనగర్‌లో నిత్యం ప్రజలు సమస్యలతో ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. క్యాతనపల్లి మున్సిపాల్టీలోని కనకదుర్గ కాలనీ, తిలక్‌నగర్, అల్లూరి సీతారామరాజునగర్‌లో డ్రైనేజీలు శిథిలావస్థకు చేరాయి. అంతర్గత రోడ్లు మరమ్మతులకు నోచుకోవడం లేదు. చెన్నూరు మున్సిపాల్టీ ఆరో వార్డులోని రోడ్డు పరిస్థితి ఇది. వర్షాకాలం వస్తే చాలు రోడ్డు బురదమయంగా మారుతుంది. ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తారు రోడ్డుపై ఇసుక వేయడంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు.

# మూత్రంపిండం.. ప్రాణ గండం

భైంసా: నిర్మల్ జిల్లా తానూరు మండలం మొగిలి గ్రామ పంచాయతీ పరిధిలోని మసల్గతండాను కిడ్నీ వ్యాధి వేధిస్తోంది. తండాలో 90 కుటుంబాలు ఉన్నాయి. 20 మంది కిడ్నీ వైఫల్య బాధితులు ఉండగా, మూడేళ్లలో ఆరుగురు మృతి చెందారు. రెక్కాడితే కానీ డొక్కాడని ఆ కుటుంబాలు పశుసంపదను అమ్ముకుంటూ, అప్పు చేస్తూ చికిత్సలు చేయించుకుంటున్నారు. ప్రభుత్వం కనీసం వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, వైద్యసేవలు అందించాల్సిన అవసరముంది.

**ఇదీ పరిస్థితి...**


మసల్గతండా గ్రామస్థులు కిలోమీటరు దూరంలో ఉన్న ఊట బావి నుంచి నీరు ట్యాంకులకు సరఫరా చేసుకుని వినియోగిస్తున్నారు. మిషన్ భగీరథ ఉన్నా సరఫరా కావడం లేదు. తాగు నీటి ద్వారా ఫ్లోరైడ్‌తో మూత్ర పిండాల్లో రాళ్లు ఏర్పడి కిడ్నీ వైఫల్యానికి దారి తీస్తున్నట్లు నిపుణులు చెబుతున్నారు. చిన్న జ్వరం వచ్చినా వైద్యులను ఆశ్రయించకుండా నొప్పినివారణ మాత్రలు వాడటం కిడ్నీలపై ప్రభావం చూపిస్తుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

**ఎకరం పొలం అమ్మినా..అంగూరే బాయి**

నడుము నొప్పితో ఆసుపత్రికి వెళ్తే కిడ్నీ సమస్య ఉందని శస్త్రచికిత్స చేశారు. రూ.3 లక్షల వరకు ఖర్చయింది. ఎకరం పొలం అమ్మాను. ప్రతినెలా చికిత్సలకు, మందులకు రూ.10 వేల వరకు ఖర్చవుతుంది.

**రూ.5 లక్షలు ఖర్చు చేసినా లాభం లేదు..**

జాదవ్ రేణుకాబాయి నా భర్త రామారావు కిడ్నీ పాడైంది. డయాలసిస్ కోసం మేకలు, గేదెలు అమ్మి రూ.5 లక్షలు ఖర్చు చేసినా ఆరు నెలల క్రితం మృతి చెందారు. నా పరిస్థితి అలాగే ఉంది. ప్రతినెలా చికిత్సలు, మందులకు రూ.10 వేల వరకు అవుతుంది. నా తోటి కోడళ్లు శాంతాబాయి అయిదేళ్లుగా, కమల్‌బాయి ఏడాదిగా కిడ్నీ వైఫల్యంతో



బాధ పడుతున్నారు.


**రెండు కిడ్నీలు పాడయ్యాయి**

రెండేళ్ల క్రితం అనారోగ్యంతో నిజామాబాద్, నాందేడ్, హైదరాబాద్‌లోని ఆసుపత్రులకు తిరిగాను. చివరకు రెండు కిడ్నీలు పాడైనట్లు వైద్యులు చెప్పారు. మందులు వాడినా తగ్గలేదు. 8 నెలలుగా వారానికి రెండు సార్లు భైంసా ప్రాంతీయ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నా. పని చేసే శక్తి లేక ఇంటికే పరిమితమయ్యాను. –జాదవ్ ఆనంద్‌రావు

**నాతో పాటు నా కోడలు పరిస్థితి ఇదే..**

జాదవ్ రుక్మాబాయి నేను అయిదేళ్లుగా, నా కోడలు నీలాబాయి ఆరు నెలలుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాం. ముంబయిలోని ఆసుపత్రిలో చూపించుకుంటున్నాం. అప్పు చేసి మందులు కొంటున్నాం.

# తప్పుడు పోస్టులు.. తప్పవు కటకటాలు



ఆదిలాబాద్ : టాంజానియాలో ఉంటూ విద్వేషాలు రెచ్చగొట్టేలా వాట్సప్‌లో పోస్టు పెట్టిన నిందితుడు షేక్ ఇర్ఫాన్‌ను ఆదిలాబాద్ పోలీసులు ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇటీవల అరెస్టు చేశారు. ఓ రౌడీ షీటర్ అరెస్టు విషయంలో పోలీసులను కించపరిచేలా పోస్టులు పెట్టిన ఫలితంగా జైలుకు తరలించారు.

**శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా..**

పోలీసులు ఓ వ్యక్తిని పట్టుకొని కొడుతున్న వేరే ప్రాంతానికి చెందిన పాత వీడియోను ఆదిలాబాద్‌లోని బొక్కలగూడ యువకుడు పోస్టు చేశాడు. ఆదిలాబాద్‌లో జరిగిన సంఘటనగా వివరాలను నమోదు చేశాడు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా పాత వీడియో పోస్టు చేశాడని అతనిపై పోలీసులు రెండ్రోజుల కిందట కేసు నమోదు చేశారు.

సామాజిక మాధ్యమాల వినియోగంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. వాట్సప్, ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్, ఎక్స్ లాంటి వాటిలో కొందరు రకరకాల పోస్టులు పెడుతుంటారు. వీటిలో కొన్ని అవాస్తవాలు, మరికొన్ని విద్వేషాలు రెచ్చగొట్టేలా, మతాలు,వర్గాల మధ్య విభేదాలు సృష్టించేలా ఉంటాయి. వీటిని గుడ్డిగా నమ్మి కొందరు ఇతర గ్రూపులకు పంపిస్తుంటారు. దీంతో కొందరి పరువుకు భంగం కలగొచ్చు.. మత, వర్గ విభేదాలకు కారణం కావచ్చు. ప్రస్తుతం ఎన్నికల సమయంలో జిల్లా యంత్రాంగం సోషల్ మీడియా సెల్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. తప్పుడు పోస్టులు పెట్టిన వారితోపాటు, గ్రూప్ అడ్మిన్‌లనూ ఇందుకు బాధ్యులను చేస్తారు.

**కేసులు నమోదైన దృష్టాంతాలు ..**

గుడిహత్నూర్ మండలంలోని ఓ యువకుడు ఇన్‌స్టాగ్రాంలో తన సోదరి పేరిట ఫేక్ ఐడీ తయారు చేసి మహిళ పట్ల తప్పుడు ప్రచారం చేస్తూ సామాజిక మాధ్యమంలో పోస్టు చేశాడు.

ఆదిలాబాద్ పట్టణంలోని ఒక యువకుడు ఓ ప్రార్థన మందిరం విషయంలో తప్పుడు ప్రచారం చేస్తూ పోస్టులు పెట్టాడు.

సిరికొండ మండలంలోని ఒక యువకుడు చైల్డ్‌పోర్న్ వీడియోలు చూడటమే కాక.. వాటిని డౌన్‌లోడ్ చేసి సామాజిక మధ్యమాల్లో పోస్టు చేశాడు.

మారణాయుధాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా పోస్టు చేసిన పాత నేరస్థుడు కైంచీ సలీం అనే యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఒక యువకుడు కత్తులు, డాగర్లతో ప్రదర్శన చేస్తూ వీడియో పెట్టాడు.

**ఈ సెక్షన్ల(బీఎన్ఎస్) ప్రకారం..**

196 : వర్గ విభేదాలు సృష్టించటం

353 : పరువుకు భంగం కలిగించటం, అవమానపర్చటం

78 : మహిళలను కించపర్చడం

66–డి ఐటీ యాక్ట్ : సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేయటం

ఈ ఏడాది నమోదైన కేసులు : 53

**నిజానిజాలు తెలుసుకోవాలి**

ఎల్.జీవన్‌రెడ్డి, డీఎస్పీ ఆదిలాబాద్ సామాజిక మాధ్యమాల్లో అవాస్తవాలు ప్రచారం చేసినా, వర్గ, మత విభేదాలు సృష్టించేలా పోస్టులు చేసినా.. బాధ్యులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తాం. గ్రూపుల్లో వచ్చే సమాచారం ఏదైనా నిజానిజాలు తెలుసుకోవాలి. తప్పుడు పోస్టులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలి.

# ప్రణాళికతో.. పట్టిందల్లా ‘ఉద్యోగమే’



ఆదిలాబాద్: ఒక ప్రభుత్వ ఉద్యోగం రావడమే కష్టంగా ఉన్న ఈ రోజుల్లో.. వీరు పట్టిందల్లా బంగారం అన్నట్లు.. పరీక్షలు రాస్తే చాలు కొలువు కొడుతూ సత్తా చాటారు. ఒకటి, రెండు కాదు ఏకంగా మూడు, నాలుగు ఉద్యోగాలు సాధించారు.. ఆ విజయాల వెనుక నిరంతర శ్రమ.. కఠిన సాధన.. తపన ఉంది. వేలమంది పరీక్షలు రాస్తే అందులో కొంతమంది మాత్రమే వరుస ఉద్యోగాలను పొంది ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు. ఎలా సాధించారు..? ఏం చదివారు..? రూపొందించుకున్న ప్రణాళిక తదితరాలపై ‘విజేతల అంతరంగమిది..’

**సోషల్ మీడియాకు దూరం..**

ఉట్నూరు మండలం పెర్కగూడకు చెందిన మహేశ్ వరుసగా నాలుగు ఉద్యోగాలు సాధించారు.. ముందుగా పోలీస్, తర్వాత ఫైర్‌మెన్ ఉద్యోగాలు పొందారు. అనంతరం ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేసి ఉన్నత ఉద్యోగమే లక్ష్యంగా పెట్టుకున్నారు. రాత్రి 11 గంటల తెల్లవారుజాము వరకు పుస్తకాలతో కుస్తీ పట్టారు. గ్రూప్–4లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం, తాజాగా గ్రూప్–2 ఫలితాల్లో ఎంపీవో ఉద్యోగం సాధించారు. పరీక్షలు పూర్తయ్యే వరకు సెల్‌ఫోన్, టీవీ, సినిమాలకు దూరంగా ఉండటం, సిలబస్‌కు తగ్గట్లు నోట్స్ ప్రిపేర్ చేసుకోవడం తన విజయానికి కారణమని ఆయన అన్నారు..

**మార్గదర్శకత్వం అవసరమే**

అనుభవజ్ఞులైన వ్యక్తుల నుంచి మార్గదర్శకత్వం పొందడం అవసరమే.. నా విషయంలో మా వారు ఇచ్చిన ప్రోత్సాహం, సలహాలు, సూచనలు ఎంతో ఉపయోగపడ్డాయని వరుస ఉద్యోగాలకు అర్హతలను సాధిస్తూ, తాజాగా ఐసీడీఎస్‌లో సూపర్‌వైజర్‌గా ఉద్యోగం పొందిన బోథ్ మండలానికి చెందిన ప్రవర్ష అన్నారు.. చదివేటప్పుడు ప్రధాన అంశాలను నోట్స్ రాసుకోవడం, గత పరీక్ష పత్రాలను విశ్లేషించుకోవడంతో ప్రశ్నల తీరును అర్థం చేసుకోవచ్చని ఆమె అన్నారు.. ప్రతి రోజు ఆరు గంటలు చదివేందుకు కేటాయించినట్లు తెలిపారు..

**మాక్ టెస్టులు.. ప్రాక్టీస్ పేపర్లు**

ఆదిలాబాద్ రవీందర్‌నగర్‌కు చెందిన సుదగణ నందిని బీటెక్ పూర్తిచేసి రెండు, మూడు ప్రైవేట్ కంపెనీల్లో వరుస ఉద్యోగాలు చేశారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో గ్రూప్–4లో జూనియర్ అసిస్టెంట్, గ్రూప్–3లో అర్హత పొందారు. తాజాగా గ్రూప్–2లో ఎంపీవో ఉద్యోగానికి ఎంపికయ్యారు. మాక్ టెస్టులు, ప్రాక్టీస్ పేపర్లు సాధన చేయడంతో ప్రశ్నల తీరు అర్థం చేసుకోవచ్చు.. సమయం విలువైనదిగా భావించి ముందుగా విషయాలపై పట్టు సాధించాలని ఆమె చెబుతున్నారు. పరీక్ష హాల్‌లో సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం కూడా కీలకమేనని అంటున్నారు.

**ఆత్మవిశ్వాసం అవసరం..**

జైనథ్ మండలం అడ గ్రామానికి చెందిన అవినాష్ ఇంటర్ వరకు ప్రభుత్వ పాఠశాలల్లో, అదీ తెలుగు మీడియంలో చదివారు. గ్రూప్ పరీక్షల్లో విజయం సాధించాలంటే ఆత్మవిశ్వాసం, సానుకూల ఆలోచన చాలా ప్రధానమని ఆయన అన్నారు. గ్రూప్–3లో అర్హత సాధించగా, తాజాగా గ్రూప్–2లోనూ ఎంపీవోగా ఉద్యోగం తెచ్చుకున్నారు. ‘ఒత్తిడికి లోనుకాకుండా గమ్యానికి చేరుకునేలా నిరంతరం శ్రమించాలి.. గ్రంథాలయంలో రోజూ 12 నుంచి 14 గంటలు చదవడం ప్రారంభించాను.. స్టడీ సర్కిల్స్ పరీక్షలను రాస్తూ ప్రిపేర్ కావడంతో ఆశించిన లక్ష్యం చేరుకున్నట్లు’ ఆయన వివరించారు.

# అందుబాటులోకి కీమోథెరపి సేవలు

మంచిర్యాల : జిల్లాలోని క్యాన్సర్ బాధితులకు కొంత ఉపశమనం లభించింది. ఈ వ్యాధి బారిన పడి చికిత్స కోసం దూర, ఆర్థికభారంతో ఇబ్బందులు పడుతున్నవారికి ప్రయోజనం చేకూరింది. మంచిర్యాల మాతా, శిశు ఆరోగ్య కేంద్రంలో క్యాన్సర్ సెంటర్ అందుబాటులోకి వచ్చింది. వ్యాధి సోకి యాతన పడుతూ వైద్యం కోసం అవస్థలు పడుతున్న బాధితులకు చేరువైన ఈ సేవలతో కాస్త ఊరట కలిగినట్లయింది అధికారికంగా కీమోథెరపి విధానాన్ని ఎంసీహెచ్‌లో ప్రారంభించారు. ఓ బాధితురాలికి చికిత్స అందించారు.

**రెండో డోసు నుంచి ఇక్కడే..**

క్యాన్సర్ అనేక రకాలు ఉండగా నిర్ధారణ అయిన వెంటనే బాధితులను జిల్లాల నుంచి హైదరాబాద్‌లోని క్యాన్సర్ హాస్పిటల్‌కు రెఫర్ చేస్తున్నారు. అక్కడ పరీక్షలు నిర్వహించి ఇవ్వాల్సిన మందులు, అవసరమైన వారికి కీమోథెరపి బాధిత వ్యక్తి పరిస్థితి దృష్ట్యా మోతాదును నిర్ధారించి మొదటి డోసును అందిస్తారు. పర్యవేక్షించి ఎలాంటి సమస్యలు తలెత్తలేదంటే వారితో పాటు చికిత్స వివరాలను జిల్లా క్యాన్సర్ సెంటర్‌కు పంపిస్తారు. అనంతరం రెండో డోసు నుంచి హైదరాబాద్‌కు వెళ్లకుండా ఇక్కడే పొందవచ్చు. క్యాన్సర్ తీవ్రత ఆధారంగా కీమో మోతాదు, డోసులు అందిస్తారు. మందులకే పరిమితమైన వారు సైతం ఇక్కడే స్వీకరించవచ్చు. ఇప్పటికే అవసరమైన



మాత్రలు, సూదిమందులను కేంద్రాలకు అందజేశారు. ఈ కీమోథెరపి చికిత్సను అందించేందుకు ఇంతకుముందే జిల్లా నుంచి వైద్యులు మూడు రోజులపాటు హైదరాబాద్‌లో శిక్షణ తీసుకున్నారు. జనరల్ సర్జన్ నిపుణురాలు అశ్లేషా ఈ వైద్యాన్ని అందించనున్నారు. ఈమెతో పాటు మరో అనస్తీషియా వైద్యురాలు కూడా ఈ సేవలో భాగస్వాములు కానున్నారు. జిల్లాకు చెందిన బాధితురాలికి చికిత్స అందించగా పర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డితో పాటు ఆర్ఎంఓలు భీష్మ, శ్రీధర్ పర్యవేక్షించారు. ఈ వైద్యం అందుబాటులోకి రావడంతో జిల్లా బాధితులకు ఉపశమనం లభించిందని, సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో భారీగానే బాధితులు ఉన్నారని, మొదటి కీమో అనంతరం ఇక్కడే సేవలు పొందవచ్చని చెప్పారు.

# అటకెక్కిన వినియోగం.. భవనం నిరుపయోగం

కరీంనగర్ : కూరగాయలు, పండ్లు, పూలు, మాంసం, కిరాణ సామగ్రి మొదలైనవన్నీ ఒకే చోట లభించేలా సమీకృత మార్కెట్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించింది. దీనిలో భాగంగానే కరీంనగర్ నగరవాసుల కోసం పద్మనగర్ సమీకృత మార్కెట్‌ను స్మార్ట్‌సిటీ నిధులు రూ.16.50 కోట్లతో నిర్మించి ఎనిమిది నెలల కిందట ప్రారంభించారు. వీటిల్లో అమ్ముకోవడానికి 164 స్టాళ్లను, 22 షట్టర్లను నిర్మించి లక్కీ డ్రా ద్వారా అప్పగించారు. అప్పటి నుంచి మొత్తం మంది వ్యాపారులు రాకపోవడం, అధిక శాతం మంది వ్యాపారులు ఒప్పందం చేసుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది.

**నిర్లక్ష్యమే కారణమా?**

కొనుగోలుదారులు రావడంలేదని వ్యాపారులు, వ్యాపారులు రావడంలేదని కొనుగోలుదారులు ఎవరికి వారు నిర్లక్ష్యం చూపుతున్నారు. రాంనగర్, పద్మనగర్, మంకమ్మతోట, సప్తగిరికాలనీ, భాగ్యనగర్, విద్యానగర్, మల్కాపూర్, లక్ష్మీపూర్, చింతకుంట ప్రజలు ఇక్కడికి వచ్చి కొనుగోలు చేసేలా విస్తృత ప్రచారం చేయాలి.

అధికారులు చర్యలు తీసుకోకపోతే భవనం పనికి రాకుండా పోతుంది.



**వసతులు కల్పించినా..**

ప్రస్తుతం సమీకృత మార్కెట్ భవనం ఖాళీగా ఉంది.

వ్యాపారుల సౌకర్యార్థం ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, నీటి వసతి, పార్కింగ్ కల్పించారు. విద్యుత్తు సౌకర్యం కల్పించడంతో వినియోగించుకున్నా సాధారణ ఛార్జీలు భారం మాత్రం బల్దియాపైనే పడుతోంది.

కూరగాయలు విక్రయించే ఓ అయిదారుగురు వ్యాపారులు, చికెన్ వ్యాపారీరాగా గిరాకీ లేకపోవడంతో మానేశారు.

**త్వరలో తరలిస్తాం**

మార్కెట్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించాం. వ్యాపారులు ఈ అవకాశాన్ని ఉచితంగా వినియోగించుకోవాలి. స్టాళ్లు దక్కించుకున్న వారు దుకాణాలు నిర్వహించాలి. త్వరలోనే రోడ్డు పక్కన ఉన్న వ్యాపారులను మాంసం, చేపలు అమ్మే వారిని ఇక్కడికి తరలిస్తాం. ప్రఫుల్ దేశాయ్, కమిషనర్, కరీంనగర్ నగరపాలిక

# మహిళా శక్తి.. సంపద సృష్టి

పెద్దపల్లి : రుచికరమైన మిఠాయిలు, నోరూరించే పిండి వంటకాలు, నాణ్యమైన ఇంటి భోజన రుచులతో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు పట్టణ ప్రజలకు ఆహ్వానం పలుకుతున్నాయి. మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ‘ఇందిర మహిళా శక్తి’ పథకాన్ని అమలు చేస్తుండగా వీరంతా అందిపుచ్చుకుని ఆర్థికంగా రాణిస్తున్నారు. శుభకార్యాలకు వంటకాలు అందిస్తూ ఉపాధి పొందుతున్నారు.

**పాకశాస్త్రంలో శిక్షణ**


స్వయం సహాయక సంఘాల్లోని ఔత్సాహిక మహిళలను క్యాంటీన్ల నిర్వహణకు ఎంపిక చేశారు. హైదరాబాద్‌లో వంటల తయారీలో మెలకువలు, నైపుణ్యాలపై శిక్షణ అందించారు. సరకుల వినియోగం, నిర్వహణ, లావాదేవీలపై సందేహాలను నివృత్తి చేసి పాకశాస్త్రంలో ప్రావీణ్యం పొందేలా సిద్ధం చేశారు. వ్యక్తిగతంగా ఒక్కొక్కరికి రూ.2–5 లక్షలు, సంఘానికి రూ.5–20 లక్షలకు రుణాన్ని మంజూరు చేస్తూ తోడ్పాటు అందిస్తున్నారు.

**15 చోట్ల ఏర్పాటు**

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో 15 చోట్ల మహిళా క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. బయట వంటకాల కంటే రుచి, శుచికరమైన పదార్థాలు లభించడంతో ఆర్డర్లు, ఆదాయం పెరుగుతోంది. కొన్నిచోట్ల ఉచితంగా వసతి కల్పించగా మరికొన్ని ప్రాంతాల్లో అద్దె చెల్లించాల్సి ఉండటంతో అదనపు భారమవుతోంది. వంట పాత్రలు, సరకుల కొనుగోళ్లపై రుణ మంజూరులో రాయితీ కల్పించాలని కోరుతున్నారు.

**బీడీలు చుట్టడం తప్పిందిగంగాభవాని, గంగాధర, కరీంనగర్**

రెండేళ్ల కిందట బీడీలు చుట్టి కుటుంబాన్ని పోషించాను. నెలకు రూ.3 వేలు కూడా వచ్చేది కాదు. అధికారుల తోడ్పాటుతో క్యాంటీన్ ఏర్పాటు చేశాం. అన్ని రకాల వంటకాలు చేస్తున్నాం. ఇంటి భోజనంలా ఉ



ండటంతో అందరికీ నమ్మకం పెరుగుతోంది. ప్రస్తుతం నెలకు రూ.6 వేలు సంపాదిస్తున్నా.

**నెలకు రూ.30 వేలు భారతి, మల్లాపూర్, జగిత్యాల జిల్లా**

నాకు వంటలపై కొంత పట్టు ఉంది. సంఘం సమావేశంలో క్యాంటీన్ కోసం అనుమతి ఇచ్చారు. వంటకాల తయారీపై శిక్షణ తీసుకోవడంతో మరింత నైపుణ్యం పెరిగింది. పెళ్లిళ్లు, శుభ కార్యాలయాలకు పిండి వంటలు, భోజనం తయారు చేస్తున్నా. నెలకు రూ.30 వేల ఆదాయం వస్తోంది.

**కేరళ బృందం ప్రశంసలుకల్యాణి, పెద్దపల్లి**

కలెక్టరేట్‌లో ఇద్దరం కలిసి క్యాంటీన్ ఏర్పాటు చేశాం. ఉద్యోగులు, కార్యాలయాలకు వచ్చే ప్రజలు భోజనం, టిఫిన్లు తింటున్నారు. రోజురోజుకూ గిరాకీ పెరుగుతోంది. ఇటీవల కేరళ బృందం క్యాంటీన్‌ను సందర్శించి వంటకాల తయారీ, ఇతర వివరాలు అడిగి తెలుసుకుని ప్రశంసించారు. మా ఇద్దరితోపాటు మరో ఆరుగురికి ఇక్కడ ఉపాధి దొరికింది.

**ఉమ్మడి జిల్లాలో ఇలా..**

జగిత్యాల : 5

పెద్దపల్లి : 4

సిరిసిల్ల 4

కరీంనగర్ 2

చురకలు



# పల్లె పోరు.. విందుల జోరు

జగిత్యాల : జిల్లాలోని ఓ మండల కేంద్రానికి చెందిన నాయకుడు సర్పంచిగా బరిలో ఉండటానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే ఆయనకు రిజర్వేషన్ అనుకూలించలేదు. ఎంపీటీసీగా తనకు, జడ్పీటీసీగా భార్యకు రిజర్వేషన్లు అనుకూలించడంతో బరిలో నిలిచేందుకు యత్నాలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో దావత్‌లు ప్రారంభించారు. కరీంనగర్ జిల్లాలోని ఓ గ్రామంలో సర్పంచి ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న ఆశావహుల సంఖ్య పెరిగింది. ఇన్నాళ్లూ కలిసున్న వారే తమ బలం నిరూపించుకునేందుకు, ఎన్నికల్లో గెలిచేందుకు విందుల వైపు మొగ్గు చూపుతున్నారు. ఒకట్రెండు రోజులుగా పలకరింపులు, దావత్‌లకు ఆహ్వానాలతో బిజీగా మారారు. కొసమెరుపేమిటంటే.. విందులకు హాజరవుతున్న వారు అందరి వద్దకు వెళ్తుండటంతో ఆశావహుల జేబులు మాత్రం ఖాళీ అవుతున్నాయి. అసలే దసరా సమయం. ఆపై ఎన్నికల సమరం. ఇంకేముంది పల్లెల్లో విందుల సందడి మొదలైంది. ఎంపీటీసీ స్థానాల్లో పార్టీల తరఫున పోటీ చేయాలనుకునేవారు, సర్పంచి పదవి కోసం పార్టీలతో సంబంధం లేకుండా బరిలో నిలిచేందుకు యత్నించేవారిలో కొందరు ఇప్పటికే ఓ దఫా తమ చేతిచమురు వదిలించుకున్నారు. రిజర్వేషన్లు అనుకూలించని నాయకులు ఆవేదనలో ఉండిపోగా అనుకూలించిన వారు అటు పార్టీల ప్రాపకం కోసం ఇటు ఓటర్ల దయ కోసం యత్నాలు మొదలుపెట్టారు. ప్రాదేశిక, పంచాయతీ సమరానికి నగారా మోగగా భాజపా ఎంపీ ఈటల రాజేందర్ భిన్నంగా వ్యాఖ్యలు చేయడం కొందరిని సందిగ్ధంలో పడేసింది. 'ఎన్నికలు జరుగుతాయో, జరగవో తెలియకున్నా కొన్ని చోట్ల దావత్‌లు పూర్తయ్యాయని వ్యాఖ్యానించారు. ఎన్నికల మూడ్ మొదలైందని.. 'ఏమీ లేదా అన్న' అంటూ దోస్తులు, కార్యకర్తలు అడుగుతుంటారని.. అనవసరమైన ఖర్చులకు ఆశావహులు



పోవద్దని ఈటల పేర్కొనడం గమనార్హం.

ఉమ్మడి జిల్లాలో 60 జడ్పీటీసీ, 646 ఎంపీటీసీ స్థానాలు, 1,226 గ్రామ పంచాయతీల్లో ప్రాదేశిక, పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. అక్టోబరు 9 నుంచి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల తొలివిడత నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండటం.. ఆ తర్వాత విడతల వారీగా ఎన్నికలు జరగనుండటంతో పల్లె వాతావరణం వేడెక్కింది. పోటీ చేయాలనుకునేవారు రిజర్వేషన్ అనుకూలించని వారిని, యువకులను తమవైపు తిప్పుకొనేందుకు పావులు కదుపుతున్నారు. గతంలో ప్రాదేశిక సమరానికి, పంచాయతీ పోరుకు మధ్య కొన్ని రోజుల విరామం ఉండేది. ప్రస్తుతం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాగానే పంచాయతీ ఎన్నికల హడావుడి మొదలు కానుండటంతో పోటీ చేయాలనుకునేవారు అనుచరులను, నాయకుల ను మచ్చిక చేసుకునే పరిస్థితి ఏర్పడింది. అక్కడక్కడా రిజర్వేషన్ల పుణ్యమాని టికెట్ పోరు లేకపోగా.. కొన్నిచోట్ల తీవ్ర పోటీ నెలకొంది. దీంతో మందు, విందులతో తమవంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

# నాణ్యత.. పారదర్శకత

జగిత్యాల : అంగన్‌వాడీ కేంద్రాలు, గురుకులాల్లో అందజేసే కోడిగుడ్లలో నాణ్యత, పారదర్శకత పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. టెండరు నిబంధనల్లో మార్పు చేసి ఏకీకృత విధానంలో సరఫరా చేయనుంది. మధ్యాహ్న భోజన పథకం మినహా అంగన్‌వాడీ, వసతిగృహాల విద్యార్థులకు తాజా గుడ్లు సరఫరా చేసేందుకు కొత్త టెండరు విధానాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది.

గురుకులాలు, వసతిగృహాల విద్యార్థులకు గుడ్లు పంపిణీ చేయడానికి జిల్లా స్థాయిలో శాఖల వారీగా టెండర్లు నిర్వహించేవారు. అంగన్‌వాడీ కేంద్రాలకు మొదట్లో జిల్లాల వారీగా, 2023 నుంచి రాష్ట్ర స్థాయి టెండరు ద్వారా జోన్ల వారీగా గుడ్లు సరఫరా చేస్తున్నారు. కాగా వేసవిలో 3 నెలలు మాత్రమే ప్రతి నెలా మూడు సార్లు, మిగతా సమయంలో నెలకు రెండు సార్లు గుత్తేదార్లు గుడ్లు సరఫరా చేయగా, జోన్ల వివరాలు సూచిస్తూ గుడ్లపై స్టాంపు వేసేవారు.

**నిర్దేశిత బరువు.. పది రోజులకో రంగు**

గుడ్ల సరఫరాలో పారదర్శకత పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా ఏర్పాటైన పర్యవేక్షక కమిటీ ఆధ్వర్యంలో టెండరు ఖరారు చేశారు. గుడ్డు బరువు, పరిశుభ్రత, సరఫరా తీరుపై కొత్త నిబంధనలు రూపొందించింది. ప్రతి జిల్లాలో గుడ్లు అందిస్తున్న అన్ని విభాగాలకు ఒకే టెండరు నిర్వహించేలా ఏకీకృత విధానం చేపట్టింది.

తాజా నిబంధనల ప్రకారం అగ్‌మార్కు కలిగి ఉన్న గుత్తేదారు టెండరు వేయడానికి అర్హులు. గుడ్డు బరువు 45-52 గ్రాములు, ఒక ట్రేలోని 30 గుడ్లు కలిపి మొత్తం బరువు 1,350 గ్రాములుండాలి.

కోడి గుడ్డు పెట్టిన 5 రోజుల్లోనే కేంద్రాలకు సరఫరా చేయాలి. ప్రతి నెలా కచ్చితంగా 3 విడతల్లో పది రోజులకు ఒకసారి నాణ్యమైన గుడ్లు సరఫరా చేయాలి. జిల్లా స్థాయిలో ఒకే గోదాం, అందులో జిల్లా అవసరాల్లో 40 శాతం గుడ్లు అందుబాటులో ఉండేలా చూడాలి. ఇక ప్రతి గుడ్డుపై 8 మి.మీ.ల వృత్తంతో జిల్లా వివరాలతో కూడిన ముద్ర ఉండాలి. వృత్తం పైభాగంలో 2 నుంచి 3 మి.మీ.ల మందంతో లబ్ధి పొందే శాఖ పేరు, మధ్యలో నెల, జిల్లా పేరు, కింది భాగంలో తెలంగాణ ప్రభుత్వం అని ఉండాలి. నెలలో మొదటి విడతలో సరఫరా చేసే గుడ్లపై నీలి రంగు స్టాంపు, రెండు, మూడు విడతల్లో సరఫరా చేసే గుడ్లపై ఎరుపు, ఆకుపచ్చ రంగుల్లో స్టాంపు వేయాలి.

**ఏటా రూ.12.76 కోట్ల చెల్లింపు**

జిల్లాలో మొత్తం 1,065 అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు, 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలకు రోజుకు ఒకటి, 6 నెలల నుంచి మూడేళ్ల చిన్నారులకు నెలకు 16 కలిపి మొత్తం 59,443 మందికి ఏడాదికి 1.59 కోట్ల గుడ్లు పంపిణీ చేస్తున్నారు. గురుకులాలు, వసతిగృహాలు కలిపి 94 ఉండగా వీటిలోని 19,810 మంది విద్యార్థులకు నెలకు 24 చొప్పున 48.57 లక్షల గుడ్లు అవసరం. మొత్తం 79,253 మంది లబ్ధిదారులకు నెలకు సుమారు 17,82,242 గుడ్ల అంచనాతో, ఏడాదికి 2,07,90,514 గుడ్లు సరఫరా చేయనున్నారు.

# తప్పుడు లెక్కలు.. తప్పవు చిక్కులు





ఆసిఫాబాద్: కొన్నిచోట్ల లేని సామాజిక వర్గాల వారికి స్థానిక సంస్థల రిజర్వేషన్లు కల్పించడం విమర్శలకు తావిస్తోంది. పోటీ చేయాలనుకునే ఆశావహులను నిరాశకు గురిచేస్తోంది. రిజర్వేషన్లు తప్పుగా ఖరారు చేశారని, పునఃపరిశీలించాలంటూ అధికారులకు వినతులు వస్తున్నాయి. సర్పంచి, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎస్సీ, ఎస్టీల 2011 జనాభా గణన, బీసీలకు గతేడాది జరిగిన బీసీ డెడికేటెడ్ కమిషన్ వివరాలను బట్టి రిజర్వేషన్లు ఖరారు చేశారు. ప్రస్తుతం అక్కడ ఆ సామాజిక వర్గం సభ్యులు లేకపోవడంతో ఎలా కేటాయించారనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. జిల్లాలో పలుచోట్ల సర్పంచి, వార్డు స్థానాల్లో ఇలాంటి పరిస్థితి ఉంది.

**ఎక్కడెక్కడ అంటే..** ఆసిఫాబాద్ మండలం చిలాటిగూడ పంచాయతీలో సర్పంచి స్థానం ఎస్సీ(జనరల్)కు కేటాయించారు. గణాంకాలను బట్టి ఎస్సీ జనాభా 93 ఉంది. వాస్తవానికి అక్కడ ఒక్క ఎస్సీ కుటుంబం కూడా లేదు. దీంతో అక్కడ పోటీ చేసే అభ్యర్థి లేక ఖాళీగా మిగలనుంది. ఇదే మండలం రహపల్లి ఏజెన్సీ పంచాయతీ కావడంతో సర్పంచి స్థానం ఎస్టీలకు కేటాయించారు. అక్కడా ఎస్టీలు లేరు. ఎనిమిది వార్డుల్లో నాలుగు ఎస్టీలకు కేటాయించారు. ఓటర్లు లేక వీటిలోనూ ఎన్నికలు జరిగే అవకాశం లేదు. చోర్‌పెల్లి ఏజెన్సీ పంచాయతీలో ఏడు ఎస్టీ కుటుంబాలు ఉన్నాయి. వారిలోనే ఒకరు సర్పంచి అయ్యే అవకాశం ఉంది. కాగజ్‌నగర్ మండలం చింతగూడ ఏజెన్సీ పంచాయతీలో సర్పంచి స్థానం ఎస్టీ(మహిళ)కు కేటాయించారు. ఇక్కడ ఆ సామాజిక వర్గానికి చెందిన తండ్రి, కొడుకు ఇద్దరే ఉన్నారు. మహిళలు లేరు. అదే మండలం భట్టుపెల్లి ఏజెన్సీ పంచాయతీలో అయిదారు ఎస్టీ కుటుంబాలు ఉండడంతో వారిలోనే ఒకరు సర్పంచి అయ్యే అవకాశం ఉంది. రేగులగూడ పంచాయతీలో సుమారు 400లకు పైగా ఎస్టీ ఓటర్లున్న వారికి కాకుండా సుమారు 14 వరకు ఓటర్లున్న బీసీలకు సర్పంచి స్థానం దక్కింది.

కౌటాల మండలం తాటినగర్ పంచాయతీలో ఆరు వార్డులకు గాను 1, 2 వార్డులు ఎస్టీలకు కేటాయించారు. కానీ అక్కడ ఆ సామాజిక వర్గం లేదు. బెజ్జూర్ మండలం సుశ్మీర్ పంచాయతీ సర్పంచి స్థానం బీసీ మహిళకు కేటాయించారు. కానీ అక్కడ ఉంది మొత్తం ఎస్టీలే. అదే మండలం తుమ్మలగూడ సర్పంచి స్థానం బీసీ జనరల్‌కు కేటాయించారు. అక్కడ ఉన్న వారంతా ఎస్సీ సామాజిక వర్గం వారే. వాంకిడి మండలం తేజాపూర్ ఏజెన్సీ పంచాయతీలో సర్పంచి స్థానంతోపాటు ఎనిమిది వార్డుల్లో నాలుగు ఎస్టీలకే కేటాయించారు. కానీ ఒక్క ఎస్టీ కుటుంబం లేకపోవడంతో.. ఎన్నికలు జరగవు.

# పురుగులు పట్టి.. ఎలుకలు కొట్టి



దహెగాం : రేషన్ దుకాణాల్లో దొడ్డు బియ్యం నిల్వలు వృథా అవుతున్నాయి. కొన్నిచోట్ల పురుగులు పట్టగా మరి కొన్నిచోట్ల ఎలుకల బారిన పడి వ్యర్థాలతో కలిసి అధ్వానంగా మారాయి. వీటి తరలింపుపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో.. వాటి సంరక్షణకు డీలర్లు, అధికారులు అవస్థలు పడుతున్నారు.

జిల్లాలో 314 రేషన్ దుకాణాలు ఉండగా 1,41,904 కార్డులు ఉన్నాయి. అందులో ఆహార భద్రత కార్డులు 1,28,696, అంత్యోదయ 13,188, అన్నపూర్ణ 20 కార్డులు అందుబాటులో ఉన్నాయి. వీరందరికీ మార్చి నెల వరకు దొడ్డు బియ్యం పంపిణీ చేశారు. తదనంతరం ఉగాది పండగ (ఏప్రిల్ మాసం) నుంచి లబ్ధిదారులకు సన్నబియ్యం ఇస్తున్నారు. దీంతో దొడ్డు బియ్యం నిల్వలు చౌకదరల దుకాణాల్లోనే మూలుగుతున్నాయి. పోషకాల కోసమని అందులో ఫోర్టిఫైడ్ రైస్ కలవడంతో ప్రస్తుతం అవి పొడిగా మారుతున్నాయి.

**అయిదు నెలలుగా నిల్వలు..**

జిల్లాలో 2,58,808 కిలోల బియ్యం అయిదు నెలల నుంచి పేరుకుపోతున్నాయి. ఆయా మండలాల్లో ఎక్కువగా చౌకధరల దుకాణాలు అద్దె గదుల్లోనే కొనసాగుతున్నాయి. చిన్న గదులు కావటంతో నిల్వల నిర్వహణ కష్టతరంగా మారింది. ప్రస్తుతం సన్నబియ్యంతోపాటు దొడ్డుబియ్యం నిల్వలు ఉండటంతో.. భద్రపర్చడానికి వారు పడుతున్న బాధలు వర్ణనాతీతం. దీనికి తోడు పురుగులు పట్టడం, ఎలుకల దాడి మరింత పెరిగింది. ఈ పురుగులు సన్నబియ్యంలోనూ కలిసి లబ్ధిదారులను ఇబ్బంది పెడుతున్నాయి. కొన్నిసార్లు పాతవి ఇస్తున్నావా.. అంటూ డీలర్లతో వాగ్వాదానికి సైతం దిగుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి దొడ్డు బియ్యం వెనక్కి తీసుకోవాలని డీలర్లు కోరుతున్నారు.

**వేలం వేస్తే ఆదాయం..**

ఇంకొన్ని రోజులు ఆగితే ఆ బియ్యం మరింత పాడై పనికి రాకుండా పోయే అవకాశం ఉందని డీలర్లు వాపోతున్నారు. దొడ్డు బియ్యానికి వేలం వేస్తే ప్రభుత్వానికి ఎంతో కొంత ఆదాయం వస్తుంది. హోటల్ నిర్వాహకులు, కోళ్లఫారాల నిర్వాహకులు కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు స్పందించి ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందుకెళ్తాం**

ఎండీ షాదిక్ హుస్సేన్, డీఎస్‌వో

జిల్లాలోని రేషన్ దుకాణాల్లో దొడ్డు బియ్యం నిల్వలు ఉన్న మాట వాస్తవమే. వీటికి రాష్ట్ర స్థాయిలో వేలంపాట నిర్వహించడానికి కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఆ బియ్యాన్ని జాగ్రత్తగా భద్రపర్చాలని డీలర్లు, అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. ప్రభుత్వం ఆదేశానుసారం నడుచుకుంటాం.

# తాగునీటి కష్టం.. స్పందన శూన్యం..

బెజ్జూరు: జిల్లా వ్యాప్తంగా పక్షం రోజులుగా భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. పల్లెల్లో తాగునీటికి కష్టాలు పడుతున్నారు. మిషన్ భగీరథ పథకంలో పనిచేసే సిబ్బందికి ఆరు నెలలుగా వేతనాలు రాకపోవడంతో.. సమ్మెబాట పట్టారు. దీంతో గ్రామాల్లో తాగునీటి సరఫరా నిలిచి పోయింది. గ్రామాల్లోని ప్రజలు ఖాళీ బిందెలతో రాస్తారోకోలు, నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. చేసేదేమిలేక చెలమలు, చేతిపంపులు, బావుల నీటిని తెచ్చుకుంటూ నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వేతనాలు రాక తామంతా రోజుల తరబడి నిరసన వ్యక్తం చేస్తున్నా.. తమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని భగీరథ సిబ్బంది వాపోతున్నారు.

జిల్లాలో మిషన్ భగీరథ పథకంలో సుమారు 600 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వారంతా గ్రామాలకు తాగునీరు సరఫరా చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. వేతనాలు నెలల తరబడి ఇవ్వకపోవడంతో సమ్మెకు దిగారు. పండగల వేళ పస్తులుండాల్సి వస్తోందని వాపోతున్నారు. .

**వ్యాధులపాలయ్యే ప్రమాదం..**

జిల్లావ్యాప్తంగా దాదాపు నెల రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. జలవనరులన్నీ నిండుగా మారాయి. అయితే సురక్షితమైన భగీరథ నీటి సరఫరా లేక ప్రజలు వాగులు, ఒర్రెలు, ఇతర వాటి నుంచి కలుషిత నీటిని తెచ్చుకుని తాగుతున్నారు. వ్యాధుల ముప్పు పొంచి ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్వో ప్లాంట్లు ఉన్నచోట కొందరు డబ్బులు చెల్లించి నీటిని కొనుగోలు చేస్తున్నా.. ఆర్థికంగా లేనివారు మాత్రం శివారు ప్రాంతాల్లోని జలవనరులను ఆశ్రయిస్తున్నారు.



**గ్రామాల్లో రాస్తారోకోలు..**

జిల్లా వ్యాప్తంగా తాగునీటి సమస్య ఉన్నా.. ప్రధానంగా సిర్పూర్ నియోజకవర్గంలోని గ్రామాల్లోని ప్రజలు ఖాళీ బిందెలతో రాస్తారోకోలు, నిరసనలు చేపడుతున్నారు. ఇటీవల చింతలమానేపల్లి, బెజ్జూరు మండలంలోని లుంబినీనగర్, తుమ్మలగూడ గ్రామాల మహిళలు నీటి కోసం రోడ్డుపై బైఠాయించారు. అధికారులు వచ్చి వారిని సముదాయించి నీటి ట్యాంకర్లను ఏర్పాటు చేసి చేతులు దులుపుకొంటున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బెజ్జూరు మండలంలో 15 రోజుల నుంచి తాగునీరు సరఫరా కావడం లేదు. ఆయా గ్రామాల ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పొలిమేరల్లోని మత్తడి వాగులో చెలమ తోడుకుని నీటిని డబ్బాలు, బిందెలతో తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

# రక్తమోడుతున్న పల్లె దారులు

పెద్దపల్లి : జిల్లాలో ప్రధానమైన రహదారులతోపాటు గ్రామీణ రోడ్లు ప్రమాదాలకు నిలయాలవుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే రాజీవ్ రహదారితోపాటు రాయపట్నం రోడ్డుపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి రక్షణ చర్యలు చేపడుతున్నారు. కానీ గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన రహదారుల విస్తరణ, అభివృద్ధి పనుల్లోని లోపాలను పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. రహదారి విస్తరణ సమయంలో జరిగే సాంకేతిక లోపాలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

**ప్రధాన ప్రాంతాల్లో ఇబ్బందులు ఇలా..**

గ్రామీణ రహదారుల విస్తరణ పనుల్లో మూలమలుపులు తొలగించకపోవడంతో తరచూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పెద్దపల్లి, సుల్తానాబాద్ కేంద్రాలుగా వివిధ మండల కేంద్రాలకు విస్తరించిన రహదారులు ఇబ్బందికరంగా ఉన్నాయి. సుల్తానాబాద్ నుంచి కాల్వశ్రీరాంపూర్ రోడ్డులో రైల్వే గేటు నుంచి కనుకుల చౌరస్తా వరకు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ



రోడ్డు ఎత్తుగా, మూలమలుపులు ఉండటం ప్రమాదాలకు కారణమవుతుంది. ఇక్కడ గతంలో ఓ పాఠశాల, కూలీల ఆటోలు బోల్తాపడ్డాయి. ఇదే పరిస్థితి గర్రెపల్లి నుంచి సుల్తాన్‌పూర్, కాట్నపల్లి-జూలపల్లి రహదారులపై నెలకొంది. శ్రీరాంపూర్ మండలం మల్యాల వద్ద ఎల్ ఆకారంలోని మలుపు వద్ద, పెద్దపల్లి నుంచి జూలపల్లి రోడ్డులో వెంకట్రావుపల్లి, వడ్కాపూర్‌ల వద్ద ఇదే పరిస్థితి ఉంది.

పెద్దపల్లి నుంచి శ్రీరాంపూర్ మీదుగా వరంగల్ వెళ్లే రహదారిపై పదికిపైగా ప్రమాదకరమైన మూలమలుపులున్నాయి. పెద్దపల్లి నుంచి గుంపుల రహదారి వరకు రహదారి విస్తరణ పనులు జరిగినప్పటికీ వీటిని తొలగించలేదు. పెద్దపల్లి నుంచి ధర్మారం రోడ్డులో బొంపల్లి గ్రామ సమీపంలో ఎల్ ఆకారంలోని మూలమలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతుండటం, ఒక లారీ ఏకంగా ఇంట్లోకి దూసుకెళ్లడంతో వేగనియంత్రికలు ఏర్పాటు చేశారు. ఇదే రోడ్డుపై బొంపల్లి కుంట వద్ద మరో మూలమలుపు ఉంది. పెద్దపల్లి నుంచి లోకపేట మీదుగా ముప్పిరితోట, దూళికట్ట వెళ్లే రహదారి, బసంత్‌నగర్ నుంచి అంతర్గాం వెళ్లే రహదారిపై ఇదే పరిస్థితి ఉంది.

కాచాపూర్ నుంచి కుమ్మరికుంట మీదుగా కటికనపల్లి వెళ్లే దారిలో అయిదు ప్రమాదకరమైన మూలమలుపులున్నాయి. వీటిలో మూడు కుమ్మరికుంట గ్రామంలోనే ఉన్నాయి.

# కొనుగోళ్లలో రాణింపు

సిరిసిల్ల: మహిళల ఆర్థికాభ్యున్నతే లక్ష్యంగా ఆసక్తి ఉన్న ఎస్‌హెచ్‌జీ (స్వయం సహాయక సంఘాలు)లను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. దీనిలో భాగంగా జిల్లాలో ఒక అడుగు ముందుకేసి ధాన్యం కొనుగోలు కేంద్రాల బాధ్యతలను సింహభాగం మహిళలకే అప్పగించింది. గత యాసంగి సీజన్‌లో 189 కేంద్రాలను విజయవంతంగా నిర్వహించి రూ.6 కోట్ల విలువైన ధాన్యం సేకరించారు. ఈ వానాకాలంలోనూ పెద్దఎత్తున వారికే ధాన్యం కొనుగోలు కేంద్రాలు అప్పగించేందుకు ప్రణాళికలు చేస్తున్నారు.

**లక్ష్యం ఇలా..** జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి సన్నాహాలు జరుగుతున్నాయి. వానాకాలం వరిసాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం ఈ సీజన్‌లో 4.56 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. కాగా అందులో రైతులు తిండి అవసరాలకు పోను పౌరసరఫరాలశాఖ 3.24 లక్షల మెట్రిక్ టన్నులు సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనిలో 9 వేల మెట్రిక్ టన్నుల సన్నధాన్యం. ఈ సారి ధాన్యం మద్దతు ధర క్వింటాలుకు ఏ-గ్రేడు రూ.2,389 కాగా కామన్‌రకం రూ.2,369లుగా నిర్ణయించారు. దసరా పండుగ తర్వాత నుంచి జిల్లాలో వరి కోతలు ప్రారంభం అవుతాయి. పౌరసరఫరాలశాఖ కేంద్రాల ప్రారంభానికి సన్నాహాలు చేస్తోంది.

జిల్లాలో 242 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ప్రణాళికలు చేశారు. వీటిలో 189 ఐకేపీ, మెప్మా 3, పీఏసీఎస్ 50 కేంద్రాలు ఉన్నాయి. కొనుగోళ్లు జరిగే రెండు నెలలు అధికారులు, రైతులను సమన్వయం చేసుకుంటూ ధాన్యం మిల్లులకు సకాలంలో చేరేలా శ్రమించనున్నారు. రైతుల డబ్బులు ఎప్పటికప్పుడు వారి ఖాతాలో జమ చేయిస్తున్నారు.

ప్రభుత్వం క్వింటాకు రూ.32 చొప్పున కమీషన్‌ను సంఘాలకు అందిస్తుంది. మహిళా సంఘాలకు 2023-24 సంవత్సరానికి ధాన్యం కొనుగోలులో కమీషన్ రూ.90.57 లక్షలు అంటే కొనుగోలు చేసినదానిలో 39.25 శాతం మాత్రమే ముట్టింది. ఇప్పటికీ మూడు సీజన్ల కమీషన్ రావాల్సి ఉంది.

జిల్లాలో అత్యధికంగా ముస్తాబాద్, చందుర్తి, మల్యాలలోని సంఘాలు 30 వేల నుంచి 33 వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. దీనిలో ఒక్కో సంఘానికి సగటున రూ.10 లక్షల మేరకు కమీషన్ వచ్చే అవకాశం ఉంది. ఖర్చులు పోనూ ఒక్కో సంఘానికి రూ.5 లక్షలపైనే మిగులుతుంది. రెండు నెలల వ్యవధిలో మహిళా సంఘాల కష్టానికి ప్రతిఫలం లభిస్తుంది. ప్రభుత్వం సకాలంలో కమీషన్ నిధులు విడుదల చేయాలని సభ్యులు కోరుతున్నారు.

# వర్ష ప్రభావం.. బొగ్గు ఉత్పత్తికి విఘాతం

గోదావరిఖని: అర్ధ వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సింగరేణి చేరుకోలేకపోయింది. వర్షాల ప్రభావంతో గత నెలలో 1.52 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి వెనుకంజలో ఉంది. మొత్తంగా ఆరు నెలల్లో 2.97 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి దూరంగా ఉంది. ఈ ఏడాది సింగరేణి సంస్థ 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఆరు నెలల్లో 30.71 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి ఉండగా.. 27.74 మిలియన్ టన్నుల ఉత్పత్తిని మాత్రమే సాధించింది.

**కేవలం ఆర్జీ-1లోనే వందశాతం**

సెప్టెంబరులో 5.07 మిలియన్ టన్నులకుగాను.. 3.55 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని వెలికి తీసింది. ఈ నెలలో కేవలం ఆర్జీ-1 మాత్రమే వందశాతం బొగ్గు ఉత్పత్తి చేయగలిగింది. మిగతా 10 డివిజన్లన్ను లక్ష్యాన్ని చేరుకోలేకపోయాయి. గతనెలలో కురిసిన భారీ వర్షాల కారణంగా ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తికి విఘాతం ఏర్పడింది. దీంతో ఈ నెలలో సాధించాల్సిన ఉత్పత్తిపై ప్రభావం పడింది. అదికాస్త అర్ధవార్షిక లక్ష్యానికి విఘాతం కలిగినట్లయింది. **రానున్న ఆరు నెలలు కీలకం** రానున్న ఆరు నెలల్లో 44.26 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి ఉంది. 72 మిలియన్ టన్నుల వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవాలంటే.. రానున్న ఆరు నెలల్లో నిర్దేశించిన లక్ష్యాలను అధిగమిస్తూ ముందుకు సాగాలి. గడిచిన ఆరు నెలల్లో కేవలం 27.74 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించిన సింగరేణి.. రానున్న ఆరు నెలల్లో వార్షిక లక్ష్యాన్ని చేరుకోవాలంటే నెలకు 7.4 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి ఉంటుంది. **ముందంజలో మూడు డివిజన్లు** ఇప్పటి వరకు ఆరు నెలల్లో కేవలం మూడు డివిజన్లు మాత్రమే వంద శాతం బొగ్గు ఉత్పత్తి సాధించాయి. కొత్తగూడెం, మణుగూరు, ఆర్జీ-2 డివిజన్లు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకున్నాయి. ఆరు నెలల్లో కొత్తగూడెం డివిజన్ 102 శాతం సాధించగా.. మణుగూరు వంద, ఆర్జీ-2 డివిజన్ 110 శాతం ఉత్పత్తి సాధించాయి.

# అధిక దిగుబడులతో ఆదర్శం

కోడుమూరు : ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఓ యువ రైతు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గం గూడూరు మండలంలోని పెంచికలపాడు గ్రామానికి చెందిన రైతు మహేశ్వరరెడ్డి ఉత్తమ రైతుగా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల మన్ననలు పొందుతున్నారు. తనదైన శైలిలో వ్యవసాయం చేస్తూ జిల్లాతో పాటుగా, నియోజకవర్గంలోని ఎంతో మంది రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఏరువాక ఫౌండేషన్ గుంటూరు వారు కిసాన్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా గత నెల 26, 27న జిల్లా తరఫున సేంద్రియ పద్ధతులతో ప్రకృతి వ్యవసాయం చేసే రైతుగా మహేశ్వరరెడ్డిని ఎంపిక చేశారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పత్తి పంటను చేసి అధిక దిగుబడి సాధించినందుకు ఉత్తమ రైతుగా అవార్డు అందజేశారు. ఉత్తమ రైతుగా అవార్డులు అందుకున్నారు.

**మూడు ఎకరాల్లో 30 రకాలు**

మహేశ్వరరెడ్డికి కర్నూలు–బళ్లారి ప్రధాన రహదారి ఆనుకొని 3 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇంటి వద్దనే ఆవుపేడ, గోమూత్రం, బెల్లం, పుట్టమన్ను, శనగపిండి, వేపనూనెతో సేంద్రియ ఎరువులు తయారు చేసుకుంటారు. ఎలాంటి రసాయనిక ఎరువులు వినియోగిం




చకుండా ఆరోగ్యకరమైన పంటలు పండిస్తున్నారు. పత్తి సాగు చేసి అందులో అంతర, రక్షణ పంటలను వేసి ఆదర్శంగా నిలుస్తున్నారు. మిర్చి, మెంతికూర, బెండ, టమాట, ఉల్లి, బీర, తోటకూర, పాలకూర, కొత్తిమీర వంటి కూరగాయలతో పాటుగా, రక్షణ పంటలుగా జొన్న, సజ్జ సాగు చేస్తున్నారు.

**సేంద్రియతో ఆరోగ్యకర పంటలు..**

సేంద్రియ పద్ధతులతో ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించాలనేది నా తపన. రైతులంతా ఈ పద్ధతులు ఉపయోగిస్తే భూమి ఆరోగ్యంతో పాటుగా చీడపీడల బెడద తక్కువగా ఉంటుంది. ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయానికి పలువురు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రభుత్వాలు రాయితీ ఇస్తున్నాయి. ఉత్పత్తులకు మార్కెటులో మంచి డిమాండు ఉంది. – మహేశ్వరరెడ్డి, రైతు

# దూదిరైతు దుఃఖం

ఎమ్మిగనూరు : ఉమ్మడి జిల్లాలో రెండు నెలలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు పత్తి రైతుకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. కాయలు కుళ్లి పోతున్నాయి. తేమ అధికమై మొక్కలు చనిపోతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 5.71 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఆగస్టు మొదటి వారం వరకు పూత, కాయలతో మొక్కలు కళకళలాడాయి. ఎకరానికి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు ఆశించారు. ఈ దశలో నేలలో తేమ ఆరకుండా వర్షాలు కురవడంతో పోషకాలను మొక్క వేరు వ్యవస్థ గ్రహించలేక ఆకులు, పూత, కాత రాలిపోయింది. కాయలు కుళ్లి నల్లగా మారాయి.

**అన్నదాతకు రూ.300 కోట్ల నష్టం**లక్ష ఎకరాల్లో పంట పూర్తిగా దెబ్బతింది. ఎకరానికి రూ.30వేల పెట్టుబడి పెట్టారు. ఈ లెక్కన రూ.300 కోట్ల మేర నష్టపోయారు. మిగతా పత్తి పంటలోనూ పెట్టుబడి చేతికి రావడం కష్టంగా మారింది. మే నెలలో నీటి వసతి కింద



వేసుకున్న రైతులకు ఎకరానికి ఆరేడు క్వింటాళ్ల దిగుబడి చేతికొచ్చింది. జూన్ రెండో వారం నాటిన పత్తి దిగుబడి అరకొరగా వచ్చినా రంగు మారింది. మార్కెట్‌కు తీసుకెళ్తే క్వింటా రూ.నాలుగైదు వేలకు అమ్ముడవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నాలుగు ఎకరాల్లో దెబ్బతింది**

నాలుగు ఎకరాలు సొంత పొలం, మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని ఎనిమిది ఎకరాల్లో పత్తి వేశా. రెండు నెలలుగా కురుస్తున్న వానలకు నాలుగు ఎకరాల్లో పత్తి పంట పూర్తిగా దెబ్బతింది. మిగిలిన పత్తి కూడా అంతంత మాత్రమే ఉంది. రూ.2 లక్షల పెట్టుబడి పెట్టా. ఈసారి పెట్టుబడి చేతికందని పరిస్థితి. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి.పి.పెద్దిరాజు, పొనకలదిన్నె

# జీఎస్టీ తగ్గినా ధరలు తగ్గలే!




ఒంగోలు : జీఎస్టీ 2.0 సంస్కరణల్లో భాగంగా పన్నుల వ్యవస్థను మరింత సులభ తరంగా, పారదర్శకంగా చేస్తూ గత నెల 22వ తేదీ నుంచి కేంద్ర ప్రభుత్వం సుమారు 375 వస్తువులపై జీఎస్టీని తగ్గిస్తూ వాటిని తక్షణమే అమలు చేయాలని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. దుకాణాల వద్ద తగ్గిన ధరల పట్టికలను ఏర్పాటు చేయాలని సూచించింది. నిత్యావసర సరకులపై జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తెచ్చినా క్షేత్రస్థాయిలో అమలు కావడంలేదు. కొనుగోలుదారులు ప్రశ్నిస్తే స్టాక్ అయిపోయే వరకు పాత ధరలే కొనసాగుతాయని, కొత్త స్టాక్ వచ్చాకే కొత్త ధరలు వర్తిస్తాయని దుకాణదారులు చెబుతుండడం గమనార్హం. దీంతో వినియోగదారులు చేసేదిలేక వ్యాపారులు చెప్పిన ధరలకే సరకులు కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో షాపింగ్‌మాల్స్, వెహికల్ షోరూంలు మినహాయిస్తే ఎక్కడా కూడా తగ్గిన ధరలతో బోర్డులు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. వ్యాపారు లు కొనుగోలుదారులకు పాత ధరలకే వస్తువులు, సరకులు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో జీఎస్టీ ఫలాలు సామాన్యులకు అందని పరిస్థితి నెలకొంది. **తగ్గిన ధరలకే విక్రయించాలి –సత్యప్రకాష్, డీసీ, వాణిజ్య పన్నులశాఖ** అన్ని దుకాణాల్లో తగ్గిన ధరలతోతప్పనిసరిగా బోర్డులను ఏర్పాటు చేయాలి.

# అభివృద్ధి.. శిలాఫలకాలకే పరిమితం



గుంతకల్లు : గత ప్రభుత్వాలు వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.కోట్లతో పనులు ప్రారంభించి మధ్యలోనే ఆపేశారు. ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదు. దీనికి తోడు నిర్మాణాల అంచనా వ్యయం రెట్టింపవుతోంది.దీంతో అప్పటి వరకు ఖర్చు చేసిన నిధులన్నీ వృథా అవుతున్నాయి. గుంతకల్లు, గుత్తి పట్టణాల్లో ఇలాంటి ఎన్నో కట్టడాలు ఎందుకూ పనికి రాకుండాపోతున్నాయి. ఈరెండు ప్రాంతాల్లో రూ.89.69 కోట్ల విలువ గల పనులు ఆగిపోయాయి.

**ముందుకు సాగని పనులు**

అభివృద్ధి పనులను చేయడానికి గతంలో తెదేపా, వైకాపా ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీ చేయండంతో అధికారులు టెండర్లను కూడా నిర్వహించారు. అప్పట్లో నాయకులు భూమి పూజలు, శంకుస్థాపనలు చేశారు. ఇప్పటికీ అతీగతీ లేదు.

గుంతకల్లులో క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పథకం కింద మురుగు కాలువలు, రోడ్లు తదితర 160 వరకు పనులను చేయడానికి టెండర్లు నిర్వహించారు. ఆతరువాత పెండింగ్‌లో ఉంచారు. షాపింగ్ గదుల నిర్మాణానికి రెండు సార్లు శంకుస్థానలు చేశారు.

గతంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్, మూడు గార్బేజ్ కలెక్షన్ కేంద్రాలు, ధర్మవరం రోడ్డు రైల్వేగేట్ వద్ద రోడ్డు అండర్ వంతెన నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి భూమి పూజలు చేశారు.

కసాపురంలో ప్రధాన మురుగు కాలువ పనులకు ఈయనే మొదలుపెట్టారు. హంద్రీనీవా కాలువకు రాగులపాడు వద్ద తూమును ఏర్పాటు చేసి కాలువను తవ్వి చెరువులకు నీటిని అందించడానికి చెందిన పనులకు కూడా శంకుస్థాపన చేశారు.

గుత్తిలో మున్సిపల్ కార్యాలయానికి సొంత భవాలను నిర్మించడానికి సంబంధించి అప్పటి ఎంపీ దివాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జంతేంద్రగౌడ్ శంకుస్థాపన చేశారు. కరడికొండ వద్ద టూరిజం కాంప్లెక్స్ ఏర్పాటుకు అప్పటి పార్లమెంట్ సభ్యుడు కాలవ శ్రీనివాసులు భూమిపూజ చేశారు. ఆయా పనులు ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు.

**ప్రభుత్వానికి నివేదించాం..** – నయీం అహమ్మద్, మున్సిపల్ కమిషనర్గతంలో గుంతకల్లులో భూమి పూజలు, శంకుస్థాపనలు జరిగిన పనులను ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నాం. షాపింగ్ గదుల నిర్మాణాన్ని గుడ్‌విల్ పద్ధతిలో చేయడానికి అనుమతుల కోసం ప్రభుత్వానికి నివేదించారు. మిగిలిన పథకాలకు నిధులను విడుదల చేయాలని ప్రభుత్వానికి నివేదిస్తున్నాం.

# అనాలోచిత నిర్మాణం.. ప్రమాదాలే నిత్యం!



ముదిగుబ్బ : జాతీయ రహదారులు, బైపాస్ నిర్మాణాలు జరిగితే ట్రాఫిక్ తగ్గడంతోపాటు గమ్యస్థానానికి వేగంగా చేరుకోవచ్చు. కానీ రహదారి విస్తరణ సమయంలో అనాలోచిత నిర్మాణాల ఫలితంగా వాహనదారులు నిత్యం అవస్థలు పడుతున్నారు. బత్తలపల్లి నుంచి ముదిగుబ్బ వరకు ఉన్న రెండు వరుసల రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించారు. తర్వాత ముదిగుబ్బ బైపాస్ నిర్మాణం పూర్తయింది. ఈ రెండింటిని కలిపే రోడ్డు జంక్షన్‌గా మారింది. కుడి, ఎడమవైపు వెళ్లేందుకు తికమకపడేలా జంక్షన్ నిర్మించడంతో వాహనదారులు ఇక్కట్లు అధికమవుతున్నాయి. ప్రధానంగా బైపాస్ నుంచి బత్తలపల్లి వైపు వెళ్లే వాహనదారులు జంక్షన్‌లో జాతీయ రహదారిలో వ్యతిరేక దిశగా వెళ్తున్నారు. ఎడమవైపునకు తిరిగేందుకు మలుపు లేకపోవడంతో కిలోమీటర్ మేర తప్పుదారిలో వెళ్లి ఎడమవైపు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో నిత్యం ఎక్కడో ఒకచోట రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

**ఒంపులుగా డివైడర్లు..**ముదిగుబ్బ నుంచి బత్తలపల్లి వరకు ఉన్న 42వ జాతీయ రహదారిలో సంకేపల్లిక్రాస్, కృష్ణాపురంక్రాస్, రామాపురం, కోడేకండ్ల, జ్వాలాపురం గ్రామాలకు వెళ్లే అప్రోచ్‌రోడ్డు వద్ద ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

బత్తలపల్లి నుంచి అనంతపురానికి వెళ్లే 42వ జాతీయ రహదారి, బైపాస్ కలిసే జంక్షన్‌లోనూ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు ఇరుకుగా ఉండటంతో బత్తలపల్లి బైపాస్‌లో మలుపు తిరిగే సమయంలో పెద్ద వాహనాలు డివైడర్‌ను ఢీకొంటున్నాయి. ఒకేసారి కనీసం రెండు వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొనడంతో బస్సులు, లారీలు వెళ్లే సమయంలో ఇతర వాహనాలు నిలుపుకోవాల్సి వస్తోంది. రోడ్డు వెడల్పు చేసి నిర్మించి ఉంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉండేది కాదని వాహనదారులు వాపోతున్నారు.

**నివారణ చర్యలు చేపడతాం..**– సుజిత, జేఈ, ఎన్‌హెచ్ 42

ముదిగుబ్బలోని బైపాస్ జంక్షన్‌లో వాహనదారులు ఇబ్బంది పడుతున్నట్లు నా దృష్టికి రావడంతో డివైడర్లను ఏర్పాటు చేశాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్మాణంలో మార్పుచేసేలా చూస్తాం. బత్తలపల్లి బైపాస్ జంక్షన్‌ను పరిశీలించి రోడ్డు వెడల్పునకు చర్యలు తీసుకుంటాం.

# ప్రకృతి.. వరిప్రదాయని



పుంగనూరు: రైతు రామనాథం స్వగ్రామం గట్టువారిపల్లె. మూడేళ్ల కిందట సాధారణ పద్ధతిలో వరి సాగుకు రూ.38 వేలు ఖర్చు చేస్తే రూ.20 వేలు మాత్రమే వచ్చింది. గతేడాది ప్రకృతి సేద్యం విధానంలో పండించగా రూ.5 వేలు పెట్టుబడి కాగా రూ.23 వేలు మిగిలింది. రైతులారా... రామనాథంలా అందరం చేద్దామా.

ఘన జీవామృతం: 500 కిలోలకు 500 కిలోల పేడ, 50 లీటర్ల గోమూత్రం, బెల్లం 10 కిలోలు, పుట్ట మట్టి రెండు కిలోలు, పప్పుల పిండి 10కిలోలు అవసరం. ఇవన్నీ అయిదు రోజులు మగ్గపెట్టాలి.

జీవామృతం: 200 లీటర్లకు గోమూత్రం 10 లీటర్లు, పప్పుల పిండి 10 కిలోలు, బెల్లం రెండు కిలోలు 5 రోజులు మురగబెట్టాలి.

వేప కషాయం: 40 లీటర్ల తయారీకి నాలుగు కిలోల వేపగింజలు రెండు కిలోల కుంకుడు కాయలు, 10 లీటర్ల గోమూత్రం కలిపి ఐదు రోజులు ఉంచాలి.

**ఎంత అవసరం**

ఎకరా వరిసాగుకు ఎరువుగా 400 కిలోల ఘన జీవామృతం, 40 లీటర్ల జీవామృతం, 40 లీటర్ల వేప కషాయం 400 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.మామిడి తోటకు 1500 కిలోల ఘన జీవామృతం, 80 లీటర్ల జీవామృతం, వేప కషాయం 40 లీటర్లు అవసరం.

ఈ ఏడాది ప్రకృతి సేద్యం లక్ష్యం : 65,283

ఎకరాలు రైతులు : 46,802

ఇప్పటి వరకు సాగు :34,633

అనురించిన రైతులు :35,201

# పైసలే వసూలు.. టిక్కెట్లు ఇవ్వరు

కుప్పం : ఆంధ్ర–తమిళనాడు సరిహద్దు ప్రాంతం కుప్పం మండలం నడుమూరు అటవీ ప్రాంతంలో జాతీయ రహదారి పక్కనే నగరవనాన్ని తీర్చిదిద్దారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.2 కోట్లతో అభివృద్ధి చేశారు. పిల్లలు ఆడుకునేందుకు ఆట పరికరాలను ఏర్పాటుచేశారు. ఈ పార్కును అధికారికంగా ప్రారంభించాల్సి ఉంది. అయితే ఉన్నతాధికారుల ఆదేశాలతో పిల్లలకు రూ.10, పెద్దలకు రూ.20 ప్రవేశ రుసుంగా నిర్ధారించి పర్యాటకులను అనుమతిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా, టిక్కెట్ల విక్రయాల్లో సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఇదే అదునుగా తాత్కాలిక సిబ్బంది చేతివాటాన్ని ప్రదర్శిస్తుండటం గమనార్హం. ఈ వ్యవహారంపై పరిశీలించింది. శాంతిపురం మండలం రాళ్లబూదుగూరుకు చెందిన సుమారు 10 మంది మహిళలకు సంబంధించిన రూ.20 టిక్కెట్లను పార్కు తాత్కాలిక సిబ్బంది వాపసు తీసుకొంటూ కనిపించారు. ఇదేమిటని ప్రశ్నిస్తే, టిక్కెట్లు అయిపోయాయని, వేరే వారికి ఇచ్చేందుకు తీసుకుంటున్నామని చెప్పుకొచ్చారు. కుప్పం పట్టణానికి చెందిన ఓ కుటుంబం పార్కుకు వచ్చారు. వారి నుంచి రూ.150 వసూలు చేసి, టిక్కెట్లు ఇవ్వలేదు. ఈ విషయమై స్థానిక అటవీ క్షేత్రాధికారి జయశంకర్‌ను వివరణ కోరగా.. 5 వేల టిక్కెట్లు అందుబాటులో ఉన్నాయని, గోల్‌మాల్ విషయమై విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో యంత్రం ద్వారా టిక్కెట్లు జారీ చేస్తామని చెప్పారు.

# అక్రమార్కులకు వంతపాట.. అన్నదాతలకు గుండెకోత!


కనిగిరి : గత వైకాపా ప్రభుత్వంలో అప్పటి పాలకులు, నాయకులు ఆడిందే ఆట పాడిందే పాటగా వ్యవహారం సాగింది. ఫలానా భూమి తమకు కావాలంటే చాలు నాటి అధికారులు వారికి అన్ని విధాలా సహకరించారు. అసైన్డ్, వాగుపోరంబోకు, పశువుల బీడు.. ఇలా కనిపించిన భూములన్నింటినీ ఆక్రమించేశారు. ఇదే కోవలో సీఎస్‌పురం మండలం రేగులచెలకలోనూ భూఆక్రమణలు చోటుచేసుకున్నాయి. ఇతర ప్రాంతాలకు చెందిన వైకాపా నేతల పేరిట రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములను అప్పటి రెవెన్యూశాఖాధికారులు ఆన్‌లైన్ చేసేశారు. ఇదేమిటని రైతులు అడిగిన పాపానికి రెవెన్యూ గ్రామంలోని భూములన్నింటినీ వివాదాస్పద భూముల కింద చేర్చేశారు. ఫలితంగా రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. రేగులచెలక రెవెన్యూ గ్రామ పరిధిలో రైతులకు సంబంధించి 951 సర్వే సంఖ్యలున్నాయి. వీటి పరిధిలో 3,532 ఎకరాల రైతుల పట్టా భూములున్నాయి. వీటి సమీపంలోనే ప్రభుత్వ, పశువుల బీడు భూములున్నాయి. ఇతర గ్రామాలకు చెందిన వైకాపా నాయకులు తమ పేరిట రెవెన్యూశాఖాధికారుల సాయంతో 2022లో 300 ఎకరాలను అక్రమంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు.



విషయం తెలుసుకున్న రైతులు 2023లో తమ గ్రామంలోని భూములను ఇతర ప్రాంతాలకు చెందిన వైకాపా నాయకులు ఆక్రమించారని కలెక్టర్‌తోపాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నారా లోకేశ్‌కు సైతం సమస్యను వివరించారు. చివరకు అప్పటి గవర్నర్‌కు సైతం పోస్ట్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ జరిపి భూఆక్రమణలు నిజమేనని తేల్చడంతోపాటు తహసీల్దారును సస్పెండ్ చేశారు. ఆక్రమిత ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకుని వాటిని మాత్రమే వివాదాస్పద జాబితాలో పెట్టాల్సి ఉండగా, రెవెన్యూ గ్రామంలోని భూములన్నింటినీ వివాదాస్పద భూములుగా చేర్చడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. 1బీలు రాక.. పథకాలకు దూరం.. రెవెన్యూశాఖాధికారులు చేసిన తప్పిదానికి గ్రామంలోని రైతుల భూములకు సంబంధించి 1బీ పత్రాలు రావడం లేదు. అన్నదాత సుఖీభవ, రాయితీ ఎరువులు, వ్యవసాయ పరికరాలు, పంట రుణాలు అందడం లేదు. ప్రభుత్వ పథకాలు రావాలంటే అడంగల్ కావాలని అధికారులు అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. కనిగిరిలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రాజాబాబుకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించి బాధిత రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# రామా.. ఆక్రమణలు కనుమా!

యర్రగొండపాలెం : యర్రగొండపాలెం మండలం అయ్యంబొట్లపల్లెలోని పురాతన శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయ భూములు ఆక్రమణకు గురయ్యాయి. వీటిని స్వాదీనం చేసుకుని ఆలయం పేరిట పట్టా దారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని గ్రామస్థులు, భక్తులు ఏడాదిగా విన్నవిస్తున్నా దేవాదాయశాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. రెవెన్యూ లెక్కల ప్రకారం స్వామివారికి 21 ఎకరాల భూములున్నాయి. గోళ్లవిడిపి రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే సంఖ్య 877లో పదెకరాలు, రామచంద్రాపురం రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే సంఖ్య 4–2లో 10.12 ఎకరాలు, సర్వే సంఖ్య 66–1లో 22 సెంట్ల భూమి ఉంది. రెవెన్యూ దస్త్రాల్లో స్వామి పేరిట ఆర్ఎస్ఆర్, ఎఫ్ఎల్ఆర్ నమోదై ఉన్నాయి. పురాతన ఆలయాల వివరాలు, వాటి ఆస్తులను సంరక్షించాల్సిన దేవాదాయశాఖ అధికారుల వద్ద మాత్రం వీటి వివరాల్లేకపోవడం గమనార్హం.ఆలయ భూముల్లో రామచంద్రాపురం తాలూకాలోని భూములు ఆక్రమణలకు గురయ్యాయి. పరిసర ప్రాంతాల్లోని కొందరు రైతులు భూములను ఆన్‌లైన్ సైతం చేయించుకున్నారు. భూముల వివరాలను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఏడాది కిందట దేవాదాయశాఖ అధికారులకు అందించారు. ఆక్రమణలు తొలగించి ఆలయం పేరిట వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయించాలని ఫిర్యాదు చేశారు.



ఆలయాన్ని దేవాదాయశాఖ పరిధిలో చేర్చి భూముల వేలం నిర్వహించి ఆదాయాన్ని ఆలయ నిర్వహణకు వినియోగించాలని విన్నవించారు. గతేడాది మార్కాపురం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వచ్చి పరిశీలించి వెళ్లారు. ఆలయ భూముల అన్యాక్రాంతంపై ఫిర్యాదు చేసి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# చెల్లింపులు కొరవడి.. ఆయుష్మాన్ తడబడి

కంభం : గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో జిల్లాలో చేపట్టిన హెల్త్‌క్లినిక్‌ల నిర్మాణాలు ఏళ్లు గడుస్తున్నా పూర్తి కావడంలేదు. గుత్తేదారులకు సకాలంలో బిల్లులు చెల్లించక పోవడంతో వారు మధ్యలోనే వదిలేస్తున్నారు. దీంతో వాటిల్లో పనిచేసే సిబ్బంది, సేవలకు వచ్చే పల్లె వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా..

జాతీయ ఆరోగ్య విధానంలో భాగంగా కేంద్రం ఐదేళ్ల కిందట 'ఆయుష్మాన్ భారత్' పథకాన్ని తీసుకువచ్చింది. ఇందులో భాగంగా జిల్లాలో విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. వైకాపా పాలనలో నిర్మాణ పనులు సక్రమంగా చేయలేదు. కూటమి ప్రభుత్వం నిర్మాణాలను పూర్తి చేస్తే ప్రజలకు ఎంతో మేలు జరిగే అవకాశం ఉంది.

ప్రస్తుతం ఇదీ పరిస్థితి జిల్లాలో మంజూరైన హెల్త్ క్లినిక్‌లు : 492

నిర్మాణాలు ప్రారంభించినవి : 418

బేస్‌మెంట్, ఆపైన స్థాయి వరకూ నిర్మించినవి : 367

బేస్‌మెంట్ దిగువన ఉన్నవి : 125

ప్రారంభానికి నోచుకోనివి : 74

ఒక్కో నిర్మాణానికి సగటు అంచనా : రూ.20.08 లక్షలు

మొత్తం అంచనా వ్యయం : రూ.99 కోట్లు

మొత్తం 14 రకాల వైద్య సేవలు, గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ

గ్రామీణ ప్రాంతాల్లోని సచివాలయం కేంద్రంగా 14 రకాల వైద్య సేవలందిస్తున్నారు. వాటిలో జనరల్ ఓపీ, ఈఎన్‌టీ, మధుమేహం, బీపీ, హెచ్ఐవీ, హెచ్‌బీ, ప్రాథమిక చికిత్స తదితర సేవలున్నాయి. అంతేకాదు గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. ఇక్కడ బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన ఎంఎల్‌హెచ్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్త అందుబాటులో ఉంటారు. ఈ నేపథ్యంలో అసంపూర్తి గ్రామీణ వైద్యశాల నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసే అవకాశం ఉందని పంచాయతీ రాజ్ ఎస్ఈ అశోక్ తెలిపారు.

## ఎగరేద్దాం.. ఎదిగేద్దాం

తిరుపతి : తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీకి ప్రతిష్ఠాత్మకమైన డ్రోన్ టెక్నాలజీ శిక్షణ కేంద్రం మంజూరైంది. దీంతో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. తొలుత ఎస్వీయూలో 10వ తరగతి పాసైనవారికి పది రోజులపాటు శిక్షణ ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందుకు వర్సిటీలో రెండెకరాల పది సెంట్లు భూమిని, ఓ భవనాన్ని కేటాయించారు. గత నెల 12న డీజీసీఏ, పీఆర్టీవో బృంద సభ్యులు వచ్చి సాధ్యాసాధ్యాలను పరిశీలించి.. ఆమోదం తెలిపారు.
త్వరలో డిప్లమో కోర్సు: ప్రస్తుతానికి ఆసక్తి ఉన్న విద్యార్థులకు, బయటి వారికి తాత్కాలికంగా శిక్షణ ఇస్తున్నారు. రానున్న రోజుల్లో డిప్లమో



కోర్సును ప్రవేశపెట్టేందుకు వర్సిటీ ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. మూడు నెలలపాటు శిక్షణ ఇచ్చి, విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.
రాష్ట్రంలో రెండోది: విజయవాడలో డ్రోన్‌పై అధికారిక శిక్షణ కేంద్రం ఉంది. దాని తరువాత తిరుపతిలోనే ఏర్పాటు చేస్తున్నారు. దీనికి డీజీసీఏ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) అనుమతులొచ్చాయి. పీఆర్టీవో (రిమోట్ పైలెట్ ట్రెయినింగ్ ఆర్గనైజేషన్)తో కలిసి ఎస్వీయూ శిక్షణ ఇస్తుంది. అనంతరం సర్టిఫికెట్‌తోపాటు ఒక గుర్తింపు నంబర్ ఇస్తారు. అప్పుడు డ్రోన్ ద్వారా చిత్రీకరించే అంశాలకకు అధికారక ముద్ర ఉంటుంది. ఇందుకు ఐదు సంస్థలు ముందుకొచ్చాయని వీసీ ఆచార్య అప్పారావుకు తెలిపారు.

## ధన దాహం.. వన హననం

రాజమహేంద్రవరం : చెట్లకు డబ్బులు కాస్తాయా అంటే.. అన్ని చెట్లూ ఏమో కానీ 50 ఏళ్లకు పైబడిన మర్రి, రావి వృక్షాలకు మాత్రం డబ్బులు కాస్తున్నాయనే చెప్పాలి. ఏళ్లనాటి చెట్లు వ్యాపార వస్తువులుగా మారిపోయాయి. జాతీయ, ర.భ.శాఖ రహదారులు పక్కన ఉన్నవి, మైదానాల్లో, గ్రామ కూడళ్లు, నిర్మానుష్య ప్రాంతాల్లోని చెట్లను నరికి, వాటిని వేరే ప్రాంతాలకు తరలించి రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. రాష్ట్ర అటవీశాఖ కార్యాలయానికి ఫిర్యాదులు వెళ్లడంతో జిల్లా అటవీ శాఖ అధికారులు రంగంలోకి దిగారు.

**బృందాలుగా..**
ఓ బృందం గ్రామాలు, పట్టణాల్లో పర్యటిస్తారు. ఎక్కడెక్కడ ఏళ్లనాటి చెట్లు ఉన్నాయో గుర్తించి సదరు వ్యాపారులకు సమాచారం ఇస్తారు. అందుకోసం వారికి కొంత మొత్తం ఇస్తారు. వేరే బృందం ఆ వృక్షాల యజమానులు లేదా సంబంధిత వ్యక్తులకు కొంత డబ్బు ఇచ్చి కొంటుంది. ఆపై కొమ్మలు నరికి కాండాలను రాజమహేంద్రవరం సమీపంలోని ఓ ప్రాంతానికి తరలిస్తారు. అక్కడ వాటికి రసాయనాలు పూసి తిరిగి చిగురింపజేస్తారు. ఆ తర్వాత రూ.లక్షలకు విక్రయిస్తారు. ఈ మొత్తం ఆయా వ్యాపారుల కనుసన్నల్లోనే జరుగుతుంది.

**నయా దందా..**
గొల్లప్రోలు మండలం చెందుర్తి నుంచి ఓ మర్రిచెట్టును తూర్పుగోదావరి జిల్లాలోని ఓ గ్రామానికి తరలిస్తున్నట్లు అధికారులకు సమాచారం రావడంతో తనిఖీ చేసి, రాజానగరం వద్ద పట్టుకున్నారు. విచారణలో విస్తుపోయే విషయాలు తెలిశాయి. ఆపై చెట్టును రాజమహేంద్రవరం రోటరీ క్లబ్ వారితో సంప్రదించి, మహా పుష్కరవనానికి తరలించారు.
**పదిరెట్ల లాభానికి** వృక్షాలను గుర్తించడం, తరలించడం, తిరిగి వాటిని పునరుజ్జీవింపజేసేందుకు రూ.70వేల నుంచి రూ.80వేల వరకు అవుతుంది. ఆ తర్వాత వాటిని వయసును బట్టి రూ.7లక్షల నుంచి రూ.8లక్షల వరకు విక్రయిస్తారు. రాజమహేంద్రవరం సమీపంలోని ఓ ప్రాంతంలో ఇలాంటివి 70 నుంచి 80 చెట్లు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన రూ.కోట్లలో ఆదాయం పొందుతున్నారు.

**గుజరాత్‌లో డిమాండ్..**
తెలుగు రాష్ట్రాల్లో బోన్సాయ్ మొక్కలకు మంచి డిమాండ్ ఉంది. రకాన్ని బట్టి రూ.వేలు, రూ.లక్షలు పెట్టి కొంటారు. గుజరాత్‌లో పాత వృక్షాలకు మంచి గిరాకీ ఉంది. ఆలయాలు, పర్యాటక ప్రాంతాలు, కార్యాలయాల వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది.

**జిల్లాలో తనిఖీలు పెంచుతాం..**
పాత చెట్లను నరికేందుకు ప్రభుత్వ నిబంధనలు అంగీకరించవు. వీటిని తరలిస్తే చట్ట ప్రకారం శిక్ష తప్పదు. ప్రజా ప్రయోజనాల కోసం చేయాల్సిన పనులకు అనుమతులు తీసుకోవాలి. దీనిపై ఫిర్యాదులు వచ్చాయి. స్వాధీనం చేసుకున్నవి రోటరీ క్లబ్ వంటి స్వచ్ఛంద సంస్థలకు అప్పగిస్తున్నాం. తనిఖీలు పెంచుతాం. ప్రభాకరరావు, డీఎఫ్‌వో

## రహదారులకు పుష్కర శోభ

రాజమహేంద్రవరం : రానున్న పుష్కరాల నేపథ్యంలో ఆతిథ్య నగరం రాజమహేంద్రవరంలో రహదారులకు మహర్దశ పట్టనుంది. నగరంలో ప్రవేశించే, ఇతర ప్రాంతాల నుంచి రాజమహేంద్రవరం వచ్చే వాహనాలను అంచనా వేస్తూ రహదారుల విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో సిటీ ప్లానర్ నేతృత్వంలో అసిస్టెంటు సిటీ ప్లానర్లను కలిపి 17 మందితో బృందాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వం అదనంగా నలుగురు సర్వేయర్లను నియమించింది. వీరంతా గోదావరి ఘాట్‌లు, ఆనుకొని ఉన్న రహదారులపై అంచనాలు రూపొందించారు.

**ఇలా గుర్తించారు..**
ఇప్పటికే ప్రత్యేక బృందం అధ్యయనం చేసి అర్బన్ పరిధిలో ఘాట్‌లను ఆనుకొని 30 కి.మీ మేర 25 రహదారులను 60 నుంచి 80 అడుగుల వెడల్పున విస్తరించాల్సి ఉందని అంచనాకు వచ్చింది. పుష్కర స్నానాల కోసం 17 ఘాట్‌లను సిద్ధం చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం ధవళేశ్వరం నుంచి కాతేరు వరకు వీటిని సిద్ధం చేస్తున్నారు. గత పుష్కరాలకు సుమారు 3 కోట్ల మంది భక్తులు రాగా, ఈ సారి 8 కోట్ల మంది వరకు రావచ్చని అంచనా వేస్తున్నారు. రోడ్డు మార్గం ద్వారానే ఎక్కువగా రావడానికి ఆస్కారం ఉంది. దీంతో నగరం చుట్టుపక్కల 10 కి.మీ మేర కూడా ఈ రోడ్లన్నీ రద్దీకి అనుగుణంగా అభివృద్ధి చేస్తారు.

**కన్సల్టెన్సీకి బాధ్యతలు..**
రోడ్ల విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయడంతోపాటు, పుష్కరాల రద్దీ నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా అంచనాలు వేస్తున్నారు. వాహనాలను నగరంలో అనుమతించే క్రమంలో వారంతా ఘాట్‌ల వద్దకు చేరుకొనేందుకు చేపట్టాల్సిన పనులపై ప్రైవేటు కన్సల్టెన్సీకి బాధ్యతలు అప్పగించారు. రోడ్లు మార్గాలను అనుసంధానం చేయడం, నేరుగా ఘాట్‌ల వరకు వెళ్లే విధంగా ప్రణాళికలు రూపొందించడం వీరి బాధ్యత. దీనిపై మూడు బృందాలు పని చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# ముంచేందుకు సిద్ధమయ్యారు!



అనంతపురం: అమాయకులైన పేదలను మళ్లీ ముంచేందుకు కొందరు అక్రమార్కులు సిద్ధమయ్యారు. అనంత శివారులోని పండమేరు వంక పోరంబోకు స్థలాలను అమాంతం మింగేందుకు ప్రయత్నిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఉపాధి కోసం నగరానికి వలస వచ్చిన పేదలను లక్ష్యంగా చేసుకుని దందా కొనసాగిస్తున్నారు. గతేడాది వరదల సమయంలో పూర్తిగా మునిగిపోయిన స్థలాల్లో మళ్లీ గుడిసెలు ఏర్పాటు చేశారు. కొద్దికొద్దిగా స్థలాన్ని ఆక్రమించి.. విక్రయించడానికి ఎత్తుగడలు వేస్తున్నారు. జాతీయ రహదారికి ఆనుకునే ఇదంతా జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఆర్డీటీ స్టేడియం ముందు నుంచి ఉప్పరపల్లి వరకు వంక ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకోవడం లేదు.

**నకిలీ పట్టాలతో బురిడీ**
ఉప్పరపల్లికి చెందిన కొందరు వందల సంఖ్యలో నకిలీ పట్టాలు సృష్టించారు. స్టాంపులు, అధికారుల సంతకాలు ఫోర్జరీ చేస్తున్నారు. ఒక్కో పట్టాను రూ.5 వేల నుంచి రూ.10 వేలకు విక్రయిస్తున్నారు. ఇటీవలే అనంతపురం గ్రామీణ పోలీసులు నకిలీ పట్టాలు సృష్టించిన కొందరిని అరెస్టు చేశారు. వంకకు రెండువైపులా ఉన్న ఖాళీ స్థలాలకు సర్వే నంబర్లు వేసి నకిలీ పట్టాలు అంటగడుతున్నారు. ఈ అంశంపై అనంత జిల్లా కలెక్టర్ ఆనంద్‌ను వివరణ కోరగా క్షేత్రస్థాయిలో విచారించి ఆక్రమణలు ఉంటే తొలగిస్తామని పేర్కొన్నారు.

**గత అనుభవం పట్టదా?**
వైకాపా హయాంలోనూ కొందరు స్థానిక నాయకులు పండమేరు పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి పేదలతో గుడిసెలు ఏర్పాటు చేయించారు. ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని నమ్మించి రూ.లక్షల్లో దండుకున్నారు. గతేడాది నవంబరులో ఆకస్మిక వరదలు పండమేరును ముంచెత్తడంతో వందలాది మంది నిరాశ్రయులయ్యారు. వంకకు అవతలివైపు ఉన్న జగనన్న కాలనీలో నిర్మించిన ఇళ్లు మునిగిపోయాయి.
ఇప్పుడు సదరు స్థానిక నాయకులు దందా మొదలుపెట్టారు. ముంపు ప్రాంతంలోనే మళ్లీ గుడిసెలు ఏర్పాటు చేయించి స్థలాలు ఇస్తామంటూ బేరాలు మొదలుపెట్టారు.

# పర్యవేక్షణలో నిర్లక్ష్యం.. పిల్లల్లో పోషణ లోపం




అనంతపురం: ఐదేళ్లలోపు పిల్లల్లో పౌష్టికాహార లోపం ఉందంటూ.. వెనుకబడిన ప్రాజెక్టుల సీడీపీఓలతో ఈ ఏడాది జనవరిలో రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్ స్వయంగా సమీక్షించారు. ఆరు మాసాల్లో పురోగతి రెట్టింపు స్థాయిలో ఉండాలని నిర్దేశించారు. తగ్గకపోగా.. రెట్టింపు స్థాయిలో పోషణ లోపం పెరిగింది. పోషణ లోపం 2 శాతం కంటే ఎక్కువ కలిగిన ప్రాజెక్టులు రాష్ట్రంలో 27 ఉండగా.. ఉమ్మడి జిల్లాలో ఆరు ఉన్నాయి. అనంత జిల్లాలో కళ్యాణదుర్గం, ఉరవకొండ, గుత్తి, కణేకల్లు, శింగనమల, శ్రీసత్యసాయి జిల్లాలో మడకశిర ఉన్నాయి. ఆరు మాసాల క్రితం జరిగిన సమీక్షలో ఇవే ప్రాజెక్టులు ఉండటం గమనార్హం.
ఉమ్మడి అనంత జిల్లాలో వయసుకు తగ్గ ఎత్తు, బరువు లేని (పోషణ లోపం) పిల్లల శాతం పెరుగుతోంది. ఐసీడీఎస్ అధికారుల నిర్లక్ష్యం చిన్నారుల పాలిట శాపంలా మారింది. లబ్ధిదారుల కోసం ఏటా రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చిస్తున్నా క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ లోపిస్తోంది. దీంతో బాధితుల సంఖ్య పెరుగుతోంది. జిల్లాలో చాలా మంది సీడీపీఓ, పర్యవేక్షకులు కేంద్రాల పరిశీలనను చేపట్టడం లేదు. వయసుకు తగ్గ బరువు, ఎత్తు పెరగని పిల్లలు కనీసం 2 శాతానికి మించడానికి వీలులేదు. ఇంతకంటే ఎక్కువ శాతం కలిగిన ప్రాజెక్టులు ఉమ్మడి జిల్లాలో ఉండటం గమనార్హం.

**జిల్లా సగటు కంటే ఎక్కువ**
అనంత జిల్లాలో 11 ప్రాజెక్టుల సగటు శాతం 19 ఉంది. శ్రీసత్యసాయి జిల్లాలో 18 శాతం నమోదైంది. ప్రాజెక్టుల స్థాయిలో మాత్రం జిల్లా సగటు కంటే రెట్టింపు స్థాయిలో నమోదు అవుతున్నాయి. ప్రతి నెలా రెండేళ్లలోపు పిల్లలకు సంబంధించి బరువు, ఎత్తు కొలతలు నమోదు చేయాలి. 2-5ఏళ్ల చిన్నారులకు ప్రతి మూడు మాసాలకోసారి ఎత్తు కొలుస్తారు. దయనీయం ఏమంటే.. ఆగస్టులో 73 శాతం పిల్లల బరువు, ఎత్తు కొలతలు తీసినట్లు నమోదైంది. దీన్నిబట్టీ ఎంత నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారో తేటతెల్లమవుతోంది.

**కళ్యాణదుర్గం.. అత్యంత అధ్వానం**
ఆరు అధ్వాన ప్రాజెక్టులకుగాను కళ్యాణదుర్గం పరిధిలో పోషణ లోపం మరీ దారుణంగా ఉంది. రాష్ట్రంలో 27 ప్రాజెక్టుల్లో కళ్యాణదుర్గం రెండో స్థానంలో ఉండటం గమనార్హం. ఈ ఏడాది మార్చిలో 9.35 శాతం మందిలో పోషణ లోపం ఉంటే.. ఆగస్టు నాటికి ఏకంగా 17.51 శాతానికి పెరిగింది.
ఉరవకొండ ప్రాజెక్టులో 24.16 శాతం పిల్లలు ఎత్తుకు తగ్గ బరువు లేరు. ఆరు మాసాల్లో ఈ ప్రాజెక్టులో 7.48 శాతం.. శింగనమలలో 7.92 శాతం పెరగడం విశేషం.
గుత్తి ప్రాజెక్టు పరిధిలో 13.97 నుంచి ఏకంగా 20.30 శాతం.. కణేకల్లు ప్రాజెక్టులో 8.8 శాతం నుంచి 14.30 శాతానికి పోషణ లోపం పిల్లల్లో పెరిగింది.
శ్రీసత్యసాయి జిల్లా మడకశిర ప్రాజెక్టులో 15.69 శాతం నుంచి 20.01 శాతానికి చేరుకోవడం గమనార్హం.

# మల్బరీ రైతులకు మరింత ఊతం



అనంతపురం : వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన పట్టు పరిశ్రమకు కూటమి ప్రభుత్వం జవసత్వాలు అందిస్తోంది. అప్పట్లో ఒక్క ఎకరానికి రాయితీ ప్రకటించలేదు. రైతుల్లో నిరాశ ఏర్పడి మల్బరీ సాగు తగ్గిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక 2025-26 సంవత్సరానికి మల్బరీసాగు లక్ష్యంతోపాటు పట్టు పురుగులు, పట్టుగూళ్ల ఉత్పత్తి లక్ష్యాలను నిర్దేశించింది. తాజాగా పలు పథకాలకు రాయితీలు ప్రకటించడంతో రైతుల్లో ఆనందం కనిపిస్తోంది.
జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో 650 ఎకరాల్లో కొత్తగా మల్బరీ సాగుకు లక్ష్యంగా నిర్దేశించారు. 13.25 లక్షల పట్టుపురుగులు (బైవోల్టింగ్ బ్రషింగ్) పెంపకంతోపాటు 994 మెట్రిక్ టన్నుల పట్టుగూళ్ల ఉత్పత్తి చేయాలని నిర్ణయించారు. జిల్లాలో 650 ఎకరాలకు మల్బరీ సాగు ఎకరాకు లక్ష్యంగా పట్టుకున్నారు. యూనిట్ (ఎకరా) ధర రూ.30 వేలు కాగా అందులో ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.27 వేలు, ఇతర రైతులకు రూ.22,500 చొప్పున రాయితీలు ఇస్తారు.
పట్టుపురుగుల పెంపకం కోసం జిల్లాకు షెడ్లు-1 50, షెడ్డు-2 50 చొప్పున షెడ్లు మంజూరయ్యాయి. షెడ్డు-1 నిర్మాణానికి యూనిట్ ధర రూ.4.50 లక్షలు కాగా ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.4.05 లక్షలు, ఇతర రైతులకు రూ.3,37,500 చొప్పున రాయితీలు ఇస్తారు. షెడ్డు-2 నిర్మాణానికి ఒక్కో షెడ్డు రూ.3.25 లక్షలు కాగా అందులో ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.2,92,500, ఇతర రైతులకు రూ.2,43,750 రాయితీ అందుతుంది.
పట్టుపురుగులు పెంపకానికి స్టాండ్లు 50 మంజూరయ్యాయి. ఒక్కోస్టాండ్ రూ.45,500 కాగా అందులో ఎస్సీ, ఎస్టీ రైతులకు 40,950, ఇతర రైతులకు 34,125 చొప్పున రాయితీలు ఇస్తారు.
మల్బరీ సాగు చేసే రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలు 35 యూనిట్లు మంజూరు చేశారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 5 చొప్పున ఇతర రైతులకు 25 యూనిట్లు మంజూరు చేశారు. వీటి యూనిట్ ధర రూ.లక్ష కాగా అందులో ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.90 వేలు, ఇతర రైతులకు రూ.50 వేలు చొప్పున రాయితీ అందుతుంది.
**సద్వినియోగం చేసుకోండి**- విజయ్‌కుమార్, జిల్లా పట్టు పరిశ్రమశాఖ అధికారి (అనంతపురం) మల్బరీ సాగు చేస్తున్న రైతులకు రాయితీలన్నీ వర్తిస్తాయి. అదనపు సమాచారం కోసం రైతు సేవాకేంద్రాల్లో గ్రామ పట్టు పరిశ్రమశాఖ సహాయ సహాయకులు అందుబాటులో ఉంటారు. రాయితీలకు పథకాల కోసం ఆర్ఎస్‌కేల్లో ధరఖాస్తు చేసుకోవచ్చు.

## చెత్తలో మన్ను దొంగలు

నంద్యాల : గత వైకాపా ప్రభుత్వం వదిలేసిన చెత్త గుట్టలు 'ఖాళీ' చేయాలని 'కూటమి' ప్రభుత్వం నిర్ణయించింది. వందల టన్నుల మేర పోగైన చెత్తను శుద్ధి చేసే పనులు ప్రజారోగ్య విభాగానికి అప్పగించారు. అక్టోబరు 2వ తేదీ నాటికి కంపోస్టు యార్డులన్నీ ఖాళీ మైదానాలుగా మార్చి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. చెత్త గుట్టలు ఖాళీ చేయకపోగా అక్కడ లభించే మట్టిని విక్రయించి రూ.లక్షలు వెనకేసుకొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రెండు రోజుల కిందట నంద్యాల పురపాలిక కౌన్సిల్ సమావేశంలో ఇదే అంశంపై వాడీవేడి చర్చ జరిగింది.

**రూ.17.23 కోట్లకు ఒప్పందం**
ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థతోపాటు తొమ్మిది పురపాలిక సంఘాలున్నాయి. నిత్యం సుమారు 500-600 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతుంది. ఎన్జీటీ బృందాలు కంపోస్టు యార్డులను తనిఖీ చేసి వేల టన్నులు పోగైన చెత్తను చూసి చీవాట్లు పెడితే తప్ప గత ప్రభుత్వంలో కదలిక రాలేదు.
చెత్త తరలింపు దృష్టి సారించిన 'కూటమి' ప్రభుత్వం మహారాష్ట్రకు చెందిన ఓ కంపెనీకి బాధ్యత అప్పగించారు. సదరు కంపెనీ రూ.17.23 కోట్ల( (మెట్రిక్ టన్ను చెత్త శుద్ధికి రూ.840) ఒప్పందం



కుదుర్చుకొంది.

**మట్టిని అమ్మేశారు**
చెత్తను బయో మైనింగ్ చేసిన తర్వాత వచ్చే మట్టిని పొలాలకు ఎరువుగా, మండే స్వభావం ఉన్న చెత్తను పరిశ్రమలకు, శుద్ధి కాని వాటిని గుంతలు తీసి పూడ్చాలి.
నంద్యాల కంపోస్టు యార్డులో 25 వేల టన్నుల మట్టి వచ్చింది. దీన్ని రైతులు, వైఎస్సార్‌నగర్‌లో ఒక ఆలయ ప్రాంగణానికి తరలించినట్లు అధికారులు చెబుతున్నారు. వాస్తవంగా కొందరు అధికారులు, సిబ్బంది కలిసి విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆదోనిలో 5 వేలు, డోన్‌లో 5 వేల మెట్రిక్ టన్నుల మట్టి అక్రమంగా తరలించారు.

**కొరవడిన పర్యవేక్షణ**
ఒక్క రోజే గడువున్నా.. ఒక్క డంప్ యార్డులోనూ తొలగింపు ప్రక్రియ పూర్తి కాలేదు. నంద్యాలలో 5 వేల మెట్రిక్ టన్నులు, ఆదోనిలో 30 వేలు, ఎమ్మిగనూరులో 45 వేలు, ఆళ్లగడ్డలో 5 వేలు, డోన్‌లో 7,500 వేల మెట్రిక్ టన్నుల చెత్తను శుభ్రం చేయాల్సి ఉంది. బయో మైనింగ్ ప్రక్రియను పర్యవేక్షించడానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ఎక్కడా ఏర్పాటు చేయలేదు.

## ఇంట్లో కుండీ.. కంచంలో శాకాహారం

డోన్ : కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి... ప్రతి మనిషి నిత్యం సగటున 300 గ్రాముల (విటమిన్లు, ఖనిజ లవణాలు, పీచు, పిండి పదార్థాలున్నవి) కూరగాయలు, 92 గ్రాముల పండ్లు తీసుకోవాలని ఉద్యానశాఖ లెక్కలు చెబుతున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 13.5 లక్షల కుటుంబాలున్నాయి. ఉమ్మడి జిల్లాకు నిత్యం వెయ్యి టన్నులు అవసరం కాగా.. 360 టన్నులే ఉత్పత్తి అవుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆకుకూరల సాగు మరీ అధ్వానంగా ఉంది.. కేవలం 44 హెక్టార్లలోనే సాగవుతోంది. ఉత్పత్తి త్వరగా పెంచాలన్న ఉద్దేశంతో విపరీతంగా మందులు పిచికారీ చేసి విషతుల్యం చేస్తున్నారు. వాటిని తినడం వల్ల అనారోగ్య సమస్యలొస్తున్నాయి. ఇంట్లోనే సహజ సిద్ధంగా కూరగాయలు పండించుకోవచ్చు.

**మిద్దెపైనే అన్నీ పండిస్తున్నాం**
" నిత్యం ఉదయం ఓ గంట, సాయంత్రం మరో గంట మిద్దె తోటలో గడుపుతాం. వంకాయ, మిరప, టమాట ఇలా విభిన్న రకాల కూరగాయలు, నిమ్మ మొక్కలు, వాటర్‌యాపిల్, రేగిచెట్టు, స్టార్‌పండు, డ్రాగన్ వంటి పండ్ల మొక్కలు పెంచుతున్నాం.. పసుపును సేంద్రియ పద్ధతిలో పండిస్తున్నట్లు" మిద్దె తోటల సాగులో ఏరువాక ఫౌండేషన్ నిర్వహించే రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపికైన డోన్ పట్టణానికి చెందిన వాణిరెడ్డి తెలిపారు.

**తినాల్సినంత తినడం లేదు**
ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రస్తుతం 7,340 మంది గర్భిణులు రక్తహీనతతో బాధపడుతున్నట్లు గత నెలలో అంగన్‌వాడీ సిబ్బంది నిర్వహించిన సర్వేలో తేలింది. నిత్యం తీసుకోవాల్సిన ఆహారంపై వివరాలు సేకరించగా పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి.
**ఆరోగ్యం.. ఆదాయం** ఒక కుటుంబం (నలుగురు సభ్యులు) కూర



చేసుకోవడానికి నిత్యం రూ.100-రూ.150 వరకు ఖర్చు అవుతుందని అంచనా. ఇంట్లోనే కూరగాయలు పండిస్తే ఆ డబ్బులు మిగిలిపోతాయి. రోజుకు రూ.100 లెక్కన ఏడాదికి రూ.36,000 మిగులుతాయి. నెలనెలా రూ.100 మ్యూచువల్ ఫండ్ ఇతర సంస్థల్లో పొదుపు చేస్తే.. ఏడాదికి 10% లెక్కకు రూ.37,696, 12% లెక్కకు రూ.38,047 అవుతాయని ఆర్థిక నిపుణుల అంచనా. డబ్బులు మిగలడమే కాదండోయ్ తోటలో ఒక గంట పని చేస్తే 300 కేలరీలు ఖర్చు చేసి ఆరోగ్యానికి బాటలేసు కోవచ్చు.

**రూ.10 వెచ్చిస్తే.. రూ.50 విలువైన కూరలు**
మిద్దెపై సెంటు స్థలమున్నా కుండీలు, ట్రేలు, టబ్‌లు వంటి వాటిలో పెంచుకోవచ్చు. గాలి ధారాళంగా, ఎండ తగిలే ప్రదేశాల్లో వీటిని పెట్టాలి. వెడల్పుగా ఉండే కుండీలను ఎంచుకోవాలి. వీటిలో నీరు నిలవని.. వదులైన, సారవంతమైన మట్టిని నింపి విత్తనాలు నాటుకోవాలి. రోజుకు ఐదారుగంటలైనా సూర్యకాంతి అందేలా చేసుకోవాలి. అప్పుడే నాణ్యంగా ఉంటాయంటున్నారు ఉద్యానశాఖాధికారి రాజాకృష్ణారెడ్డి.
ఒక్కో రకం విత్తనాలు ఒక ప్యాకెట్ రూ.10 మాత్రమే. రూ.50-100 ఖర్చు చేసి పది రకాల విత్తనాలను కొనుగోలు చేయాలి. ఆకుకూరలైతే విత్తిన 30-40 రోజుల్లో కోతకొస్తాయి.. అవసరమైనంత కత్తిరించుకుంటే మళ్లీ చిగురిస్తాయి. ఎప్పుడూ తాజాగానే వాడుకోవచ్చు.

# బడి భయపెడుతోంది!

నక్కపల్లి : విద్యాబుద్ధులు నేర్పే బడుల్లో శిథిల భవనాల రూపంలో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందోనని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి వాటిపై దృష్టిసారించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చినా ఆ దిశగా ఇప్పటివరకు అడుగులు పడలేదు.

పాయకరావుపేట దుర్గా కాలనీ పాఠశాలలో నిర్మాణంలో ఉన్న భవనం సన్‌షేడ్ పడి రెండేళ్ల కిందట ఓ విద్యార్థి మృతి చెందాడు. ఏడాది కిందట నంద్యాల జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాల ప్రహరీ కూలి ఓ విద్యార్థి మృత్యువాత పడగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితులున్న పాఠశాలలు అనకాపల్లి జిల్లాలోనూ ఉన్నాయి. చాలా పాఠశాలల్లో శిథిల గదుల్లోనే తరగతులు జరుగుతున్నాయి. నక్కపల్లి మండలం పెదబోదుగల్లం ఉన్నత పాఠశాలలో తరగతి గదులు కూలేలా ఉన్నాయి. ప్రత్యామ్నాయంగా సమీపంలోని తరగతి గదులను వినియోగిస్తున్నారు. నిరుపయోగ భవనాలతో ఎప్పటికైనా ముప్పు తప్పదని తెలిసినా అధికారులు మిన్నకుండిపోతున్నారు.

జిల్లావ్యాప్తంగా 24 మండలాల పరిధిలో 1,407 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. సుమారు లక్ష మంది విద్యార్థులు చదువుతున్నారు. 149 పాఠశాలల్లో 200 తరగతి గదులు తొలగించాల్సి ఉందని అధికారులు గుర్తించారు. వీటిలో సగం వరకు నక్కపల్లి, రోలుగుంట, రాంబిల్లి, మునగపాక, మాకవరపాలెం, గొలుగొండ, దేవరాపల్లి, చోడవరం, బుచ్చెయ్యపేట మండలాల్లోనే ఉన్నాయి.

విద్యార్థుల భద్రత దృష్ట్యా శిథిల భవనాలు ఉంటే తొలగించాలని,



వినియోగానికి పనికి వచ్చేచోట్ల మరమ్మతులు చేపట్టాలని రాష్ట్ర విద్యాశాఖ రెండు వారాల కిందట ఉత్తర్వులు జారీ చేసింది. కూల్చివేత తర్వాత ఖాళీ స్థలాన్ని పరిరక్షించి ఆటలాడేందుకు, వృత్తి నైపుణ్యం పెంపు, మధ్యాహ్న భోజన పథకం అమలుకు వినియోగించుకోవాలని సూచించింది. తొలగింపులు/మరమ్మతుల జరిగే సమయంలో విద్యార్థులకు తాత్కాలిక వసతి ఏర్పాటు చేయాలి. వీటి విషయంలో జిల్లా, విద్యాశాఖ యంత్రాంగం పర్యవేక్షణ చేయాల్సి ఉంది.

**అనుమతులు రాగానే తొలగింపు:** పాఠశాలల్లో శిథిల భవనాలను గుర్తించి ఉపాధ్యాయుడు, ఇంజినీరింగ్ సహాయకులు సంయుక్తంగా ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఆ వివరాలు నేరుగా అమరావతిలోని విద్యాశాఖ కార్యాలయానికి వెళ్లాయి. జిల్లాలో 200 వరకు పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరువలో ఉన్నాయి. ప్రమాదకరంగా ఉన్న భవనాల వద్దకు విద్యార్థులు వెళ్లకుండా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలి. ఉన్నతాధికారుల ఆదేశాలు రాగానే భవనాల తొలగింపు చేపడతాం. ఈ నెలాఖరులోగా పూర్తి కావచ్చు.
నరసింహారావు, ఈఈ, సమగ్ర శిక్షా

# 'స్కిట్'లో తరగతులు ఎప్పుడు?

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (స్కిట్)ను జేఎన్‌టీయూ అనంతపురం సొంత కళాశాలగా గుర్తించింది. ప్రభుత్వ ఆదేశాలతో రెండో విడత కౌన్సెలింగ్‌లో విద్యార్థులు ఇక్కడి కళాశాలలో చేరేందుకు అవకాశం కల్పించింది. 68 మంది దరఖాస్తు చేసుకున్నారు.. ఇప్పటివరకు తరగతులు ప్రారంభం కాకపోవడం, ఫీజు ఎలా చెల్లించాలన్న విషయమై స్పష్టత లేకపోవడంతో తమ పిల్లల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదనకు గురవుతున్నారు. వైకాపా పుణ్యమా అంటూ మూతపడ్డ ఈ కళాశాలకు పునర్ వైభవాన్ని తేవాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. వైకాపా అడ్డగోలుగా మూసేయగా ఎన్నో అడ్డంకులు అధిగమించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఇక్కడి కళాశాలను అనంతపురం జేఎన్‌టీయూలో విలీనం చేసేలా చర్యలు చేపట్టారు. రెండో విడత దరఖాస్తుల స్వీకరణ




నేపథ్యంలో సీఎస్ఈ 33, సీఎస్ఎం 18, సీఎస్‌డీ 8, ఈసీఈ 7, ఈఈఈ 2 మొత్తం 68 మంది దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలల్లో తరగతులు జరుగుతున్నా జేఎన్‌టీయూఏ స్కిట్‌లో మాత్రం అలాంటి ఊసే కనిపించలేదు. ఫీజు చెల్లింపుపై స్పష్టత లేదు. పక్కా భవనాలతో కళాశాల ఉన్నా తరగతుల నిర్వహణ, హాస్టల్ వసతులపై స్పష్టత లేకపోయింది.

**కొరవడిన స్పష్టత**

సోమవారం నుంచి మూడో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో కళాశాల జేఎన్‌టీయూఏలో విలీనమైందని, ఇక తమ పరిధి కాదని శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి అధికారికంగా ఆదేశాలు వస్తే తప్ప తరగతులు ప్రారంభించలేమని జేఎన్‌టీయూఏ అధికారులు అంటున్నారు. ఇంకా సీఎంవోలో పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. సత్వర నిర్ణయం తీసుకోకుంటే మూడో విడత కౌన్సెలింగ్ దృష్ట్యా కొత్తగా చేరడం అటుంచితే వచ్చిన దరఖాస్తులు వెనక్కి వెళ్లే ప్రమాదముంది.

# ప్రభుత్వ స్థలంలోనే మురుగు శుద్ధి!



పుత్తూరు : పుత్తూరు పట్టణంలోని పుత్తూరు చెరువు, గోవిందమ్మగుంట, నేసనూరు సమీపంలో మురుగు నీటి శుద్ధి కేంద్రాలు నిర్మించాలని అధికారులు నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపడంతో రూ.13 కోట్ల నిధులు కేటాయించారు. భూసేకరణకు ప్రకటన కూడా జారీ చేశారు. అయితే భూసేకరణకు రూ.13 కోట్లు అవసరమని తేల్చడంతో ప్రభుత్వ భూములు చూడాలని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. దీంతో ప్లాంట్ల నిర్మాణం మళ్లీ మొదటికొచ్చింది.

**కూటమి ప్రభుత్వం వచ్చాకే కదలిక..**

వైకాపా హయాంలో నిధులు విడుదల చేసినా పనులు చేయడానికి గుత్తేదారులు ముందుకు రాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక భూసేకరణ ప్రక్రియకు అడుగులు పడ్డాయి. భూసేకరణకు అధిక మొత్తంలో నిధులు వ్యయం చేయాల్సి రావడంతో ప్రభుత్వ భూములు సేకరించాలని ఆదేశాలు ఇచ్చారు. ఆ మేరకు పరిశీలిస్తున్నామని కమిషనర్ మంజునాథగౌడ్ తెలిపారు.

**ఇప్పటికీ కలుషిత నీటితోనే..**

పురపాలికలో 27 వార్డులు ఉండగా.. 20 వార్డుల నుంచి వచ్చే మురుగు నీరంతా పట్టణ పరిధిలోని మూడు చెరువుల్లోనే కలుస్తోంది. ఈ నీటినే పంటలకు వాడుతుండటం గమనార్హం.

వివరాలిలా..
పుత్తూరులో ప్రతిపాదిత నీటిశుద్ధి ప్లాంట్లు: 3
ప్లాంట్లతో శుద్ధి చేయనున్న నీరు: 11 ఎంఎల్‌డీలు
కేటాయించిన నిధులు: రూ.13 కోట్లు

# రంగులు పూసి.. దస్త్రాలు మార్చేసి!!



విశాఖపట్నం :పెద్దరుషికొండ సమీపంలో రూ.కోట్ల విలువైన పార్కు స్థలంపై అక్రమార్కుల కన్నుపడింది. లే-అవుట్‌కు ఎప్పుడో భూమిలిచ్చిన కుటుంబాల వారసులను తెరపైకి తెచ్చి నకిలీ పత్రాలతో అమ్మేందుకు అడుగులు వేస్తున్నారు. స్థానిక వైకాపా నాయకులు కొందరు తెరవెనకుండి ఈ తతంగాన్ని నడిపిస్తున్నారు. ఇటీవల నకిలీ పత్రాలతో భూకబ్జాలకు పాల్పడుతున్న వారిపై పీఎంపాలెం స్టేషన్ పరిధిలో నాలుగు కేసులు నమోదయ్యాయి. ఆ తరహా మాయగాళ్లే ఇక్కడా అవకాశం కోసం కాచుక్కూర్చున్నారు.

రౌడీమూకల పహారా: సత్యసాయి నగర్‌లో కృష్ణా కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఉంది. దీని ఎల్‌పీ నెంబరు 22/84. పెద్దరుషికొండ పంచాయతీగా ఉన్న సమయంలో ఈ లేఅవుట్‌లోని 50 సెంట్ల పార్కు స్థలంలో ప్రజావసరాలకు వాటర్ ట్యాంకు నిర్మించారు. గత వైకాపా ప్రభుత్వంలో 2020లో పార్కు స్థలంలో కొందరు పాగా వేశారు. ఇది తమకు తాతల నుంచి వచ్చిందని, దస్త్రాలున్నాయని చెప్పుకొచ్చారు. అందులో ఓ షెడ్డు నిర్మాణం చేపట్టి, పార్కులోకి ఎవరూ రాకుండా రౌడీ మూకలను పహారాగా పెట్టడం కలకలం రేపింది. స్థానికుల ఫిర్యాదుతో జీవీఎంసీ అధికారులు పార్కు స్థలం చుట్టూ సిమెంట్ స్తంభాలతో రక్షణ కంచె ఏర్పాటు చేశారు. వీటిపై జీవీఎంసీ స్థలం అని రాశారు. ఎవరైనా ఆక్రమిస్తే శిక్షార్హులంటూ వాటర్ ట్యాంకుపైనా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. **విక్రయించే పన్నాగం:** ప్రస్తుతం 2,400 గజాల పార్కు స్థలం విలువ దాదాపు రూ.20కోట్లకు పైగానే ఉంటుంది. రికార్డుల ప్రకారం పార్కు స్థలం అని ఉన్నా...సొంత స్థలంగా చూపించేందుకు స్థానిక వైకాపా నాయకుడు ఒకరు ప్రయత్నాలు సాగిస్తున్నాడు. ఇక్కడి పరిస్థితిపై జోన్-2 ఏసీపీ శాస్త్రి సబ్బాన్‌తో మాట్లాడగా... సచివాలయ కార్యదర్శులను క్షేత్రస్థాయికి పంపి విచారణ చేయించగా... పార్కు స్థలమని నిర్ధారణ అయిందన్నారు.

**జీవీఎంసీ పేరు కనిపించకుండా:** సాధారణంగా భూసేకరణ జరిగిన తర్వాతే హద్దులు నిర్ణయించి లే-అవుట్ మ్యాప్ సిద్ధం చేసి ప్లాట్లుగా విభజిస్తారు. అయితే చిత్రంగా.. లేఅవుట్‌లో పార్కుకు వదిలిన 50 సెంట్ల స్థలం మేం అమ్మలేదంటూ, అప్పట్లో భూమిలిచ్చిన వారి వారసుల పేరుతో కొందరు తెరపైకి వచ్చారు. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి.. విలువైన స్థలం కబ్జాకు పావులు కదిపారు. రక్షణ కంచె స్తంభాలపై రాసిన 'జీవీఎంసీ స్థలం' అనే అక్షరాలు కనిపించకుండా రంగులు వేయడం గమనార్హం.

# నారీ.. పట్టు సాధించు..!



విశాఖపట్నం: విశాఖ తీరంలో సముద్రపు నాచు పెంపకంతో మత్స్యకార మహిళలకు ఉపాధి కల్పించేలా మత్స్యశాఖ చేపట్టిన ప్రాథమిక ప్రయత్నాలు ఫలించాయి. నాచు పెంపకంలో ఇప్పటికే గుజరాత్, తమిళనాడు రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. ఆ విధానాలను రాష్ట్రంలోనూ అమలు చేయనున్నారు.

**సాంకేతిక దన్నుతో..** ఆర్కేబీచ్‌లో ప్రయోగాత్మకంగా రాఫ్ట్ ఏర్పాటు చేసి సముద్రపు నాచు పెంపకం ప్రారంభించారు. ఈ ప్రక్రియలో రెండు మహిళా సంఘాలకు అవకాశం కల్పించారు. త్వరలోనే మంగమారిపేట, కోస్టల్ బ్యాటరీ వద్ద సముద్రపు నాచు పెంపకం ప్రారంభించనున్నారు. కేంద్ర సముద్ర మత్స్య పరిశోధన సంస్థ (సీఎంఎఫ్ఆర్ఐ), కేంద్ర సాల్ట్ అండ్ మెరైన్ కెమికల్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎస్ఎంసీఆర్ఐ) సాంకేతిక సహకారం అందించనున్నాయి.

**పెంపకం విధానం..!**

చతురస్రాకారంలో ఉన్న రాఫ్ట్‌కు తాళ్లు కట్టి వలతో కలిపి సీవీడ్ (సముద్రపు నాచు) మొక్కలు వేస్తారు. 45 రోజుల వ్యవధిలో పంట చేతికొస్తుంది. ఏ కాలంలోనైనా ఈ పంట వేసుకోవచ్చు.

9 మీటర్ల పరిధిలో నిర్మించే రాఫ్ట్‌లో 50 కిలోల సీవీడ్ వేస్తారు. 200 కిలోల వరకు పంట వస్తుంది. కిలో ధర రూ.21 నుంచి రూ.22 వరకు పలుకుతోంది. ఒక్కసారి పంట వేస్తే రూ.42 వేల వరకు ఆదాయం వస్తుంది. 50 కిలోల మొక్కలు వేసేందుకు రూ.11 వేల వరకు ఖర్చు అవుతుంది. రాఫ్ట్ అటూ, ఇటూ కదలకుండా.. బరువులు కిందకు వేలాడదీసి యాంకర్ పాయింట్‌లో ఉంచడం వల్ల గాలుల తీవ్రతను తట్టుకొని నిలబడుతుంది. రాఫ్ట్ పైభాగంలో సోలార్ లైట్లు, బాయ్స్‌ను అమర్చుతారు. బోట్లు అటు వైపు వెళ్లనీయకుండా అవి నిరోధిస్తాయి. హెచ్‌డీపీఈ 9 సెంటీమీటర్ల మందంతో కూడిన ఫైబర్ పైపులను రాఫ్ట్ కోసం వినియోగిస్తారు. పైపుల కింద 150 కిలోల కాంక్రీట్ రాళ్లను వేలాడదీస్తారు.

**వినియోగం ఇలా..**

ప్రొటీన్లు, మిటమిన్లు, మినరల్స్ అధికంగా ఉండే సముద్రపు నాచును ఔషధాలు, బిస్కెట్లు, కేకులు, ఐస్‌క్రీమ్స్, జెల్స్, సాఫ్ట్ డ్రింక్స్‌లో వినియోగిస్తారు. పారిశ్రామిక అవసరాలకు కొన్ని రసాయనాల్లోనూ ఉపయోగిస్తారు. ఇండోనేసియా, ఫిలిప్పీన్స్, దక్షిణ కొరియా దేశాల్లో ఈ పంట అధికంగా పండిస్తున్నారు.

**ప్రత్యేక శిక్షణ ఇచ్చాం** ప్రభుత్వ ఆదేశాలతో ప్రయోగాత్మకంగా చేపట్టిన పెంపకంలో 30 మంది మత్స్యకార మహిళలకు శిక్షణ ఇచ్చాం. తర్వాత మరికొందరికి ఇస్తాం. ప్రస్తుతం 'కప్పా ఫైకస్' అనే రకం పండించాం. రెండోదశలో 'గ్రాస్ లేరియా' రకం వేస్తాం. ఒక్కసారి నిర్మించిన రాఫ్ట్ పదేళ్లు పనికొస్తుంది. మహిళల ఉపాధి దృష్ట్యా దివీస్ లేబొరేటరీ సీఎస్ఆర్ కింద 30 రాఫ్ట్‌లు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది.
పి.లక్ష్మణరావు, మత్స్యశాఖ జేడీ

# తీర గ్రామాలకు బహుళార్థక వరం

పాయకరావుపేట: ఆక్వారంగం మార్కెట్‌లో వస్తున్న మార్పులకు అనుగుణంగా మత్స్యకారులు జీవన స్థితిగతులు మార్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా కేంద్ర మత్స్యశాఖ ప్రధాని మత్స్య సంపద యోజన కార్యక్రమంలో భాగంగా (పీఎంఎంఎస్‌వై) సుమారు రూ.నాలుగు కోట్లు వెచ్చించి జిల్లాలోని పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం, పాయకరావుపేట మండలం పెంటకోట తీరాల్లో బహుళార్థక సాధక కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందించింది. ఒక్కో కేంద్రానికి రూ.రెండు కోట్లు కేటాయిస్తున్నారు. వీటిని అత్యంత వెనుకబడిన, తీరానికి అతి సమీపంలో ఉండే గ్రామాల్లో నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా హోంమంత్రి అనిత ఈ పనులకు ఇటీవలే శంకుస్థాపన చేశారు. ప్రధానంగా సముద్రంపై వేటతో జీవనోపాధి పొందే మత్స్యకారులకు అన్ని రకాల సౌకర్యాలతోపాటు వాణిజ్య, ఉపాధి రంగాల్లో పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దేలా అందుబాటులోకి తెస్తున్నారు. తీరంలో పర్యావరణ హితంగా అన్ని వసతులు ఉండేలా ప్రణాళికలు చేపట్టారు.

**ప్రయోజనాలు ఇలా...**

ఈ కేంద్రాల వద్ద చేపలు ఎండబెట్టుకోవడానికి వీలుగా విశాలమైన పర్యావరణహితమైన ప్లాట్‌ఫాంల నిర్మాణం చేపట్టనున్నారు.

మత్స్యసంపద శుభ్రంచేసి మార్కెట్ చేసుకునేందుకు అనుగుణంగా నీటి వసతి.. ఉత్పత్తులు నేరుగా తరలించేందుకు రవాణా సౌకర్యం అందుబాటులోకి తెస్తారు. వాతావరణంలో ముందుగానే తెలుసుకునే శాటిలైట్ పరికరాలు, సముద్రంలో చేపలు ఎక్కువగా లభించే ప్రాంతాలను గుర్తించే ఆధునిక సమాచార వ్యవస్థ ఏర్పాటు చేస్తారు. చేపలు నిల్వ చేసుకునేందుకు వీలుగా ఐస్ తయారీ కేంద్రంతోపాటు భారీ శీతల గది, వలలు భద్రపర్చుకునేందుకు అనువైన గదుల నిర్మాణం. తీరంలో నిరంతరం వాణిజ్యం జరిగేలా 250 హైమాస్ట్ సోలార్ దీపాలు అమరుస్తారు. మత్స్యకార యువత, మహిళలకు మత్స్య ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్, హేచరీల నిర్వహణ, పెంపకం వంటి



అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటారు. సముద్రంలో ప్రమాదాలు జరిగితే తక్షణ వైద్య సాయం అందించేందుకు ప్రాథమిక చికిత్స పరికరాలు ఉంటాయి.

జనవరి నాటికి అందుబాటులోకి: వచ్చే జనవరి నాటికి బహుళార్థక సాధక కేంద్రాలు జిల్లాలో అందుబాటులోకి రానున్నాయి. కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు అండగా ఉంటుందనేందుకు ఇదే నిదర్శనం. మార్కెట్‌లో వస్తున్న మార్పులకు అనుగుణంగా మత్స్య ఉత్పత్తుల తయారీ, అమ్మకాలు చేసేలా శిక్షణ కేంద్రంతోపాటు అన్ని సౌకర్యాలతో వీటిని నిర్మిస్తున్నాం. జిల్లాలో మరిన్ని చోట్ల ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. వంగలపూడి అనిత, హోంమంత్రి

# ఆక్రమణదారుల అనుభవం

నంద్యాల: కొలిమిగుండ్ల మండల కేంద్రంలో రూ.లక్షల విలువైన ప్రభుత్వ భూములకు బేరం పెట్టారు. ఇటిక్యాల గ్రామ పంచాయతీ పరిధిలో జగనన్న కాలనీకి ఆనుకొని వందల ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. అవన్నీ కొండలు, గుట్టలతో కూడుకొని ఉన్నాయి. వాటిని చదును చేసి రెండున్నర సెంట్ల చొప్పున ప్లాట్లు వేశారు. ఒక్కో ఇంటి స్థలాన్ని రూ.లక్ష లోపే విక్రయిస్తున్నారు. ధర తక్కువగా ఉండటంతో చాలా మంది ఆసక్తి కనబరుస్తున్నారు. ఇప్పటికే 40 ప్లాట్ల వరకు అమ్మేశారు. వాటిని కొనుగోలు చేసిన వారు ఇంటి నిర్మాణానికి పునాదులు వేస్తున్నారు. వెయ్యి వరకు ప్లాట్లు చేసి విక్రయించాలన్న ఆలోచనలో ఆక్రమణదారులు ఉన్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు.

**పుట్టుకొస్తున్న పట్టాలు**

ఆక్రమణదారులు ఏకంగా అనుభవదారు పట్టాలు పుట్టించి ఇస్తున్నారు. అనుభవదారు పట్టాలు ఇవ్వాలంటే ముందుగా వీఆర్వో ఆ దరఖాస్తును పరిశీలించాలి.. దరఖాస్తుదారు అక్కడ ఉంటున్నారా? ఉంటే ఎంతకాలం నుంచి నివాసం ఉంటున్నారు? ఆ స్థలం ఎంత విస్తీర్ణంలో ఉంది? తదితర వివరాలతో తహసీల్దారుకు నివేదిక ఇవ్వాలి. దాని ప్రకారం పట్టాలు పంపిణీ చేస్తారు.. ఇక్కడ వీఆర్వోలు అందినకాడికి దండుకుని తప్పుడు నివేదికలు ఇస్తున్నారు.

ఉప్పలపాడు గ్రామంలో ఓ వ్యక్తి ఇంట్లో పోలీసులు తనిఖీ చేయగా అక్కడ విక్రయించడానికి సిద్ధం చేసిన 80 అనుభవదారు పట్టాలు దొరికాయి. ఇటిక్యాల గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిని విక్రయించడానికి వీలుగా వాటిని సిద్ధం చేసి పెట్టినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. వాటిని స్వాధీనం చేసుకొన్న పోలీసులు



కొలిమిగుండ్ల మండల తహసీల్దారుకు సమాచారం ఇచ్చారు.

**విచారణలో ఆలస్యం ఎందుకో**

ఇటిక్యాల వీఆర్వో చెన్నయ్య నిబంధనలకు విరుద్ధంగా పలువురికి నిరభ్యంతర పత్రాలు(ఎన్‌వోసీలు) ఇవ్వడంతో ప్రభుత్వం ఆయన్ను సస్పెండ్ చేసింది. మళ్లీ ఆయనకు పోస్టింగ్ ఇచ్చారు. ఆయన సస్పెన్షన్‌కు దారితీసిన పరిస్థితులను లోతుగా అధ్యయనం చేసి అక్రమార్కులను గుర్తిస్తే భారీ భూకుంభకోణం వెలుగులోకి వచ్చేది. కానీ ఎలాంటి విచారణ చేయలేదు. అనుభవదారు పట్టాలకు సంబంధించి పోలీసులు సాక్ష్యాధారాలతో సహా కొలిమిగుండ్ల తహసీల్దారుకు ఇచ్చినా నేటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విస్మయం కలిగిస్తోంది. తహసీల్దారు కార్యాలయ సీళ్లు, కొందరి సంతకాలు ఉన్నట్లు సమాచారం. నిగ్గుతేల్చాల్సిన రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. కనీసం కేసులు కూడా పెట్టకుండా అంతులేని తాత్సారం చేస్తున్నారు. "ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.. వారిచ్చే ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని" తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు.

# వ్యాపారుల సిండికేటు.. ప్రభుత్వానికి 'ఉల్లి'పోటు

కర్నూలు : ఉల్లి రైతుకు క్వింటాకు రూ.1200 ధర తగ్గకుండా చూస్తాం. రైతులు తక్కువకు అమ్ముకుంటే ఆ మేరకు ప్రభుత్వం తరపున వారికి వ్యత్యాస ధర చెల్లిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఇదే అదనుగా కర్నూలు వ్యవసాయ మార్కెట్లోని వ్యాపారులు సిండికేట్‌గా మారి.. దోపిడీకి తెరలేపారు. నాణ్యతను సాకుగా చూపి అతి తక్కువకు ఉల్లి దిగుబడులు కొనుగోలు చేస్తున్నారు. క్వింటా రూ.100 నుంచి రూ.600 లోపే కొంటున్నారు. రూ.1200 మద్దతు ధర ప్రకారం మిగతా మొత్తాన్ని ప్రభుత్వం రైతులకు చెల్లిస్తుంది. వ్యాపారులు తెలివిగా కనిష్ఠ ధరలకు కొనుగోలు చేస్తుండటంతో ప్రభుత్వంపై గరిష్ఠ భారం పడుతోంది. మద్దతు ధరతో ఉల్లి రైతులకు కాస్త ఊరట లభిస్తుండగా.. వ్యాపారులు మాత్రం భారీగా లాభపడుతుండటం గమనార్హం.

**క్వింటా రూ.వందకే కొట్టేశారు**

సోమవారం 192 లాట్లలో 8,011 క్వింటాళ్ల ఉల్లి మార్కెట్‌కు వచ్చింది. మొదట నిర్వహించిన టెండరులో 20 లాట్లకే ఈ-నామ్‌లో ధరలు రాశారు. ఆ తర్వాత రెండోసారి నిర్వహించిన టెండరు నిర్వహించారు. రెండు టెండర్లలో కలిపి మొత్తం మీద 4,978 క్వింటాళ్ల ఉల్లిని కొనుగోలు చేశారు. క్వింటా కనిష్ఠ ధర రూ.100, మధ్యస్త ధర రూ.634తో వ్యాపారులు కొనుగోలు చేశారు. మార్క్‌ఫెడ్ రూ.1,200 గరిష్ఠ ధరతో 3,033 క్వింటాళ్ల ఉల్లిని కొనుగోలు చేసింది.

మంగళవారం 301 లాట్లలో 14,324.85 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు వచ్చాయి. ఉదయం నిర్వహించిన టెండరు ప్రక్రియలో 100 లాట్లకే ధరలు రాశారు. మరో 25 లాట్లకు మార్క్‌ఫెడ్ క్వింటాకు రూ.1200 ధర కోట్ చేసింది. మిగిలిన 176 లాట్లకు ఉల్లి వ్యాపారులు ధరలు రాయలేదు. సరకు బాగున్నా సరే కనీసం రూ.100, రూ.200 ధర కూడా రాలేదు. సరకు నాణ్యంగా లేదని కొనుగోలుకు నిరాకరించారు. ఎట్టకేలకు రెండుసార్లు టెండరు నిర్వహించగా అతికష్టం మీద 6,749



క్వింటాళ్ల ఉల్లిని కొన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా 7,576 క్వింటాళ్ల సరకును రూ.1200 ధరతో కొనుగోలు చేశారు.

**ధరలు రాయకుండా తకరారు**

వ్యాపారులు ఉల్లి లాట్లకు ధరలు రాయకపోవడంతో అధికారులు మంగళవారం హుటాహుటిన కర్నూలు వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. 175 లాట్ల ఎందుకు టెండరు ధరను కోట్ చేయలేదు.. సరకు నాణ్యంగా లేదా అని ఆరా తీశారు. 70 శాతం సరకు నాణ్యంగా ఉన్నట్లు గుర్తించారు. అయినాసరే వ్యాపారులు కొనుగోలు చేయకపోవడంపై జిల్లా అధికారులు అసహనం వ్యక్తం చేశారు.

పది రోజులుగా వర్షాలు పడలేదు. సరకు నాణ్యత బాగుంది. వ్యాపారులు ఉద్దేశపూర్వకంగా ధరలు రాయడం లేదని రైతులు మొరపెట్టుకున్నారు. చివరకు 175 లాట్లను మార్క్‌ఫెడ్ ద్వారానే కొనుగోలు చేశారు."మాది సి.బెళగల్ మండలం పోలకల్. 30 మంది కూలీలను పెట్టి గ్రేడింగ్ చేయించా.. రెండు లాట్ల సరకును వేర్వేరుగాకుప్పలు పోయగా ఒక లాట్‌కు క్వింటా రూ.765 ధర రాసిన వ్యాపారులు... మరో లాట్‌కు రూ.100 కూడా రాయలేదని" రైతు తిరుమలేశ్ ఆవేదన వ్యక్తం చేశారు.

**కొనేది రూ.1.. అమ్మేది రూ.10**

గత మూడు రోజుల్లో 18,437 క్వింటాళ్ల కొనుగోలు చేశారు. క్వింటాకు రూ.100 నుంచి రూ.700 లోపే ధరలు చెల్లించారు.

రాష్ట్ర ప్రభుత్వం రైతుకు క్వింటాకు రూ.1200 గిట్టుబాటయ్యేలా మిగతా వ్యత్యాస మొత్తాన్ని చేస్తుంది కదా.. అని తక్కువ ధరలు రాస్తున్నారు. రైతుల నుంచి కిలో రూ.1- 6లోపు కొనుగోలు చేసిన ఉల్లిని బయట వ్యాపారులకు కిలో రూ.10, రూ.12తో విక్రయిస్తూ లాభపడుతున్నారు.

# ముక్కంటి.. సేవల్లో మేటి!

శ్రీకాళహసి: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రధాన ఆరు ఆలయాల్లో శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తుల సేవలపరంగా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది ప్రారంభం నుంచి రెండు, మూడు స్థానాల్లో ఉన్న ఆలయం ఆగస్టు నెలలో ప్రథమ స్థానానికి చేరింది.

కూటమి ప్రభుత్వం వచ్చాక భక్తుల సేవలకు అధిక ప్రాధాన్యం కల్పించాలని నిర్ణయించింది. అందులో భాగంగా దేవాదాయ శాఖ ప్రధాన ఆలయాల్లోని వసతులు, అక్కడి ఇబ్బందులు తదితర అంశాలకు సంబంధించి భక్తుల నుంచి అభిప్రాయాలు సేకరించి ర్యాంకులు ప్రకటిస్తోంది. ప్రధానంగా దర్శనం, మౌలిక వసతుల కల్పన, ప్రసాదాల తయారీ, పారిశుద్ధ్య నిర్వహణపై అభిప్రాయాలు సేకరిస్తున్నారు. ఇందుకోసం ఆలయంలోని ప్రధాన ప్రవేశ గోపురాలు, ప్రసాదాల కౌంటర్లు, అతిథిగృహాలు తదితర ప్రాంతాల్లో క్యూఆర్ కోడ్‌లను అందుబాటులోకి తెచ్చారు. ఇలా ఐవీఆర్ సర్వే, క్యూఆర్ కోడ్ ద్వారా సమాచారం సేకరించడం, వాటిపై ఆయా ఆలయాల పురోగతి, పెంపొందించాల్సిన సేవలపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు తరచూ అధికారులతో సమీక్షిస్తూ సేవలు విస్తృతం అయ్యేలా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు రెండు, మూడు స్థానాల్లో ఉన్న శ్రీకాళహస్తీశ్వరాలయం ఆగస్టు నెలకు సంబంధించి ప్రథమ స్థానంలో నిలవడంతో ఉన్నతాధికారులు స్థానిక అధికారులకు కితాబు ఇచ్చారు. రెండు, మూడు స్థానాల్లో శ్రీశైలం, ద్వారకా తిరుమల ఆలయాలు ఉన్నాయి.

# ముందుకు సాగని పీఎం సూర్యఘర్



కొత్తచెరువు : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోన్న పీఎం సూర్యఘర్ పథకం ముందుకు సాగడం లేదు. దీనిపై లబ్ధిదారుల్లో అవగాహన కొరవడింది. సొంతిల్లు ఉన్న ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా, మిగిలిన వర్గాల వారికి సోలార్ యూనిట్‌పై రాయితీ కల్పిస్తూ ఈ పథకాన్ని ప్రారంభించారు. జిల్లాలో వేసవితో పాటు ఏడాది పొడవునా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం సోలార్ కరెంటు ఉత్పత్తికి అనుకూలం. ఈ పథకంతో విద్యుత్తు బిల్లులు తగ్గి ఆర్థికంగా వెసులుబాటు కలుగుతుంది.

**ఎస్సీ, ఎస్టీలకు వందశాతం రాయితీ**

ఈ ప్రాజెక్టు కింద ఎస్సీ, ఎస్టీలకు కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం రాయితీ భరించనున్నాయి. రెండు కిలోవాట్ల సౌర పలకలను ఉచితంగా ఏర్పాటు చేయనున్నారు. ఇతర వర్గాలకు ఒక కిలోవాటు నుంచి మూడు కిలోవాట్ల సామర్థ్యం వరకూ ప్రభుత్వం రాయితీ అందించనుంది. మిగిలిన మొత్తాన్ని బ్యాంకు రుణం ద్వారా ఏర్పాటు చేసుకునేలా వెసులుబాటు కల్పించి వినియోగదారుడి ఖాతాకు రాయితీ సొమ్ము జమ చేయనున్నారు. ఆపైన ఎంత సామర్థ్యం ఉన్న యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నా మూడు కిలోవాట్ల రాయితీ మాత్రమే వర్తిస్తుందని విద్యుత్తు శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

**వినియోగదారుల్లో స్తబ్దత..**

సౌర యూనిట్ల ఏర్పాటుపై విద్యుత్తుశాఖ అధికారులు ప్రారంభంలో వినియోగారులకు అవగాహన కల్పించారు. వీటి ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్తును ఇంటికి వినియోగించగా మిగిలిన విద్యుత్తును నెట్ మీటరింగ్ విధానంతో గ్రిడ్‌కు అనుసంధానించనున్నారు. దీంతో విద్యుత్తు బిల్లు భారం తగ్గడంతో పాటు కొందరికి నెలవారీగా ఆదాయం సమకూరనుంది. అయితే ప్రారంభంలో సౌర యూనిట్‌పై సొంతంగా పెట్టుబడి పెట్టడం, లేదంటే బ్యాంకు రుణం మంజూరు, తరువాత కంతుల చెల్లింపుపై వినియోగదారులకు అవగాహన కొరవడింది. ఈ నేపథ్యంలో యూనిట్ల ఏర్పాటుకు వినియోదారులు ఆసక్తి కనబరచడం లేదన్న అభిప్రాయాలు వ్యకమవుతున్నాయి.

**సద్వినియోగంతో ఎన్నో ప్రయోజనాలు: సంపత్‌కుమార్, ఎస్ఈ, విద్యుత్తుశాఖ** ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో ఎక్కువ శాతం రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. స్థానికంగా నివాసం లేని వారి వివరాలు సిబ్బంది సేకరించి రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. త్వరలో వందశాతం రాయితీ యూనిట్లు ఏర్పాటు చేయనున్నాం. ఇతర వర్గాల వినియోగదారులు మొదట పెట్టుబడి భారంగా భావిస్తున్నారు. ఇళ్లపై సోలార్ ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వ రాయితీపై అవగాహన కల్పిస్తున్నాం.

# కరవు సీమకు కృష్ణాజలాలు



తలుపుల : కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిన్నరలోనే వరుసగా రెండోసారి కృష్ణాజలాలు బిరబిరా ప్రవహిస్తుండడంతో అన్నదాతలు మురిసిపోతున్నారు. తలుపుల మండలంలో హంద్రీనీవా కాలువ దాదాపు 30 కి.మీ.లకు పైగా ప్రవహిస్తోంది. దీంతో చాలా గ్రామాలు సస్యశ్యామలం కానున్నాయి. కాలువ గట్టుకు ఇరువైపులా బోర్లు, బావుల్లో భూగర్భ జలం పెరగడంతో పాటు ఎండిపోతున్న మామిడి తోటలకు ప్రాణం పోస్తాయని రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఎన్నో అడ్డంకులను అధిగమించి..**


గత వైకాపా పాలనలో 15వ ప్యాకేజీలోని 100 మీటర్ల సొరంగం తవ్వడానికి 3 ఏళ్లు పట్టింది. 14వ ప్యాకేజీలోని కల్వర్టులు, వంతెనలు, లైనింగ్ తదితర అసంపూర్తిగా ఉన్న పనులన్నింటిని కూటమి ప్రభుత్వం చక్కబెట్టింది. గతేడాది కొండారెడ్డిచెరువును సగానికి పైగా నింపగలిగింది. దీంతో చెరువుకింద ఉన్న వందలాది బోర్లు, బావుల్లో భూగర్భజలం పెరిగింది. ప్రస్తుతం ఈ చెరువుకు నీటిని నింపడం వల్ల తలుపుల మేజర్ పంచాయతీలో తాగునీటి సమస్య ఉత్పన్నం కాదు.**ప్రధాన చెరువులు నింపాలి**

ప్రధాన చెరువులు కొండారెడ్డి చెరువు, కొత్తచెరువు, పులిగుండ్లపల్లి చెరువు, యర్రచెరువు, బట్రేపల్లిలోని తంబళ్లపల్లి చెరువు తదితర వాటిని నింపుకోగలిగితే కరవు ఉండదు.

**నేడు కొండారెడ్డి చెరువులోకి..: వనజ, డీఈ హంద్రీనీవా 14వ ప్యాకేజీ**

ప్రధాన చెరువులన్నీ నింపాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. మొదట కొండారెడ్డి చెరువును నింపుతాం. మిగతా చెరువులపై, ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటాం. తలుపుల పంచాయతీ కొరుగుట్టపల్లి వరకు కృష్ణాజలాలు ప్రవహించాయి. బుధవారం తెల్లవారుజామకంతా కొండారెడ్డి చెరువులో జలాలు చేరే అవకాశం ఉంది.

# పైపులైన్ విస్తరణ పనుల్లో జాప్యం



గుత్తి: గుత్తిపురపాలికలో అధికారులు సిమెంట్ రహదారుల నిర్మాణాలను నిరవధికంగా ఆపేశారు. ఫలితంగా పట్టణంలోని అనేక కాలనీల్లో రోడ్లులేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. శివారు కాలనీల్లో రోడ్లతో సహా డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదు. ఆయా ప్రాంతాల ప్రజలు పుట్టెడు సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ క్రమంలో రూ.241 కోట్లతో గుత్తి, పామిడి పట్టణాలకు బృహత్తర తాగునీటి పథకం కింద పనులు జరగాల్సి ఉంది. గుంతకల్లు ప్రజారోగ్యవిభాగం ఇంజినీర్ల పర్యవేక్షణలో పనులు జరుగుతాయి. గార్లదిన్నె ఎంపీఆర్ డ్యామ్ నుంచి గుత్తి వరకు 52 కిలోమీటర్ల మేర పైపులైన్‌ను ఏర్పాటు చేసి.. పామిడి, గుత్తి, సూరశింగనపల్లిలలో ట్యాంకులను నిర్మించనున్నారు.

**రోడ్లు నిర్మించొద్దని ఆదేశం**

ఈ పథకం కింద గుత్తి పురపాలికలోని అన్నివార్డుల్లో కొత్త పైపులైన్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న సిమెంట్‌రోడ్లు ధ్వంసం చేయాల్సి ఉంది. నూతన రోడ్లు నిర్మిస్తే రూ.కోట్ల నిధులకు సార్థకత ఉండదని అధికారులు భావిస్తున్నారు. పురపాలికలో వీరారెడ్డి కాలనీతోపాటు తాడిపత్రిరోడ్డు, అనంతపురం రోడ్డు, చంద్రప్రియనగర్, తోళ్లషాపుకాలనీ, సుందరయ్యకాలనీ, పత్తికొండరోడ్డు, చెట్నేపల్లిలలోని శివారు కాలనీలకు రోడ్లులేవు. ఆ ప్రాంతాలకు రూ.2 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులతో సిమెంట్‌రోడ్లు, మురుగుకాలవలను నిర్మించేందుకు కౌన్సిల్ అమోదం తీసుకున్నారు. దీంతో పైపులైను పనులు చేయాలకున్న తరుణంలోనే కొత్తగా రోడ్లు నిర్మించకూడదని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి.

**టెండర్ల దశలో..**

గార్లదిన్నె ఎంపీఆర్ డ్యామ్ నుంచి గుత్తికి తాగునీటిని అందించే భారీ నీటిపథకం పనులకు ఇంకా టెండర్లు నిర్వహించాల్సి ఉంది. కొత్తరేట్లతో కొత్తవారికి పనులు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గార్లదిన్నె నుంచి గుత్తి వరకు పైపులైన్ ఏర్పాటుకు గుంతలు తవ్వితే రోడ్డు పాడవుతుందని హైవే అధికారులు అంగీకరించడంలేదు.

**పూర్తయితేనే పనులు..: జబ్బార్‌మియా, కమిషనర్, గుత్తి**

గుత్తి పురపాలికలో తాగునీటి పైపులైన్ విస్తరణ పూర్తయితేనే సీసీ రోడ్ల నిర్మాణం మొదలుపెడతాం. ఇప్పుడే రోడ్లు వేస్తే పైప్‌లైన్ ఏర్పాటులో అవి పాడవుతాయి. అందుకే ఉన్నతాధికారులు రోడ్ల పనులను మంజూరు చేయడంలేదు.

# భూచోళ్ల 'ఎత్తు'గడలు

ఆదోని : డిమాండ్ ఉన్న భూములు గుర్తించడం.. వాటి చుట్టుపక్కల ఉన్నవి చౌకగా కొనుగోలు చేయడం.. సమస్య సృష్టించడం.. నయానో భయానో డిమాండ్ ఉన్న ఆ భూములను తక్కువ ధరకు దక్కించుకొంటున్నారు. నాడు 'అధికార' అండదండలతో రెచ్చిపోయిన వైకాపా 'భూ'తాలు నేడూ తమ పంథాను కొనసాగిస్తున్నాయి. ఆదోని పట్టణ శివారులోని జగనన్న కాలనీకి వెళ్లే రహదారిలో వైకాపా నాయకుడి నిర్వాకం వల్ల వ్యవసాయ భూములు ముంపునకు గురవుతున్నాయి.

**కర్షకుల గగ్గోలు**

"వ్యవసాయమే తమ జీవనాధారం.. పత్తి, వాము, శనగ, పొద్దుతిరుగుడు తదితర పంటలు సాగు చేస్తున్నాం.. వచ్చిన దాంతో కుటుంబాలు పోషించుకుంటున్నాం. వైకాపా నాయకుడు పొలం కొనుగోలు చేశాక గత ఐదేళ్లుగా మా భూములు నీటిలో నానుతున్నాయి. ఫలితంగా పంటలు సాగు చేసుకోలేక అర్ధాకలితో జీవనం సాగిస్తున్నాం.. నీటి మళ్లింపునకు మేము ఏర్పాటు చేసిన పైపులు బలవంతంగా తొలగించారని" రైతులు రమేష్, మహబూబ్‌బాషా, విఠల్, గంగన్న, మల్లికార్జున తదితరులు వాపోయారు. ఆ నాయకుడిని ప్రశ్నిస్తే భూములు అమ్మాలని బెదిరింపులకు దిగుతున్నారు.. జాతీయ రహదారిని ఆనుకుని ఉండటంతో అక్కడ ఎకరా రూ.కోటి వరకు పలుకుతోంది.. తమకు న్యాయం చేయాలని రైతులు విన్నవిస్తున్నారు.



**వంక పూడ్చి.. రైతులను ముంచి**

ఆదోని పట్టణ శివారు మీదుగా 167వ జాతీయ రహదారి వెళ్తోంది. రహదారి నుంచి జగనన్న కాలనీ వైపు వెళ్లే మార్గంలో వైకాపా నాయకుడు ఒకరు సర్వే నంబరు 750లో రెండెకరాలు కొనుగోలు చేశారు. ఆ భూమి వంకకు ఆనుకుని ఉండటంతో అడ్డుగా ఎత్తుగా మట్టిపోశారు. అడ్డుకట్ట వేయడంతో వర్షం నీరు పారే దారిలేక వెనుకున్న వ్యవసాయ పొలాలు ముంపునకు గురవుతున్నాయి.

సర్వే నంబరు- 190, 191లో సుమారు 50 మంది రైతులకు సంబంధించి వంద ఎకరాల సాగు భూమి ఉంది. వర్షం నీరు పారేందుకు వీలుగా ఎప్పటినుంచో వంక ఉంది. ఆ వంకను వైకాపా నాయకుడు పూడ్చేసి తన భూమిలో కలిపేసుకోవడంతో ఈ సమస్య ఉత్పన్నమైంది. గతంలో జగనన్న కాలనీకి నిర్మించిన రహదారి ఆనవాళ్లు లేకుండా పోయింది.

# పట్టణాల్లో జలధార

పార్వతీపురం : రానున్న 30 ఏళ్లలో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు గతంలో తెదేపా ప్రభుత్వం మంజూరు చేసిన ఏఐఐబీ ప్రాజెక్టు పనుల్లో కూటమి ప్రభుత్వం కదలిక తెచ్చింది. ఇటీవల మిగులు పనుల ప్రారంభానికి అవసరమైన అంచనాలను ప్రజారోగ్య శాఖ సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించింది. వీటికి అనుమతులు జారీ చేయడంతో పాటు టెండర్లకు నివేదికలు సిద్ధం చేయాలని ఉత్తర్వులు వచ్చాయి. అన్నీ సక్రమంగా జరిగితే నవంబరులో పనులు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. గత తెదేపా కాలంలో ప్రారంభమైన పనులకు తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం మరోసారి భూమి పూజ చేసింది. గుత్తేదారులకు బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు ఆపేశారు. ప్రస్తుతం ఆ అంచనాలు భారీగా పెరిగాయి. బొబ్బిలిలో నామమాత్రంగా పనులు జరగ్గా, విజయనగరంలో ముషిడిపల్లి పథకం పైపులైను మార్చాల్సి ఉంది.

**కొత్తగా టెండర్లు..**

పార్వతీపురం, బొబ్బిలిలో పనులు చేసిన గుత్తేదారులకు గత ప్రభుత్వంలో బిల్లులు చెల్లించక పనులు అసంపూర్తిగా నిలిచాయి. అక్కడ జరిగిన పనుల మేరకు బిల్లులు చెల్లించి కొత్తగా టెండర్లు పిలవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ రెండు ప్రాజెక్టుల పూర్తికి పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి



నిధి (యూఐడీఎఫ్) బ్యాంకు రుణం మంజూరుకు అనుమతించింది.

**సవరించిన అంచనాలకు ఆమోదం..**

ఉమ్మడి జిల్లాలో సాలూరు, పాలకొండ, నెల్లిమర్ల పట్టణాల్లో పనులకు సంబంధించి అంచనాలు సవరించారు. ఈ మూడు పట్టణాల్లో రూ.46 కోట్ల మేర భారం పడనుంది. గతంలో రూ.171 కోట్లతో పనులు చేపట్టాలని నిర్ణయించగా ప్రస్తుతం రూ.217 కోట్లకు అంచనాలు చేరాయి. వీటిని ప్రభుత్వం ఆమోదించి డీపీఆర్‌లకు అనుమతులు మంజూరు చేసింది. ఇక్కడ ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు(ఏఐఐబీ) నుంచి వచ్చిన నిధులతో పనులు చేయనున్నారు. విజయనగరం, రాజాంలో అమృత్ 2.0 పథకంలో భాగంగా నిర్మించనున్నారు. త్వరలో పనుల ప్రారంభం..: జ్యోతి, ప్రజారోగ్య శాఖ, ఈఈ విజయనగరం తాజాగా పంపించిన డీపీఆర్‌లకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పార్వతీపురం, బొబ్బిలి పట్టణాల్లోని పథకాలకు యూఐడీఎఫ్ నుంచి రుణం పొందేలా అనుమతులు వచ్చాయి. ఏఐఐబీ ప్రాజెక్టులకు త్వరలో టెండర్లు పిలుస్తాం.

# నిలువ నీడే కాదు.. నీరూ ఇస్తోంది!

బొబ్బిలి సాధారణంగా బస్టాప్ అంటే.. వాహనాలు వచ్చే వరకు నిరీక్షించడం, ఎండ, వానకు తడవకుండా ఉండటం. బొబ్బిలి పట్టణంలోని పాత బొబ్బిలి కూడలిలో ఈ బస్టాప్ మాత్రం ప్రత్యేకం. ఇక్కడ సేద తీరడమే కాకుండా 24 గంటలపాటు తాగునీటి వసతి కల్పించారు. అందుకే అంతా వాటర్ బస్టాప్ అని పిలుస్తుంటారు. ఈ దారిలో సుమారు 25 గ్రామాలున్నాయి. ముఖ్యమైన ఈ కూడలిలో ఎలాంటి బస్టాప్, నీటి వసతి లేక ప్రజలు పడుతున్న ఇబ్బందుల్ని గుర్తించిన పాత బొబ్బిలికి చెందిన పాల వ్యాపారి మోదీ శంకరరావు వినూత్నంగా ఆలోచించారు. సొంత నిధులు సుమారు రూ.2 లక్షలతో మూడు నెలల క్రితం బస్టాప్‌ను నిర్మించారు. 1,000 లీటర్ల ట్యాంకును పైన అమర్చారు. కుళాయిలు ఏర్పాటు చేశారు. ప్రయాణికులే కాకుండా పొలాలకు వెళ్లే రైతులు, కూలీలు దాహార్తి తీర్చుకుంటున్నారు. తీర్థయాత్రలు, దూర ప్రాంతాల నుంచి వచ్చినవారు ఆగి స్నానాలు చేసి వెళ్తున్నారు. 'ట్యాంకును రోజుకు అయిదుసార్లు నింపుతున్నా. నెలకు రూ.వేయి విద్యుత్తు బిల్లు వస్తోంది. పదిమందికీ ప్రయోజనం కలుగుతోందనే సంతృప్తితో దీన్ని నిర్వహిస్తున్నా.' అని చెబుతున్నారు శంకరరావు.

చురకలు



## చూపులతోనే హృదయాలు దోచుకుంటున్న అనుపమ!

అనుపమ పరమేశ్వరన్ ఈ మధ్యకాలంలో ఏం చేసినా అది సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గానే నిలుస్తోంది. టిల్లు స్క్వేర్ మూవీతో తన రూట్ మార్చిన ఈ ముద్దుగుమ్మ వరుస ఫోటోషూట్స్, వరుస సినిమాలతో ఊపు మీద ఉంది.అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మ తాజాగా తన ఇన్స్టా ఫోటోలతో మరోసారి స్పెషల్ మీడియాలో హైలెట్ గా నిలిచింది. తాజాగా ఎల్లో కలర్ క్రాప్ టాప్ లో ఉన్న ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఇందులో గోల్డెన్ కలర్ టాప్ ఎల్లో కలర్ బాటమ్ తో ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. స్లీవ్ లెస్ గోల్డెన్ కలర్ టాప్ లో తళుక్కుమని మెరిసిపోతుంది.. అంతేకాదు చెవులకు పెద్ద చెవి దుద్దులను పెట్టి తన లుక్ లో చెవి దుద్దులనే హైలెట్ చేసింది. రింగుల జుట్టుతో మత్తెక్కించే కళ్ళతో ఉన్న ఈ ఫోటోలు సోషల్ మీడియాని షేక్ చేస్తున్నాయి. ఈ హాట్ ఫోటోలను చూస్తే ఎవరైనా సరే అనుపమ అందానికి ఫిదా అవ్వాల్సిందే. అలా ఫోటోలతో కుర్రకారు గుండెల్లో మంట పెట్టిన అనుపమ పరమేశ్వరన్ ఇలాంటి ఫోటోల వల్లే సోషల్ మీడియాలో మరింత ఫేమస్ అవుతుంది. ముఖ్యంగా ఈ హీరోయిన్ ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో సాంప్రదాయమైన లుక్ తో అందరినీ కట్టిపడేసింది. కానీ రాను రాను అందరిలాగే ఈ హీరోయిన్ కూడా



తయారైంది అనేలా కొన్ని విమర్శలు ఎదుర్కొంది. ఎందుకంటే సినిమాల్లోకి వచ్చినా కొత్తలో అనుపమ పరమేశ్వరన్ ఒక్క సినిమాలో కూడా బోల్డ్ పాత్రలో నటించలేదు. పొట్టి బట్టలు వేసుకోలేదు. కానీ రౌడీ బాయ్స్ సినిమాతో రూట్ మార్చేసింది. ఈ సినిమాలో కాస్త బోల్డ్ గా నటించడంతోపాటు రొమాంటిక్ సన్నివేశాల్లో రెచ్చిపోయి నటించింది. దాంతో ఈ హీరోయిన్ ని ఇలాంటి పాత్రలో కూడా తీసుకోవచ్చని దర్శక నిర్మాతలకు ఓ క్లారిటీ వచ్చింది. డీజే టిల్లు సినిమాకి సీక్వెల్ గా వచ్చిన టిల్లు స్క్వేర్ సినిమాలో మాత్రం పూర్తి బోల్డ్ గా కనిపించింది. పొట్టి పొట్టి బట్టలు వేయడంతో పాటు లిప్ లాక్ లతో రెచ్చిపోయి అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఎందుకంటే అప్పటివరకు ఈ హీరోయిన్ ని అభిమానించిన అభిమానులు కూడా ఇదేంటి ఈ హీరోయిన్ ఇలా మారిపోయింది అని నోరెళ్లబెట్టి టిల్లు స్క్వేర్ సినిమాలో ఆమె పర్ఫామెన్స్ ను చూసి షాక్ అయిపోయారు. అయితే అలాంటి అనుపమ పరమేశ్వరన్ టిల్లు స్క్వేర్ సినిమా తర్వాత బోల్డ్ పాత్రలకు కూడా ఓకే చెప్పి మరిన్ని అవకాశాలు అందుకుంటుంది.అలా ఈ హీరోయిన్ టిల్లు స్క్వేర్ మూవీ తర్వాత పరదా అనే లేడీ ఓరియంటెడ్ మూవీ తో వచ్చింది. పరదా అనే డిఫరెంట్ కాన్సెప్ట్ ఉన్న మూవీని ఎంచుకొని సమాజంలో ఆడవాళు ఎదుర్కొనే ఇబ్బందుల గురించి ఈ సినిమాలో చూపించగా.. అందులో అద్భుతంగా నటించింది. కానీ ఈ సినిమా పెద్దగా విజయం సాధించలేదు. ఆ తర్వాత వెంటనే బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తో కిష్కింధపురి అనే మూవీ తో వచ్చి దెయ్యం పాత్రలో అందర్నీ భయపెట్టేసింది. అలా వరుస సినిమాలు చేస్తూ సౌత్ ఇండస్ట్రీలో బిజీ బిజీగా ఉంటున్న ఈ హీరోయిన్ చేతిలో ప్రస్తుతం ఎల్ క్లాసికో,ది పెట్ డిటెక్టివ్ అనే మలయాళ సినిమాలతో పాటు తెలుగులో భోగి, తమిళంలో బైసన్ అనే సినిమాలు ఉన్నాయి.

## అంతా కోల్పోయినా ఇంకా ఆశతో తూనీగ రియా చక్రవర్తి

బాలీవుడ్ ట్యాలెంటెడ్ హీరో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మరణంతో ముడిపడిన అన్ని కేసుల నుంచి రియా చక్రవర్తి, ఆమె కుటుంబం బయటపడిన సంగతి తెలిసిందే. సుశాంత్ సింగ్ మరణానంతరం నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ), ఈడీ, సిట్ సహా పలు దర్యాప్తు సంస్థలు అప్పటి ప్రియురాలు రియా చక్రవర్తి, ఆమె సోదరుడు సోవిక్ చక్రవర్తిని అరెస్ట్ చేసి విచారించాయి. కానీ అన్ని కేసుల నుంచి రియా చక్రవర్తి, ఆమె సోదరుడు నిరపరాధులుగా బయటపడ్డారు. మీడియాలో చాలా కథనాలు రియా చక్రవర్తిని దోషిగా ప్రకటించగా, దానిపై ఇప్పటికీ రియా సెటైర్లు వేస్తూనే ఉంది. ఒక నేరంపై విచారణ తేలక ముందే సోషల్ మీడియాలు రియా చక్రవర్తిని అపరాధిని చేసాయి. అయితే ఈ కేసులో నాలుగేళ్ల పోరాటం ఫలించి చివరికి నిరపరాధిగా నిరూపించుకుని రియా బయటపడింది. అయితే



రియా చక్రవర్తి అన్ని కేసుల నుంచి బయటపడిన తర్వాత కూడా తన వద్ద నుంచి లాక్కున్న పాస్ పోర్ట్ ని తిరిగి ఇవ్వకపోవడం ఆశ్చర్యపరిచింది. ఎట్టకేలకు సంబంధిత అధికారుల నుంచి క్లియరెన్స్ వచ్చింది. రియా చక్రవర్తి చేతికి పాస్ పోర్ట్ అందిందని తెలుస్తోంది. ఇకపై రియా స్వేచ్ఛగా తూనీగలా విదేశాలకు కూడా ఎగిరిపోవచ్చు. అన్ని బంధనాలను తెంచుకుని తాను ఇప్పుడు స్వేచ్ఛగా ఉన్నానని రియా ఆనందం వ్యక్తం చేసింది. ఐదు సంవత్సరాలు ఎంతో ఓపిగ్గా ఉన్నాను. ఓపిక నా నిజమైన పాస్ పోర్ట్ అని రియా చక్రవర్తి వ్యాఖ్యానించింది. ఐదేళ్ల క్రితం రియా చక్రవర్తి నటించిన చిత్రం చెహ్రే. ప్రస్తుతం రియా తదుపరి ప్రాజెక్ట్ కోసం ఎదురుచూస్తున్నారు. ఆమె తన కెరీర్‌ను తిరిగి ప్రారంభించడానికి ఉత్సాహంగా వేచి చూస్తోంది.అయితే నిరపరాధి అని నిరూపించుకున్న తర్వాత కూడా దర్శకనిర్మాతలు ఈ భామకు అవకాశాలివ్వడానికి సిద్ధంగా ఉన్నారా? అంటే ఈ ప్రశ్నకు ఇంకా సమాధానం లేదు. అంతా కోల్పోయినా కానీ ఇంకా ఆశతో ఉన్నానని రియా చక్రవర్తి చెబుతోంది. ఈ భామ ఎం.ఎస్.రాజు దర్శకత్వం వహించిన తూనీగ తూనీగ చిత్రంలో నటించిన సంగతి తెలిసిందే.




## పార్ట్ -3 లో మోస్ట్ వాంటెడ్ చిత్రాలివే!



ఫ్రాంచైజీలు, సినిమాటిక్ యూనివర్స్ లు, సీక్వెల్స్ అంటూ సౌత్ ఇండస్ట్రీలో ఒకటే జోరు కనిపిస్తోంది. ఫ్రాంచైజీల విషయంలో బాలీవుడ్ నే మించిపోయేలా కనిపిస్తోంది టాలీవుడ్. వరుస విజయాలతో ఫ్రాంచైజీలతో అంతకంతకు హైప్ తీసుకు రావడం సౌత్ కే చెల్లిందా? అనిపిస్తుంది. అలాంటి ఫ్రాంచైజీస్ లో మోస్ట్ వాంటెడ్ గా మారిన మూడు ఫ్రాంచైజీలు ఇవి. పుష్ప, కాంతార, కేజీఎఫ్, కార్తికేయ. పుష్ప నుంచి ఇప్పటికే ది రైజ్ ..ది రూల్ అంటూ రెండు భాగాలు రిలీజ్ అయి పాన్ ఇండియాలో ఎలాంటి సంచలనాలు నమోదు చేసాయో చెప్పాల్సిన పనిలేదు.

**హిట్ ఫ్రాంచైజీల నుంచి పార్ట్ -3...** ఇప్పుడిదే ఫ్రాంచైజీ నుంచి పుష్ప3 ని కూడా దర్శకుడు సుకుమార్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అదెప్పుడు ఉంటుందో తెలియదు కానీ కచ్చితంగా ఉంటుందని మాత్రం వెల్లడించారు. అలాగే కన్నడ నుంచి రిలీజ్ అయిన కేజీఎఫ్ రెండు భాగాలు పాన్ ఇండియాలో అంతే సంచలనమయ్యాయి. ఈ నేపథ్యంలో కేజీఎఫ్ 3 కూడా ఉం టుందని దర్శకుడు ప్రశాంత్ నీల్ ప్రకటించాడు. అదెప్పుడు పట్టాలెక్కిస్తారు అన్నది మాత్రం క్లారిటీ లేదు. కానీ ఈసారి మాత్రం సీ బ్యాక్ డ్రాప్ లో కథ సాగుతుందన్నది వాస్తవం. అలాగే కార్తికేయ 2తో దర్శకుడు చందు మొండేటి పాన్ ఇండియా వరల్డ్ లోకి అడుగు పెట్టిన సంగతి తెలిసిందే.

**కొత్త అప్ డేట్స్ పై అప్పుడే ఆసక్తి:** ఎలాంటి అంచనాలు లేకుండా రిలీజ్ అయిన సినిమా హిందుత్వం కాన్సెప్ట్ తో పాన్ ఇండియాకి కనెక్ట్ అయింది. దీంతో కార్తికేయ 3ని ఏకంగా గ్లోబల్ రేంజ్ రీచ్ ఉండేలా చేస్తారనే ప్రకటన వచ్చేసింది. కానీ ఆ ప్రాజెక్ట్ ఎప్పుడు మొదలవుతుంది? అన్నది సరైన క్లారిటీ లేదు.

ఖాళీ సమయంలో చందు మొండేటి ఆ స్క్రిప్ట్ వర్క్ లో బిజీ అవు తున్నాడు. అలాగే మరో కన్నడ ఫ్రాంచైజీ కాంతార ఎంత పెద్ద సక్సెస్ అయిందో చెప్పాల్సిన పనిలేదు. ఎలాంటి అంచనాలు లేకుండా రిలీజ్ అయిన కాంతార అనూహ్య విజయం అనంతరం రీసెంట్ రిలీజ్ కాంతార చాప్టర్ వన్ ఏ రేంజ్లో హిట్ అయిందో తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంతార చాప్టర్ -2ని కూడా ప్రకటించారు.

అయితే ఈ నాలుగు చిత్రాల నుంచి రిలీజ్ అయ్యేది పార్ట్ 3 భాగాలు కావడం విశేషం. పాన్ ఇండియాలో ఈ మూడవ భాగంపై అంచనాలు భారీగా ఉన్నాయి.

ఎలాంటి కథతో వస్తారు? అందులో పాత్రలు ఎలా ఉండ బోత్తున్నాయి? అన్న ఆసక్తి ఇప్పటి నుంచే మొదలైంది.వీటిపై అప్ డేట్స్ రావడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉంది.

## 80s రీ యూనియన్‌కు స్పెషల్ ఫ్లైట్‌లో చిరు-వెంకీ.. మరి బాలకృష్ణ?



1980వ దశకం... భారతదేశ చలనచిత్ర రంగంలో ఎందరో సూపర్ స్టార్ హీరోలను అందించిన దశకం..! హీరోల్లో బాలీవుడ్‌లో అనిల్ కపూర్, జాకీశ్రాఫ్, తెలుగులో చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్, మలయాళంలో మమ్ముట్టి, మోహన్ లాల్, తమిళంలో రజనీకాంత్, కమల్‌హాసన్, ప్రభు, భాగ్యరాజ్, సత్యరాజ్, అర్జున్, కన్నడలో అంబరీశ్..! హీరోయిన్లలో ఖుష్బూ, రాధిక, సుహాసిని మణిరత్నం, లిజీ, జయసుధ, జయప్రద, రమ్యకృష్ణ, రేవతి, శోభన, రాధ, అంబిక, సుమలత ఇలా ఎందరో మేటి నటులు పుట్టుకొచ్చిన దశకం. వాస్తవంగా చెప్పాలంటే వీరంతా భారత దేశ స్థాయి నటులు. సహజ నటనతో ఆకట్టుకున్న చివరి తరం వీరిదే అనికూడా చెప్పొచ్చేమో..? మరి ఇలాంటి వారంతా ఒకదగ్గర చేరితే..? ఆ ఆలోచనే 80s రీ యూనియన్.

**సుహాసిని, లిజీ, ఖుష్బూ కృషితో..** అలనాటి మేటి హీరోయిన్లు సుహాసిని, లిజీ, ఖుష్బూ కృషితో మొదలైంది 80s రీ యూనియన్. అనేక సినీ పరిశ్రమల నుంచి 1980లలో వృత్తి జీవితాన్ని ప్రారంభించిన నటీనటులు చాలామంది ఉన్నారు. సుహాసిని, లిజీ, ఖుష్బూ ఆలోచనలతో తొలిసారిగా 2009లో మొదలైంది. 1980ల్లో కెరీర్ ప్రారంభించిన, ఊపందుకున్నవారితో కూడిన ఈ సంఘంలో ఏటా నటీనటులంతా ఏదో ఒక కలర్ కోడ్ థీమ్‌తో పాల్గొని ఆటపాటలతో సందడి చేస్తారు.

కొన్నేళ్ల కిందట హైదరాబాద్‌లోని మెగాస్టార్ చిరంజీవి ఇంట్లో జరిగిన కార్యక్రమంలో బ్లాక్ థీమ్‌తో హాజరయ్యారు. 2015లో రెడ్ కలర్ థీమ్, 2017లో డీప్ పర్పుల్‌ను పాటించారు.

**ఈ ఏడాది చెన్నైలో...** 80s రీ యూనియన్‌కు ఈ ఏడాది వేదిక చెన్నై. వేదిక ఎక్కడ? ఎవరి ఇంట్లో అనేది తెలియాల్సి ఉంది. కాగా, ఈ కార్యక్రమానికి తెలుగు స్టార్లు వెంకటేశ్, చిరంజీవి స్పెషల్ ఫ్లయిట్లో వెళ్లారు. వీరిద్దరూ ప్రయాణానికి ముందు తీసుకున్న ఫొటో బయటకు రాగా వైరల్ అయింది. చిరంజీవి ప్రస్తుతం మన శంకర వరప్రసాద్ గారు సినిమాలో నటిస్తున్నారు. ఇందులో వెంకటేష్ కూడా ప్రధాన పాత్రధారి. మొదటినుంచే సన్నిహితులైన వీరిద్దరూ ఒక సినిమాలో కలిసి నటించడం తొలిసారి.

**మరి బాలయ్య సంగతో...?...** గతంలో జరిగిన 80s రీ యూనియన్‌కు బాలకృష్ణ కూడా హాజరయ్యారు. సరదాగా ఆడిపాడుతూ గ్రూప్ ఫొటోలు దిగుతూ సందడి చేశారు. అసలు బాలయ్య ఎక్కడ ఉంటే అక్కడ ఉత్సాహం. తన చుట్టూ ఉన్నవారిలోనూ జోష్ నింపుతారని చెబుతుంటారు. అయితే, ఇటీవల ఏపీ అసెంబ్లీలో బాలకృష్ణ మాట్లాడుతూ చిరంజీవి గురించి చేసిన వ్యాఖ్య దుమారం రేపింది. తన సహజ శైలిలో బాలకృష్ణ మాట్లాడినా.. అది ప్రజల్లోకి వేరేగా వెళ్లిందనే అభిప్రాయం వ్యక్తమైంది. దీనిని సొమ్ము చేసుకోవాలని కొందరు ప్రయత్నించారు. అయితే, ఏపీ రాజకీయాల్లో దుమారం రేపిన ఈ పరిణామం అనంతరం ఏపీ సీఎం చంద్రబాబు.. చిరంజీవి తమ్ముడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇంటికి వెళ్లి సంభాషించారు. బాలకృష్ణ మాత్రం ఇప్పటివరకు స్పందించలేదు. ఈ నేపథ్యంలో ఆయన 80s రీ యూనియన్‌కు వెళ్తారా? అనేది ఆసక్తికరంగా మారింది. ఏమో.. సంచలనమే తన నైజమైన బాలయ్య అలా చేసినా చేస్తారేమో..? చిరంజీవిని కలుస్తారేమో? ఏం జరుగుద్దో చూద్దాం.

## బ్లాక్ అవుట్ ఫిట్ లో మరింత అందంగా!

మృణాల్ ఠాకూర్.. ప్రముఖ డైరెక్టర్ హను రాఘవపూడి దర్శకత్వంలో మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ నటించిన పూర్తి స్థాయి తొలి తెలుగు చిత్రం 'సీతారామం'. ఈ సినిమా కంటే ముందు మహానటి సావిత్రి బయోపిక్ ఆధారంగా వచ్చిన 'మహానటి' సినిమాలో జెమినీ గణేషన్ పాత్ర పోషించిన ఈయన.. ఆ తర్వాత సీతారామం సినిమాతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ సినిమా ద్వారానే తెలుగు ప్రేక్షకులను పలకరించింది మృణాల్ ఠాకూర్. ఇందులో సాంప్రదాయంగా చీరకట్టులో కనిపించి, సీత పాత్రతో అందరి హృదయాలను దోచుకుంది. ఇందులో ఆమె చీరకట్టు బొట్టు అభిమానులను ఆకట్టుకోవడమే కాకుండా తెలుగు సినీ ప్రేక్షకులు కూడా ఈమెను సొంత అమ్మాయిగా ఓన్ చేసేసుకున్నారు. అంతేకాదు



పలు చిత్రాలలో అవకాశాలు ఇవ్వాలని అభిమానులు కూడా డిమాండ్ చేసిన విషయం తెలిసిందే.అలా సీతారామం విజయం సాధించడంతో నాచురల్ స్టార్ నాని హీరోగా నటించిన 'హాయ్ నాన్న' సినిమాలో జోష్ణ పాత్రతో మరొకసారి పలకరించింది. ఈ సినిమాతో కూడా మంచి విజయాన్ని అందుకుంది. ఆ తర్వాత విజయ్ దేవరకొండ తో కలిసి 'ది ఫ్యామిలీ స్టార్' సినిమా చేసింది. కానీ ఈ సినిమా పెద్దగా విజయాన్ని అందించలేదు. ఇప్పుడు అడివి శేష్ హీరోగా నటిస్తున్న డెకాయిట్ సినిమా నుండి శృతిహాసన్ తప్పుకోవడంతో ఆ స్థానాన్ని భర్తీ చేసిన మృణాల్ త్వరలోనే ఈ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇదిలా ఉండగా తాజాగా ఈ ముద్దుగుమ్మ ఇంస్టాగ్రామ్ ద్వారా షేర్ చేసిన కొన్ని ఫోటోలు అభిమానులను, ఫాలోవర్స్ ను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి .

అందులో బ్లాక్ ఔట్ఫిట్ లో కనిపించిన ఈమె తన అందంతో అబ్బురపరిచింది. విషయంలోకి వెళ్తే.. ముంబైలోని నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్ లో జరి గిన బ్వగారి సెర్పెంటి ఇన్ఫినిటీ ఎగ్జిబిషన్ కి టాలీవుడ్ బాలీవుడ్ అని తేడా లేకుండా చాలామంది నటీమణులు తమ ఫ్యాషన్స్ సెన్స్ తో సందడి చేశారు. అందులో భాగంగానే హీరోయిన్ మృణాల్ ఠాకూర్ కూడా హాజరయ్యింది.ఇందులో మృణాల్ ఠాకూర్ ఎగ్జిబిషన్లో లీనమై ఆర్ట్ ఇన్స్టాలేషన్ మధ్య అద్భుతమైన నల్లటి ఔట్ఫిట్ లో ఫోటోలకు ఫోజులిచ్చింది.

## రుక్మిణికి ఆ హీరో లవ్ స్టోరీస్ ఇష్టమట..!

కన్నడ భామ రుక్మిణి వసంత్ ప్రస్తుతం సోషల్ మీడియా ట్రెండింగ్ లో ఉంటుంది. సప్త సాగరాలు దాటి సినిమాతో సౌత్ ఆడియన్స్ మనసులు గెలిచిన ఈ అమ్మడు రీసెంట్ గా రిలీజైన కాంతారా చాప్టర్ 1 లో అదరగొట్టేసింది.

సినిమాలో కనకావతి రోల్ లో రుక్మిణి తనకు వచ్చిన అవకాశాన్ని పర్ఫెక్ట్ గా యూజ్ చేసుకుంది. కాంతారా 1 తో అమ్మడు మరింత క్రేజ్ సంపాదించుకుంది. సినిమాలో ఆమె క్లిప్స్ ని సోషల్ మీడియాలో తెగ వైరల్ చేస్తున్నారు రుక్మిణి వసంత్ ఫ్యాన్స్.

**ఎన్టీఆర్ డ్రాగన్ లో రుక్మిణి..** స్టార్ హీరోయిన్ క్వాలిటీస్ అన్నీ ఉన్న రుక్మిణి తెలుగులో నిఖిల్ తో అప్పుడో ఇప్పుడో ఎప్పుడో సినిమా చేసింది. నెక్స్ట్ ఎన్టీఆర్ డ్రాగన్ లో అమ్మడు నటిస్తుంది. రుక్మిణి ఇప్పటికే తమిళంలో వరుస సినిమాలు చేస్తుంది. విజయ్ సేతుపతితో ఏస్,



శివ కార్తికేయన్ తో మదరాసి సినిమాల్లో నటించింది అమ్మడు. ఐతే రుక్మిణి తన ఇంటర్వ్యూస్ లో ఎప్పుడు తనకు ఇష్టమైన హీరో ఎవరంటే ఆమె తమిళ స్టార్ సూర్య పేరు చెబుతూ వచ్చింది. సూర్య సార్ అంటే చాలా ఇష్టం. ఆయన చేసిన లవ్ స్టోరీస్ చాలా ఇష్టమంటుంది అమ్మడు. రుక్మిణి అలా చెబుతున్న క్లిప్స్ ని సూర్య ఫ్యాన్స్ తెగ వైరల్ చేస్తున్నారు. ఎలాగు అమ్మడికి మంచి ఫాలోయిన్ వచ్చింది కాబట్టి ఆమెకు ఇష్టమైన హీరో సూర్యతో జత కట్టే ఛాన్స్ ఇస్తే బెటర్ అని అంటున్నారు. రుక్మిణి వసంత్ కూడా సూర్య తో నటించే అవకాశం కోసం ఎదురుచూస్తున్నట్టు ఉంది.

**ఆడియన్స్ అంతా ఆమె మాయలో..** ఇక తెలుగులో రుక్మిణికి చరణ్ అంటే ఇష్టమని చెప్పింది. సో ఇటు ఎన్ టీ ఆర్ తర్వాత అమ్మడు చరణ్ తో కూడా నటించే ఛాన్స్ లు ఉన్నాయి. ఏది ఏమైనా రుక్మిణి వసంత్ ప్రస్తుతం నేషనల్ ఆడియన్స్ అంతా తన మాయలో పడి ఊగిపోతున్నారు. తప్పకుండా అమ్మడికి ఇంకా చాలా మంది అవకాశాలు వచ్చి పాన్ ఇండియా లెవెల్ లో అద్భుతాలు చేసేలా ఉందని చెప్పొచ్చు. కాంతారా 1లో తన రోల్ కి పూర్తిస్థాయిలో న్యాయం చేసిన రుక్మిణి కోసం మరిన్ని ఛాలెంజింగ్ రోల్స్ రాసేందుకు అవకాశం ఇస్తుంది. అంతేకాదు లవ్ స్టోరీస్, కమర్షియల్ సినిమాల్లో నటించడం కూడా ఇష్టమని అంటుంది అమ్మడు. సౌత్ నుంచి నేషనల్ క్రష్ గా మారింది కన్నడ భామ రష్మిక మందన్న. ఐతే ప్రస్తుతం ఆమె వరుస సినిమాలతో బిజీ అయ్యింది. ఐతే రష్మిక తర్వాత నేషనల్ క్రష్ ట్యాగ్ ని రుక్మిణికి ఇచ్చేయాలని కొత్త నేషనల్ క్రష్ రుక్మిణి వసంత్ అని సోషల్ మీడియాలో ఒకటే హడావిడి జరుగుతుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536